www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★★




బలహీనపడుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 06
జపాన్‌కు తొలి మహిళా ప్రధానమంత్రి తకైచీ 02
రాజకీయ పార్టీలకు రెండు పరీక్షలు 06

సంపుటి 08, సంచిక: 304 | ఆదివారం | 05-10-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బిజెపి అనుబంధ సంస్థగా ఇసి



● రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ విమర్శ ● 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా సంతకాల సేకరణ ● ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి ● ఓటు చోరీతోనే మరోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి : మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ఎన్నికల కమిషన్ బిజెపికి అనుబంధ సంఘంగా పనిచేస్తుందని ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ విమర్శించారు. ఎఐసిసి చేపట్టిన ఓట్ చోరీ సంతకాల సేకరణ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలతో శనివారం మీనాక్షి నటరాజన్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు డిసిసి అధ్యక్షులు, ఆఫీసు బేరర్లు, కార్పొరేషన్ చైర్మన్ లు, అనుబంధ సంఘాల చైర్మన్ లు, అధికార ప్రతినిధులు.. పార్టీ జిల్లా ఇంచార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ...ఓట్ చోరీ కార్యక్రమంలో మనం ప్రతి ఒక్కరం భాగస్వామ్యం తీసుకోవాలని కోరారు. తెలంగాణ లో ప్రకృతి వైపరీత్యం వల్ల కొంత ఆలస్యం జరిగిందని, ఎఐసిసి ఓట్ చోరీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో వంద మందికి తక్కువ కాకుండా సంతకాల సేకరణ జరగాలన్నారు. ప్రతి కాంగ్రెస్ నాయకులు వారి ఓటు హక్కు ఉన్న బూత్‌లో సంతకాల సేకరణ చేపట్టి పెద్దఎత్తున చేయించాలన్నారు. అక్టోబరు 15 నాటికి సంతకాల సేకరణ పూర్తి చేసి ఎఐసిసికి పంపాలని సూచించారు. ఈ విషయంలో నాయకులు అందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా

తరువాయి 2లో



## రూ.3,600 కోట్ల విలువ గల ప్రభుత్వ భూమి స్వాధీనం

● భారీ బందోబస్తు మధ్య కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు
● 36 ఎకరాల్లో అక్రమ నిర్మాణాల తొలగింపు ● హైకోర్టు తీర్పు మేరకే చర్యలని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి

హైదరాబాద్ కొండాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ నిర్మాణాలను శనివారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. సుమారు రూ.3,600 కోట్ల విలువైన భూమిని హైడ్రా యంత్రాంగం స్వాధీనం చేసుకుంది. ఆర్‌టిఏ కార్యాలయం పక్కన భిక్షపతినగర్‌లో సర్వే నెంబర్ 59లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది జెసిబితో తొలగించారు. పోలీసు యంత్రాంగంతో కలిసి హైడ్రా సిబ్బంది తెల్లవారు జాము నుంచి జెసిబిల సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగాయి. రెండు కిలోమీట ర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసి స్థానికులను ఆ ప్రాంతానికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జా చేశారు. హైకోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో హైడ్రా ఆక్రమణలను తొలగించి తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ భూముల విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారు. గతంలో ఈ భూమి విషయంలో స్థానికులు రంగారెడ్డి కోర్టును ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆ తర్వాత దానిని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వెళ్లింది. విచారణ జరిపిన కోర్టు తాజాగా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించారు. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వే నెంబర్ 59లో 12 మంది స్థానికులు 36 ఎకరాలను కబ్జా చేశారని, వాటి విలువ సుమారు 3,600 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. మరోవైపు 60 ఏళ్లుగా ఈ భూములు తమ అధీనంలోనే ఉన్నాయని రైతులు అంటున్నారు.

**కూల్చివేతల సమాచారం లేదు..** కూల్చివేస్తున్నామని తమకు ఎటువంటి సమాచారం లేదని స్థానికులు అన్నారు. నోటీసులు కూడా రాలేదన్నారు. హైడ్రా వాళ్లు వచ్చి పోలీసులను పెట్టి కూల్చారని చెప్పారు. ఎందుకు కూల్చుస్తున్నారో

తరువాయి 2లో

సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా

## డిసెంబర్ 26న ఖమ్మంలో జాతీయ స్థాయి బహిరంగ సభ

### నేడు ఖమ్మంలో సన్నాహక సమావేశం

జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, దక్షిణాది రాష్ట్రాల కార్యదర్శుల రాక

ప్రజాపక్షం/ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఉజ్వల చరిత్రలో ప్రముఖ పాత్ర పోషించిన తెలంగాణ గడ్డకు గొప్ప గౌరవం దక్కింది. ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని జాతీయ స్థాయి బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఖమ్మం నగరానికి లభించింది. సిపిఐ ఆవిర్భావ దినోత్సవం డిసెంబర్ 26న ఈ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగసభను చరిత్రలో నిలిచిపోయే రీతిలో నిర్వహించాలని సిపిఐ పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా ఖమ్మంలోని ఎస్.ఆర్.గార్డెన్స్‌లో ఆదివారం నాడు ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహిస్తోంది. దీనికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సహా, సిపిఐ దక్షిణాది రాష్ట్రాల కార్యదర్శులు హాజరు కానున్నారు. సమావేశ వివరాలను సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు శనివారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో చారిత్రక జాతీయ స్థాయి బహిరంగసభను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా పోరాటాలు హక్కుల కోసం పోరాడుతూ దేశ రాజకీయాలలో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను డిసెంబర్ 26న నిర్వహించుకునే అవకాశం తెలంగాణ రాష్ట్రానికి, అందులో ఖమ్మంకు దక్కడం గౌరవంగా భావిస్తున్నామని అన్నారు.




### నేడు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం

సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం ఖమ్మంలో జరగనుంది. గిరిప్రసాద్ భవన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ఇటీవల షెడ్యూల్ వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రధానంగా చర్చ జరగనుంది.

ఈ సభను జయప్రదం చేసేందుకు ఆదివారం జరిగే సన్నాహక సమావేశానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ నాయకులు బినొయ్ విశ్వం, డాక్టర్ కె. నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,

తరువాయి 2లో

## కాళేశ్వరం బ్యారేజీ మరమ్మతులపై 15లోగా దరఖాస్తులు

**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి డిజైన్‌లు రూపకల్పనకు కోసం అక్టోబర్ 15 లోగా ఆసక్తివ్యక్తీకరణ (ఇఒఐ)కు రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల మరమ్మతుల కోసం ప్రముఖ డిజైన్ ఏజెన్సీలు ఇఒఇ కింద దరఖాస్తు చేసుకోవాలని ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవెలప్‌మెంట్ (ఐ అండ్ కాడ్) విభాగం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ మేడిగడ్డ బ్యారేజీ కృంగిపోయి, బీటలు పారడంతో దానిని వినియోగించవద్దని ఎన్‌ఎస్‌డిఎ హెచ్చరించింది. అలాగే మిగతా రెండు బ్యారేజీలలో కూడా నీరు నింపితే ఇబ్బంది తలెత్తుతుందని తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఆ బ్యారేజీల నిర్మాణంపై నియమించిన జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం ఆ అంశంపై సిబిఐ దర్యాప్తునకు ఇవ్వాలని శాసనసభలో తీర్మానించింది.

## గాజాలో మనుగడపై చిగురించిన ఆశ

● యుద్ధం నిలుపుదలకు ఇజ్రాయెల్ ఆదేశం
● బందీల విడుదలకు హమాస్ సంసిద్ధత

**జెరూసలెం :** గాజాలో యుద్ధం ఆపేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో గాజాలో ఉన్న సైన్యానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం నుండి యుద్ధం ఆపాలని ఆదేశాలు వెళ్ళాయి. ఇజ్రాయెల్ పత్రిక శనివారం మధ్యాహ్నం ఈ విషయాన్ని ధృవీకరించింది. హమాస్ శాంతికి సిద్ధంగా ఉందని ట్రంప్ ప్రకటించడానికి ముందుగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గాజాలో బాంబింగ్‌లు ఆపేయాలని ఈ సందర్భంగా నెతన్యాహూను ట్రంప్ కోరారు. ఆ తర్వాత శనివారం నెతన్యాహూ ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల యుద్ధ ముగింపు శాంతి ప్రణాళికలో మొదటి దశను అమలు చేసేందుకు ఇజ్రాయెల్ సన్నద్ధమైందని చెప్పారు. ఈ పరిణామాలపై దక్షిణాఫ్రికా సహా పలు దేశాలు హర్షం ప్రకటించాయి. పాలస్తీనా అథారిటీ ఉపాధ్యక్షుడు హుస్సేన్ అల్ షేక్ ఈ పరిణామాలను స్వాగతించారు. మరోవైపు హమాస్ కూడా సజీవ–నిర్జీవ



బందీల విడుదలకు సుముఖత వ్యక్తం చేసింది. ఐతే ట్రంప్ శాంతి ప్రణాళికలో కొన్ని భాగాలను సమ్మతిస్తున్నామని, మిగిలిన వాటిల్లో మార్పులు,చేర్పులు చేయాలని,ఈ విషయాలపై తదుపరి సంప్రదింపులు జరగాల్సిన అవసరం ఉందని, కొన్ని షరతులు కూడా పాటించాల్సి ఉందని హమాస్ చెప్పినప్పటికీ తక్షణం బందీల విడుదలకు మాత్రం అంగీకరించింది. హమాస్ ఆయుధాలను వదిలిపెట్టడం, గాజాలో పాలనను పాలస్తీనా టెక్రోక్రాట్స్‌కు స్వాధీనం చేయాలన్నవి ప్రధానాంశాలు. ట్రంప్ కూడా హమాస్ అంగీకారంపట్ల హర్షం ప్రకటించారు. శరవేగంగా జరుగుతున్న ఈ పరిణామాలపట్ల ఈజిప్టు, ఖతార్ దేశాల మధ్యవర్తులు కూడా హర్షం ప్రకటించారు. దీంతో ఇరవైనాలుగు నెలలుగా ఇజ్రాయెల్ నుండి అపహరణకు గురైన తమ ప్రియతమ బంధువుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబీకులకు పెద్ద ఊరట లభించింది. ట్రంప్ 20 అంశాల ప్రతిపాదన ప్రకారం బందీలను విడుదల చేశాక ఇజ్రాయెల్ జైళ్ళల్లో ఉన్న వందలమంది పాలస్తీనా ఖైదీలను కూడా నెతన్యాహూ విడుదల చేయాలి. ఒప్పందాన్ని అంగీకరించిన 72 గంటల్లో ఖైదీలను హమాస్ విడుదల చేయాల్సి ఉంటుంది. హమాస్ వద్ద ఇంకా 48 మంది ఖైదీలు ఉన్నారని భావిస్తున్నారు. కానీ ట్రంప్ అంచనా ప్రకారం కేవలం 20 మంది మాత్రమే సజీవులైన బందీలు ఉన్నారు. మధ్యప్రాచ్యంలో కల్లోల హత్యాకాండ ప్రారంభమై రాబోయే మంగళవారం

తరువాయి 2లో

## రైతులకు అన్యాయం జరగనివ్వను

● ట్రిపుల్ ఆర్ దక్షిణభాగం విషయంలో ఆందోళన వద్దు ● త్వరలో సిఎంతో మాట్లాడి కమిటీ వేస్తాం ● రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ● రెండు నెలల్లో ట్రిపుల్ ఆర్ ఉత్తరభాగానికి టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడి

ప్రజాపక్షం/చిట్యాల



రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. దక్షిణ భాగం విషయంలో రైతుల అనవసర ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్ అండ్ బి మినిస్టర్ అయిన తాను రైతుల అంగీకారం తోనే ముందుకు పోతామని తేల్చిచెప్పారు. నేను రైతు బిడ్డను..రైతుకు అన్యాయం జరిగితే ఊరుకుంటానా అంటూ త్వరలోనే ముఖ్యమంత్రి తో మాట్లాడి మంత్రుల కమిటీ వేస్తామని తనను కలిసిన రైతులకు హామీ ఇచ్చారు. శనివారం మంత్రి చిట్యాలలో మీడియాతో మాట్లాడారు ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించిందని మంత్రి కోమటిరెడ్డి నాటి కెసిఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధర్నాలో పాల్గొని, ప్రజా ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేట్ ఇప్పించి రైతులను ఒప్పించానని అన్నారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూర్తి చేసామని చెప్పారు. నాలుగు లేన్ల ఆర్ఆర్ఆర్ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల

తరువాయి 2లో




## డల్లాస్‌లో కాల్పులు

● హైదరాబాద్ వాసి మృతి
● బిఎన్‌రెడ్డి నగర్ టీచర్స్ కాలనీలో విషాదం
● దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్/ఎల్‌బి నగర్

అమెరికాలో దుండగులు జరిగిన కాల్పుల్లో హైదరాబాద్‌కు చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఉన్నత చదువుల కోసం అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ నగరానికి రంగారెడ్డి జిల్లా ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్2 నివాసి పోలే చంద్రశేఖర్ (28) 2023 జూలైలో వెళ్లాడు. టెక్సాస్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసి. ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో

తరువాయి 2లో




హైదరాబాద్, సికిందరాబాద్ పరిధిలో

## ఆర్‌టిసి బస్సుల్లో చార్జీల పెంపు

సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఇ–ఆర్డినరీ, ఇ–ఎక్స్‌ప్రెస్‌లో మొదటి మూడు స్టేజీలకు రూ.5, నాలుగవ స్టేజీ నుంచి రూ.10 అదనంగా వడ్డన

6 నుంచి అమలులోకి 03

వచ్చే వారం నుంచి పత్తి

## కొనుగోళ్లు ప్రారంభించాల్సిందే

రైతు ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించం : మంత్రి తుమ్మల


ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చే వారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాల్సిందేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. అధిక వర్షాల వల్ల రైతులు అనుకున్నంత మేర దిగుబడులు లేవని, ఈ సందర్భంలో రైతు ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఎవరినైనా, ఎంతటివారినైనా ఈ ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి స్పష్టం చేశారు. జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో, సిసిఐ ఎండితో సమావేశం జరిపించి అమ్మకాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 43.29 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 24.70 లక్షల క్వింటాల్ల పత్తి ఉత్పత్తి కాగలదని అంచనా ఉందని తెలిపారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి గత నెల 12న న సిసిఐ సిఎండి, జిన్నింగ్ మిల్లర్లు తో నిర్వహించిన సమావేశం అనంతరం విడుదల చేసిన టెండర్ లో లింట్ శాతం ఎల్1, ఎల్2



అలాట్మెంట్ స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ నిబంధన సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు. లింట్ పర్సంటేజ్ ఎల్ 1 స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ విషయంలో గత సీజన్ లో అనుసరించిన విధానం ఈ ఏడాది కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్రంలో 341 జిన్నింగ్ మిల్లులు టెండర్లు వేయడానికి ముందుకు రాకపోవడంతో ఈనెల1వ తేదీన ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపిమన్నారు. దీంతో ఈ ఏడాది కొత్తగా తీసుకువచ్చిన నిబంధనలలో ఒకటి,రెండు నిబంధనల్లో కొంతమేర సడలింపులు ఉంటాయని, మిగతా వన్నీ యధాతథంగా అమలుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. కొత్త నిబంధనలతో కొనుగోళ్ల ప్రక్రియలో సమస్యలు తలెత్తే ఆస్కారం ఉందని మార్కెటింగ్ అధికారులు వివరించగా, దానిని అక్కడి పరిస్థితుల దృష్ట్యా సడలిస్తామని, లింటు శాతం కూడా ప్రతి 15రోజులకొకసారి నిర్ణయించి అమలు చేస్తామని తెలిపారు .

## పత్తి రైతు.. ఆశ గల్లంతు



అధిక వర్షాలకు దెబ్బతిన్న మెట్ట పంటలు
పూత, కాత లేని పత్తి
ఒకటి రెండు కాసినా నల్లబారుతున్న తెల్లబంగారం

ప్రజాపక్షం/ఖమ్మం

ఎన్నో ఆశలు పెంచుకున్న పత్తి పంట ఈ ఏడాది రైతులను తీవ్ర నిరాశపర్చింది. తొలినాళ్లలో పత్తిని చూసి ఆశలు పెంచుకున్న రైతుల ఆశలు గల్లంతయ్యాయి. వరి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న పంట పత్తి. పత్తి పూత, కాత దశలో ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పూత మొత్తం రాలిపోయి కాయలున్న చెట్లు కనిపించటం లేదు. ఎక్కడో ఓ చోట ఒకట్రెండు కాయలు పడినా అధిక వర్షాలకు నల్లబారి పోతున్నాయి. పగిలిన పత్తి తీసే పరిస్థితి లేదు. పత్తి మొలకలు వస్తున్నాయి. మొత్తంగా రైతాంగాన్ని పూర్తిగా నష్టపరిచింది. గడిచిన మూడేళ్ల నుంచి పత్తి రైతులు వరుసగా నష్టపోతూనే ఉన్నారు. పెట్టుబడులు పెట్టిన తర్వాత దిగుబడులు వచ్చే సమయానికి ప్రతికూల పరిస్థితులు ఎదుర వుతున్నాయి. పెరిగిన రసాయనిక ఎరువుల ధరలు, క్రిమి సంహారక మందులు, దుక్కి, కూలీల ఖర్చులతో, పెట్టుబడులు

తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## ట్రంప్ నాయకత్వాన్ని ప్రశంసించిన మోదీ



**ఢిల్లీ :** గాజాలో శాంతి సాధనకు సంబంధించి శరవేగంగా మారుతున్న పరిణామాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాయకత్వ పటిమను ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టింగ్ పెట్టారు.గాజా విషయంలో నిర్ణయాత్మకమైన ప్రగతి కనిపిస్తోందన్నారు. బందీలను విడుదల చేసేందుకు హమాస్ సుముఖత వ్యక్తం చేయడంపట్ల కూడా మోదీ హర్షం ప్రకటించారు. గాజాలో బాంబింగ్ ఆపేయాలని నెతన్యాహూను ట్రంప్ కోరారు. తర్వాత హమాస్ కూడా బందీల విడుదలకు అంగీకరించింది. విడుదల ప్రక్రియకు చర్చలకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## హమాస్ దాడి రెండోవార్షిక సంస్మరణకు యూదులు సన్నద్ధం



**లండన్:** ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదుల దారుణమైన హింసాత్మక దాడి ప్రారంభమై అక్టోబరు ఏడో తేదీ నాటికి రెండు సంవత్సరాలు పూర్తి అవుతూ ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా యూదులు రెండో వార్షిక సంస్మరణ దినం పాటించేందుకు ప్రతిదేశంలోనూ సన్నద్ధమవుతున్నారు. ఆదివారంనాడు లండన్‌లో ఒక భారీ కార్యక్రమాన్ని యూదులు నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. బాధిత కుటుంబాలకు చాలా పెద్ద ఓదార్పు ఇచ్చేందుకు ఈవెంట్ నిర్వాహకులు అందరినీ సమైక్యపరచడంపై ప్రధానంగా దృష్టికేంద్రీకరించారు. హమాస్ ఉగ్రవాదులు వందలమంది సరిహద్దు కంచెను బద్దలుకొట్టుకుని ఇజ్రాయెల్‌లో ప్రవేశించి రెండేళ్ళక్రితం అక్టోబరు ఏడో తేదీన అత్యాచారాలు, కాల్పులు, మారణకాండ కొనసాగించారు. దానికి ప్రతిగా రెండేళ్ళలో ఇజ్రాయెల్ సైన్యం బందీల విడుదల పేరుతో యుద్ధం ప్రారంభించి 67 వేలమందిని ఊచకోత కోసింది. వందలమందిని ఆకలిచావులకు గురిచేసింది. ప్రపంచ చరిత్రలో ''అమానవీయ మారణకాండ'' అనే పదానికి ఇచ్చిన అధికారిక నిర్వచనంలో పేర్కొన్న అన్ని నిబంధనలను ఇజ్రాయెల్ సైన్యం ఉల్లంఘించిందని ఐక్యరాజ్యసమితి విచారణా కమిషన్ తన సుదీర్ఘ నివేదికలో పేర్కొనగా, ఇటీవల జరిగిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశం కూడా అటు హమాస్ చేసిన దారుణ కృత్యాలను, ఇటు ఇజ్రాయెల్ చేసిన అమానవీయమైన మారణకాండను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానాలు చేసింది. మధ్యప్రాచ్య చరిత్రలో ఒక అమానవీయ ఘట్టంగా ఈ యుద్ధం చరిత్రలో నిలిచిపోతుంది. గాజా ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైన్యం భూగోళనరకంగా మార్చివేసిందని అపప్రథను మూటగట్టుకున్న ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ మానవకథలో హిట్లర్ వారసుడుగా తన పేరు నమోదు చేసుకున్నారు.

## అస్పష్టంగా ఉన్న ట్రంప్ ప్రణాళిక



హమాస్ సీనియర్ నేత విమర్శ

**దోహా:** గాజాలో యుద్ధ నివారణకు ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళిక చాలా అస్పష్టంగా ఉందని హమాస్ సీనియర్ నాయకుడు మౌసా అబూ మార్జౌక్ అన్నారు. గాజాను సైనికీకరణ చేయకూడదని అన్నారు. ఎవరు తదుపరి గాజాలో అధికారంలో ఉంటారో వారికే తాము ఆయుధాలు స్వాధీనం చేస్తామని, ఆ పాలకుల వద్దనే ఆయుధాలు ఉంటాయన్నారు. తాము ఎంతో బాధ్యతాయుతంగా ఈ శాంతి ప్రణాళికపై చర్చలు జరిపామన్నారు. ఇజ్రాయెల్ ఆక్రమణనుండి వైదొలగేవరకూ హమాస్ ఆయుధాలను వదిలిపెట్టబోదన్నారు.

యుద్ధ విరమణకు సంబంధించిన ప్రధానాంశాలతో హమాస్ ఏకీభవిస్తోందని, కానీ బందీలను విడుదల చేసేందుకు ఎలాంటి గడువూ ఇవ్వకపోవడం ప్రస్తుత పరిస్థితుల్లో అవాస్తవికంగా ఉందని విమర్శించారు. ట్రంప్ ప్రణాళికలో మార్పులు చేర్పులు అవసరమని, అందువల్ల ఈ ప్రణాళికపై తదుపరి చర్చలు ఎంతో అవసరం అని అన్నారు. మరణించిన వారి మృతదేహాలు కొన్ని ఎక్కడ ఉన్నాయో తెలియదని, కొందరు బందీల జాడ కూడా తమకు తెలియడంలేదని ఇంతకుముందు హమాస్ ప్రకటించింది. 72 గంటల గడువు తమకు సరిపోదని ఆయన అన్నారు. సజీవ,నిర్జీవ బందీలను ఇజ్రాయెల్‌కు చేర్చడానికి ఇచ్చిన సమయం సరిపోదని వాదించారు. గాజాలో ప్రస్తుతం యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం బదులుగా స్థిరీకరణకు అంతర్జాతీయ సైన్యాన్ని మోహరిస్తామన్న ట్రంప్ ప్రణాళికాంశంపై ఒక స్పష్టత కావాలన్నారు. గాజా భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను సమగ్ర పాలస్తినా జాతీయ చట్రంలోనే చర్చించాలన్నారు. ఈ చర్చల్లో హమాస్ కూడా భాగస్వామ్యం కావాలన్నారు. హమాస్ ఆయుధాలను వదిలిపెట్టాలన్న ట్రంప్ ప్రణాళికాంశంపై మరో విడత చర్చలు జరగాల్సి ఉందన్నారు.

**729 రోజులుగా యుద్ధం**

**67వేలకు చేరిన పాలస్తినా మృతులు**

గాజాలో గడచిన రెండు సంవత్సరాలుగా ఇజ్రాయెల్ దాడుల్లో పాలస్తినా మృతులసంఖ్య 67,000కు చేరిందని హమాస్ ఆరోగ్యమంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. శనివారం (అక్టోబరు 4వతేదీ) నాటికి గాజాలో ఇజ్రాయెల్ యుద్ధానికి 729 రోజులు పూర్తయ్యాయి. కాగా గడిచిన ఇరవైనాలుగు గంటల్లో ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో 66,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 1,70,000 మంది గాయపడ్డారు. గాజాలో యుద్ధంపై అంతర్జాతీయస్థాయిలో శరవేగంగా మార్పులు సంభవించినప్పటికీ ఇజ్రాయెల్ దాడులు ఆగలేదు. గడచిన 24 గంటలుగా జరిపిన దాడులపై ఐడిఎఫ్ ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. ఇదిలా ఉండగా ఆకలికారణంగా గాజాలో మరో ఇద్దరు మరణించడంతో శనివారంనాటికి గాజాలో ఆకలితో మరణించినవారిసంఖ్య 459కి చేరింది. వీరిలో 154 మంది పిల్లలు ఉన్నారు. మొదట హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై చేసిన దాడిలో 1200 మంది కాల్పుల్లో మరణించారు. 251 మందిని వారు బందీలుగా తీసుకువెళ్ళారు. విడుదలైనవారు విడుదల కాగా కొందరు తప్పించుకున్నారు. అనేక మంది ఎదిరించడంతో హమాస్ చేతుల్లో హతులయ్యారు. కొంతమంది బందీలను గడచిన మార్చిలో హమాస్ ఒప్పందం ప్రకారం విడతల వారీగా స్వాధీనం చేసింది. చివరకు 48 మంది మిగిలారు. వీరిలో ప్రస్తుతం 20 మంది మాత్రమే సజీవులుగా ఉన్నారని భావిస్తున్నారు.

## ట్రంప్ అల్లుడి సమక్షంలో బందీల విడుదలపై చర్చలు



**జెరూసలెం:** హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెలీ బందీలను విడుదల ప్రక్రియపై చర్చలు సక్రమంగా జరిగితే కొద్దిరోజుల్లో బందీలు విడుదలవుతారని నెతన్యాహూ సన్నిహిత అధికారి ఒకరు చెప్పారు. సోమవారం నుండీ బందీల విడుదలపై హమాస్, ఇజ్రాయెల్ ప్రతినిధుల సమక్షంలో మధ్యవర్తుల చర్చలు మొదలవుతాయి. మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్‌ల సమక్షంలో బహుశా ఈ చర్చలు జరుగుతాయి. బందీలను విడుదల చేసే ప్రక్రియకు సంబంధించిన సాంకేతికపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు ఈజిప్టు హయాంలో ముందస్తు చర్చలు జరుగుతాయి. శరవేగంగా జరుగుతున్న ఈ పరిణామాలను ట్రంప్–నేతన్యాహూ ఇద్దరు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇజ్రాయెల్ వాదన ప్రకారం 48 మంది బందీలు ఇంకా హమాస్ వద్ద ఉన్నారు. కానీ 26 మంది బందీలు వారివద్ద ఉండగానే హతులయ్యారని కూడా నెతన్యాహూ ప్రభుత్వం నమ్ముతోంది. ఈ చర్చలు గనుక సక్రమంగా పూర్తయితే కొద్దిరోజుల్లోనే బందీల విడుదల ప్రక్రియ కూడా పూర్తవుతుందని సీనియర్ ఇజ్రాయెలీ అధికారి ఒకరు ఛానల్–12 కు శనివారం చెప్పారు. హమాస్ తరపున ఈజిప్టు, ఖతార్ దేశాలు మొదటి నుండీ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి. హమాస్ శాంతికి సిద్ధంగా ఉందని ట్రంప్ ప్రకటించడానికి ముందుగా ఆయనతో నెతన్యాహూ శుక్రవారం రాత్రి పొద్దుపోయాక టెలిఫోన్‌లో సుదీర్ఘ సంభాషణ చేశారు. గాజాలో బాంబింగ్ కార్యకలాపాలను నిలిపివేయాలని ఈ సందర్భంగా ట్రంప్ ఆయనకు చెప్పారు. ఐతే గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వైదొలగిపోవాలని హమాస్ మొదటినుండీ అడుగుతున్నది. ఇప్పుడు కూడా అదే డిమాండ్ చేస్తోంది. కానీ అలాంటి డిమాండ్ ఏదీ చర్చల ఎజెండాలో లేదని ఇజ్రాయెల్ సీనియర్ అధికారి చెప్పారు.

## గాజాకు మద్దతుగా ఇటలీలో 20 లక్షలమంది ప్రదర్శన

**మిలాన్:** గాజాకు మద్దతుగా ఇటలీ,స్పెయిన్, పోర్చుగల్ దేశాలలో ప్రజలు భారీఎత్తున నిరసన ప్రదర్శనలు జరిపారు. ఇటలీ దేశవ్యాప్తంగా 20 లక్షల మంది ప్రజలు ప్రదర్శనలు జరిపారు. దాదాపు 100 నగరాల్లో ఈ ప్రదర్శనలు శుక్రవారం జరిగాయి. గాజాకు ఇటలీ నుండి నెలరోజులక్రితం బయలుదేరిన ఫ్లోటెల్లా 42 నౌకల బృందంపై ఇజ్రాయెల్ దాడులు చేసి వివిధథ దేశాలకు చెందిన 470 మంది నావికులను నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. గాజాకు ఆహార సరఫరాను అడ్డుకోరాదని, గాజా ప్రజల ఆకలి తీర్చాలని కోరుతూ ఇటలీ వ్యాప్తంగా ఈ ప్రదర్శనలు జరిగాయి. అదేవిధంగా స్పెయిన్, పోర్చుగల్ దేశాలలో కూడా నెలరోజులక్రితం నిర్దేశించిన ఈ గాజా అనుకూల ప్రదర్శనలు జరిగాయి.

## జపాన్‌కు తొలి మహిళా ప్రధానమంత్రి తకైచీ



**టోక్యో:** జపాన్ దేశ మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సనే తకైచీ (64) పేరు ఖరారైంది. జపాన్ అధికార లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి) అధ్యక్షురాలుగా తకైచీ ఎన్నికయ్యారు. అధికారపార్టీలో ఉన్న పచ్చిమితవాదులలో ఆమె ఒకరు. జపాన్ రాజకీయాలలో పేరెన్నికగన్న ప్రముఖ నాయకురాలు. జపాన్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నది. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరుగుతోంది. ఇంటి వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కార్మికుల వేతనాల పెరుగుదల నిలిచిపోయింది. ఈ సవాళ్ళను ఆమె పరిష్కరించాల్సి ఉంది. మరోవైపు గత ప్రభుత్వం ట్రంప్‌తో చేసుకున్న టారిఫ్‌ల ఒప్పందాన్ని కూడా ఆమె నెట్టుకురావాల్సి ఉంది. లిబరల్ డెమోక్రటిక్‌పార్టీ ఎన్నికల్లో వరుసగా అనేక అపజయాలు ఎదుర్కోవడంతో పార్టీ అధ్యక్షుడు, ప్రధానమంత్రి షిగెరు ఇషిబ ఏడాది పాలన గత నెలలోనే ముగిసింది. పార్టీ ఎన్నికల్లో ఓటమి చూడటంతో ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయనస్థానంలో తకైచీ ఇప్పుడు పార్టీ బాధ్యతలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వాన్ని ముందుకు నడిపించేందుకు ప్రధానమంత్రి కాబోతున్నారు. బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి మార్గరెట్ థాచర్‌పట్ల ఆమెకు అపారమైన గౌరవం ఉంది. ఆమె తరహాలో ఉండాలనే వాంఛ ఉంది. ''పార్టీలో అందరి సహకారం లేకపోతే పార్టీని పునర్నిర్మించడం సాధ్యంకాదు'' అని ఆమె తొలివ్యాఖ్య చేశారు. ''నా రాజకీయ బాధ్యతలను, వ్యక్తిగత జీవితానికి మధ్య ఉన్న సమతౌల్యాన్ని రద్దుచేసుకుంటాను, పనికే ప్రాధన్యత ఇస్తాను, పని...పని...పని...'' ఇదే నా మంత్రం అని ఆమె అన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ యుద్ధ నేరాలకు పాల్పడిందని దేశాన్ని ఒక పెద్ద భూతంగా చూపించారని, యుద్ధనేరాలంటూ భూతద్దంలో చూపించారని విమర్శించారు. పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడుతున్నట్లు గతనెల 18న ఆమె ప్రకటించారు. అనుకున్నవిధంగా విజయం సాధించారు. అధికారపార్టీ అధ్యక్ష పదవికోసం పార్టీలో ఐదుగురు పోటీ పడ్డారు. మొదటి రౌండు ఎన్నికల్లో ఎవరికీ పూర్తి మెజారిటీ రాలేదు. ఆ తర్వాత వ్యవసాయ మంత్రి షింజిరో కొయిజుమిని ఓడించి తకైచీ ఎక్కువ ఓట్లు సంపాదించుకున్నారు. కొయిజుమికి 156ఓట్లు లభించడగా, తకైచీకి 185 ఓట్లు వచ్చాయి. ఆమెకు 149 మంది చట్టసభ సభ్యుల ఓట్లు, మరో 36 పార్టీ ఛాప్టర్ సభ్యుల ఓట్లు లభించాయి. కొయిజుమికి 145 చట్టసభ సభ్యుల ఓట్లు, మరో 11 పార్టీ ఛాప్టర్ ఓట్లు లభించాయి. ఆమె ప్రస్తుతం ప్రజాప్రతినిధులసభ సభ్యురాలుగా ఉన్నారు.

## సంస్థగా ఇసి (మొదటి పేజీ తరువాయి)

మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..దేశంలో ఓట్ చోర్ పెద్ద ఎత్తున జరిగిందని, ఓట్ చోర్ తోనే బిజెపి మూడో సారి అధికారం లోకి రాగలగిందని అన్నారు. ఎన్నికల కమిషన్ బిజెపి కి అనుబంధాలు ఉన్నాయని ఆరోపించారు.రాహుల్ గాంధీ  ఓట్ చోరీ విషయంలో అన్ని రకాల ఆధారాలతో ఓట్ చోరీ లను బయటపెట్టారని ఆయన గుర్తు చేశారు. అంత పకడ్బందీగా ఆధారాలు చూపించినా కూడా ఎన్నికల కమిషన్ నుంచి ఎలాంటి స్పందన లేదని దుయ్యబట్టారు. తెలంగాణలో ఓట్‌చోరీ ఉద్యమంపై  సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కొంచం ఆలస్యం జరిగిందన్నారు. ఇక్కడ భారీ వర్షాలు ఉండడంతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించలేదన్నారు. ఇప్పటి నుంచి ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామానికి కనీసం వంద మందితో సంతకాలు  చేయించాలని సూచించారు. ప్రతీ గ్రామంలో ఓట్ చోరీ ఎలా జరిగింది బిజెపి ఎలా ఓట్ చోరీ చేసిందో ప్రజలకు వివరించి వారి బండారం బయట ఆదేశించారు. డిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కార్యాచరణ  చేపట్టి ప్రతి గ్రామంలో ఈ సంతకాల సేకరణ జరిగే విదంగా చూడాలని సూచించారు.

## చిగురించిన ఆశ (మొదటి పేజీ తరువాయి)

నాటికి రెండేళ్ళు పూర్తవుతున్న తరుణంలో యుద్ధం ముగింపునకు రావడంతో ప్రపంచవ్యాప్తంగా అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడి చేయాగా ఆ తర్వాత గాజాలో అమానవీయ యుద్ధాన్ని ఐడిఎఫ్ ప్రారంభించింది. చరిత్ర పుటల్లో శిలాక్షరాలతో నిలిచిపోయే మధ్యప్రాచ్యం అమానవీయ హత్యాకాండ ప్రారంభమై మరో రెండు రోజులకు రెండేళ్ళు పూర్తవుతాయి. యుద్ధం కూడా దాదాపు చివరి అంకానికి చేరడంతో ప్రజల్లో భయం తొలగిపోయి స్వేచ్ఛగా జీవనం సాగించలమన్న ఆశ చిగురించి ఆనందం వెల్లివిరిస్తోంది. ఐతే ఇజ్రాయల్ సైన్యం మాత్రం ఇంకా రక్షణాత్మక చర్యలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. గాజాలో ఏదైనా ప్రమాదం ఎదురైతే రక్షణాత్మక చర్యలకు సిద్ధంగా ఉండాలని సైన్యాధికారులు వారికి ఆదేశాలు ఇచ్చారు. గడచిన మూడు నాలుగు రోజులుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న పాలస్తినా ప్రజలల్లో నవ్వుముఖా లు కనిపిస్తున్నాయి. గాజాలో పలుచోట్ల ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయి. వీధుల్లో శిథిలాలమధ్య గాడిదలతో వెళుతున్న వాహనాలు, ఇతర కార్ట్‌లను లాక్కువెళుతున్న జంతువాహనాల సంఖ్య పెరిగింది. కానీ ఏదైనా ప్ర మాదదం వాటిల్లితే దాడులకు సిద్ధంగా ఉండాలని ఇజ్రాయెల్ సైనికదళాల ప్రధానాధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ సైన్యాలకు ఆదేశాలు ఇచ్చారు.

**గాజా స్ట్రిప్ నుండి వైదొలగే ప్రశ్నేలేదు : ఐడిఎఫ్**

ట్రంప్ ప్రతిపాదించిన 20 అంశాల గాజా శాంతి ప్రణాళిక అమలుకు సిద్ధంగా ఉండాల్సిందిగా తమ ప్రభుత్వం అదేశించిందని ఇజ్రాయెలీ సైన్యం (ఐడిఎఫ్) శనివారం ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా తాము సన్నాహ చర్యలు చేపడుతున్నట్లు ఆర్మీ అధికారి ఒకరు చెప్పారు. హమాస్ వద్ద ఉన్న బందీలను విడుదల చేసేందుకు సన్నాహాలు చేయాల్సి ఉంది. ఇందుకు ఈజిప్టు సారథ్యంలో సోమవారం నుండీ చర్చలు ప్రారంభం అవుతున్నాయి. తాము ప్రస్తుతం గాజాలో రక్షణాత్మక చర్యలు మాత్రమే తీసుకుంటున్నామని చెప్పారు. ఎవరిమీదా ఎదురు దాడుటు చేయడంలేదని, కేవలం తమను తాము రక్షించుకునే చర్యలు మాత్రమే తీసుకుంటున్నామని చెప్పారు. ఐతే గాజా స్ట్రిప్ నుండి ఇజ్రాయెలీ సైన్యం వైదొలగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నేతన్యాహూ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన చేస్తూ, యుద్ధం ముగించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది.

**గాజాలో 66 మంది మృతి**

గాజాలో బాంబింగ్ ఆపేయాలని ట్రంప్ చెప్పిన తర్వాత కూడా శనివారం ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. ఈ దాడుల్లో 20 మంది మరణించారు. గడచిన 24 గంటల్లో ఐడిఎఫ్ దాడుల్లో 66 మంది మరణించారు. 265 మంది గాయపడ్డారని హమాస్ సారథ్యంలోని ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఆత్మరక్షణ పేరుతో ఇజ్రాయెల్ సైన్యం ఈ దాడులు చేసిందని తెలిపింది. శనివారం తెల్లారుజామునుండి గాజాస్ట్రిప్‌లో ఏడుచోట్ల బాంబుపేలుళ్ళు సంభవించాయి.  గాజాలో విడిగా మూడుచోట్ల పేలుళ్ళు సంభవించాయి. గాజాసిటీ ప్రమాదకరమైన జోన్‌లో ఉందని, ప్రజలు దక్షిణంవైపు వెళ్ళాలని మరోసారి కూడా ఐడిఎఫ్ ప్రకటించింది.

## డల్లాస్‌లో కాల్పులు (మొదటి పేజీ తరువాయి)

పార్ట్ టైం జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో తెల్లావారుజామున డాల్లస్‌లో దుండగుల కాల్పులు జరపడంతో తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి జగన్‌మోహన్, తల్లి సునిత వారికి ముగ్గురు కుమారులు. కాగా దామోదర్, రాజ్‌కిరణ్, చిన్నవాడైన పోలే చంద్రశేఖర్ ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్ళాడు. అమెరికాలో దుండగుల కాల్పుల్లో హైదరాబాద్ ఎల్‌బి నగర్‌కు చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ మృతి చెందడం పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆయన భౌతిక కాయాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని సిఎం తెలిపారు. చంద్రశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సిఎం సంతాప సందేశంలో తెలిపారు.

**బాధిత కుటుంబ సభ్యులను పరమర్శించిన హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి**

పై చదువుల నిమిత్తం రెండు సంవత్సరాల క్రితం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో నివాసం ఉంటున్న పోలే చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి టి. హరీష్ రావు, ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరమర్శించారు. ఈ సందర్భంగా వారు మృతి దేహాన్ని ప్రభుత్వంతో మాట్లాడి హైదరాబాద్‌కు రప్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన బరోస కల్పించారు. వారి వెంట కాలనీ అధ్యక్షులు కోట్ల శివ కుమార్ తదితరులు ఉన్నారు.

## రైతులకు అన్యాయం జరగనివ్వను (మొదటి పేజీ తరువాయి)

దృష్ట్యా 6లేన్లుగా మార్చుకున్నామని తెలిపారు.సంగారెడ్డి నుండి నర్సాపూర్,తూప్రాన్, గజ్వేల్,జగదేవపూర్ వయా భువనగిరి,చౌటుప్పల్ వరకు 161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం,రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. ఉత్తర భాగం అలైన్మెంట్ లో ఎలాంటి మార్పు ఉండదని,జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని కోరారు.అయితే ఇటీవల పత్రికల్లో,సోషల్ మీడియాలో రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ,నిర్మాణం కోసం 45వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కట్టిన,ఇప్పుడు లక్షన్నర కోట్ల విలువ గల ఓఆర్ఆర్ ను 7వేల కోట్లకు అమ్ముకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని,చరిత్రలో రోడ్డను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ ది మాత్రమేనని దుయ్యబట్టారు. రోడ్లు అమ్ముకున్న వాళ్లే..అబద్దపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారనీ, వాళ్ల ట్రాప్ లో పడొద్దని రైతులను కోరారు. వాళ్ళు ఒక్క ఇల్లు కట్టలే,రేషన్ కార్డు ఇయ్యలే,సన్న బియ్యం ఇయ్యలే,ఇంటికి ఉచిత కరెంట్ ఇయ్యలే కానీ లక్షల కోట్లు అప్పులు మాత్రం చేసారని ఎద్దేవా చేశారు. నితిన్ గడ్కరీ వ్యక్తిగతంగా తనను ఇష్టపడే వ్యక్తని తన పేరు చెప్పి గౌరెల్లి భద్రాచలం హైవే,ఎల్బీ నగర్ మల్కాపురం రోడ్డు జీవో ఇచ్చారని గుర్తు చేశారు.హైదరాబాద్ విజయవాడ హైవే 8లేన్ల నిర్మాణ పనులు వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభం అవుతాయని మరోమారు స్పష్టం చేశారు.రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదనీ,రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అలైన్మెంట్ విషయంలో పెద్ద వాళ్ళకు ఒక న్యాయం,పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదని అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని తేల్చి చెప్పారు.  నల్లగొండ బిడ్డగా..ఈ గడ్డకు అన్యాయం జరిగితే ఊరుకోను అని పునరుద్ఘాటించారు.

## ఆశ గల్లంతు (మొదటి పేజీ తరువాయి)

గణనీయంగా పెరిగాయి. మారిన పరిస్థితుల్లో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంట దిగుబడి బాగున్నప్పుడు ధర లేకపోవటం, ధర ఉన్నప్పుడు దిగుబడి లేకపోవటం గడిచిన మూడేళ్లుగా అతివృష్టి రైతులను నష్టపరుస్తున్నాయి. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోళ్లపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుల వద్ద కంటే ప్రైవేటు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కొందరు ఏజెంట్లను నియమించుకుని తక్కువ ధరకు కొని వారి ద్వారా సిసిఐకి విక్రయించి లబ్ధి పొందారన్న దానిపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. మిగిలిన మెట్ట పంటల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు.ఈ ఏడాది అపరాల పంటలకు సంబంధించి విత్తు చేతికి రాలేదు. పునాస పంట కంది అధిక వర్షాలకు దెబ్బతిని ఎర్రబారింది. అక్కడక్కడ పత్తి ఎండిపోతున్నది. నాటిన మిరప మొక్కలు సైతం ఏనుకోని మారాకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతివృష్టి అనావృష్టి నడుమ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. సహకరించని ప్రకృతి నడుమ పాలక వర్గాలు సాగుపై దృష్టి సారించి ఆదుకోకపోతే వ్యవసాయరంగ భవిష్యత్తు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.

**ఎకరాకు రూ. 30వేల పరిహారం ఇవ్వాలి : గోవిందరావు**

అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు కోరారు. మూడేళ్లుగా పత్తి రైతులు వరుస నష్టాలను చవి చూస్తున్నారని ప్రభుత్వం రైతుల పట్ల సానుభూతి మాటలతో సరిపెడుతుంది తప్ప సహాయం అందించడం లేదని గోవిందరావు తెలిపారు. ఎకరాకు తక్షణం రూ. 30వేలు చొప్పున పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి విపత్తు నిధిని ఏర్పాటు చేసి నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకునేందుకు ప్రయత్నించాలని అధిక వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను అంచనా వేసి నివేదికలు రూపొందించాలని కోరారు.

**గ్రామం యూనిట్‌గా నష్టం అంచనా వేయాలి : బొంతు రాంబాబు, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి**

అధిక వర్షాలకు పత్తి పంట దెబ్బతిని రైతులు నష్టపోయారని 33 శాతం నిబంధన పక్కనపెట్టి గ్రామం యూనిట్‌గా పంట నష్టం అంచనా వేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వరుస నష్టాల కారణంగా పత్తి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. అధిక వర్షాల కారణంగా ఈఏడాది పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని ఎకరాకు క్వింటా, రెండు క్వింటాళ్లకు వచ్చే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. అందుకే ప్రకృతి విపత్తుగా భావించి పరిహారం అందించాలని ఈ ఏడాది పెట్టుబడి రైతు శ్రమ ఆధారంగా పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం తక్షణం పంట నష్టం అంచనాలు చేపట్టి పరిహారం అందించాలన్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

**మాటలకే పరిమితమవుతున్న పరిహారం : దొండపాటి రమేష్**

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి సారి పరిహారం మాటలకు, ఒక్కోమారు అంచనాలు రూపొందించడంతోనే సరిపెడుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ తెలిపారు. పెట్టుబడి ఆధారంగా నష్టాలను అందజేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. పంటల బీమా పథకాన్ని సమగ్రంగా అమలు చేస్తే రైతులు యాచకుల్లా ప్రభుత్వం వద్ద దేబిరించాల్సిన పని ఉండేది కాదని ఆయన స్పష్టం చేశారు. గ్రామం యూనిట్‌గా పరిహారాన్ని అందించాలని రమేష్ డిమాండ్ చేశారు. ఈ ఏడాది అతివృష్టి మెట్ట రైతాంగాన్ని దెబ్బతీసిందని ఆదుకునేందుకు తక్షణం ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ భూమి స్వాధీనం (మొదటి పేజీ తరువాయి)

చెప్పలేదని తెలిపారు. అక్కడ ఉన్న బోర్లు కూడా తీసేశారన్నారు. ప్రభుత్వ భూములు అయితే ఇన్ని రోజులు ప్రభుత్వం ఏమీ చేసిందని ప్రశ్నించారు. కెసిఆర్ ఆగిపోయారన్నారు. రేవంత్ రెడ్డి వచ్చి హైడ్రా అని కూల్చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. తమ తాతాల కాలం నుంచి ఇక్కడే ఉన్నామని వాపోయారు. సాగు చేసుకుంటున్నామని, కూరగాయలు పండించుకుంటున్నామని, తమకు 2 వందల గజాలు కానీ 5 వందల గజాలు ఇస్తే ఇళ్లు కట్టుకుంటామని స్థానికులు కోరారు.

**అప్పుడు ఇందిరమ్మ ఇచ్చారు.. ఇప్పుడు రేవంత్ తీసుకుంటున్నారు..**

అప్పుడు ఇందిరమ్మ తమకు స్థలాలు ఇచ్చారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి వచ్చి తీసుకుంటున్నారని స్థానికలు అన్నారు. ఇదేమీ న్యాయమని ప్రశ్నించారు. హైడ్రా అనేది చెరువులు, కుంటల ఆక్రమణలను బాగు చేయాలని, ఇలాంటి ప్రదేశాలు చేస్తే వాళ్లకు ఏమీ వస్తుందన్నారు. తమకు ఏం చెప్పలేదన్నారు. తెల్లవారుజామున 4 గంటలకు వచ్చి కూల్చేశారని వాపోయారు.  ఎందుకు కూలగొడుతున్నారో కూడా చెప్పలేదన్నారు. ఇక్కడ ఎప్పటినుంచో వ్యవసాయం చేస్తున్నామని, తమకు పిల్లలు ఉన్నారని, ఇప్పుడు ఇల్లు లేదు, బతుకు లేదని మహిళ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాయని తెలిపారు.

## బహిరంగ సభ (మొదటి పేజీ తరువాయి)

కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల సిపిఐ కార్యదర్శులు హాజరుకానున్నారని ఆయన చెప్పారు.

**నాటి పోరాట ఘట్టాలు నేటి యువతకు**

భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక చారిత్రక ఘట్టాలు ఉన్నాయని, నాటి పోరాట చారిత్రక ఘట్టాలను నేటి యువతరానికి తెలియజేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ, ఆ తర్వాత దేశవ్యాప్త భూ పోరాటంలోనూ సిపిఐ కీలక భూమిక పోషించిందన్నారు. వేల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీకి దక్కిందన్నారు. ప్రజల హక్కుల కోసం, సంక్షేమం కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడిందన్నారు. గ్రామ గ్రామాన శత సంవత్సర సంబురాలు సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహించి యువతను కార్యోన్ముఖులను చేస్తామన్నారు. అదే సందర్భంలో రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని హేమంతరావు వివరించారు. ఖమ్మం జిల్లాలో లక్షలాది కుటుంబాలకు శత సంవత్సర ముగింపు సందేశాన్ని అందిస్తామని పేర్కొన్నారు.  మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్.కె.జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**బలానికనుగుణంగా పోటీ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బలానికి అనుగుణంగా పోటీ చేయనున్నట్లు హేమంతరావు తెలిపారు. జిల్లాలో కలిసివచ్చే రాజకీయ పార్టీలతో ఎన్నికల సర్దుబాటు ఉంటుందని ఆయన తెలిపారు. సిపిఐకి బలమైన గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లో పోటీ చేస్తామని హేమంతరావు తెలిపారు. బిసి రిజర్వేషన్లను సిపిఐ స్వాగతిస్తున్నదని ఈ విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు ద్వంద వైఖరిని అవలంభిస్తున్నాయని దీనిని సిపిఐ నిరసిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ వచ్చేంతవరకూ పోరాడుతాం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థలలో 42 శాతం, చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్ సాధించేంతవరకు బిసి హక్కుల సాధన సమితి పోరాటం కొనసాగుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు స్పష్టం చేశారు ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించి బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి గవర్నర్ కి పంపితే 6నెలలు దాటినప్పటికీ ఆ బిల్లుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలయాపన చేయడం దారుణమన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలైతే క్రెడిట్ మొత్తం కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందనే భయంతో బిజెపి వెనకడుగు వేస్తోందన్నారు. తక్షణమే బిసి బిల్లును షెడ్యూల్ 9లో చేర్చి చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు నేతలకు పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్యార్టర్స్‌లో శనివారం ఆయన నివాసంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎంఎల్ఎలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జిలతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్ బాబు కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై నేతలకు దిశా నిర్ధేశం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలం, బలహీనతలు, గత ఎన్నికల ఫలితాలపై సమీక్ష ఆయన సమీక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ సమన్వయ లోపం రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, గత ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించిన తర్వాతే అభ్యర్థుల ఎంపిక చేయాలన్నారు. అభ్యర్థుల ఎంపికపై ఎంఎల్ఎలు, ఇంఛార్జిల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని, అయితే.. తుది నిర్ణయం మాత్రం పార్టీ అధిష్ఠానం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రంగారెడ్డి డిసిసి ప్రెసిడెంట్ చల్లా నర్సింహారెడ్డి, ఎంఎల్ఎలు మల్‌రెడ్డి రంగారెడ్డి, టి. రామ్మోహన్ రెడి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కె.శంకరయ్య, బి.మనోహర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహేశ్వరం, చేవేళ్ల ఇంఛార్జీలు కెఎల్ఆర్ భీం భరత్‌లు పాల్గొన్నారు.

## అశ్రునయనాల మధ్య దామోదర్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు..
కడసారి చూపునకు పోటెత్తిన జనం...





**ప్రజాపక్షం/సూర్యాపేట :** కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ఆయన బంధుగణం, అభిమానులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలను సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని స్వంత వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. తమ మహానేతను కడసారిగా చూసేందుకు జనం పోటెత్తారు. దీంతో తుంగతుర్తి జనసంద్రంగా మారింది.

గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాంరెడ్డి దామోదర్ రెడ్డి బుధవారం రాత్రి 10.30 గంటలకు తుది శ్వాస విడిచిన విషయం అందరికి తెలిసిందే. మరుసటి రోజు విజయదశమి కావడంతోపాటు ఆయన బంధుగణం విదేశాలలో ఉండడంతో వారు వచ్చేందుకు ఆలస్యం అవుతుండడంతో ఆయన చికిత్స పొందుతున్న ప్రైవేట్ ఆసుప్రతి మార్చురీలో పార్థివదేహాన్ని భద్రపరిచారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఉన్న నివాసానికి తరలించి మధ్యాహ్నం 2 గంటల వరకు సందర్శనార్థం ఉంచారు. సిఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు అక్కడ నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్ నుండి సూర్యాపేటకు తరలించారు. పట్టణంలో అంతిమయాత్రను నిర్వహించి తన నివాసం రెడ్‌హౌస్‌కు పార్థివదేహాన్ని తరలించి నియోజకవర్గ ప్రజల సందర్శనార్థం ఉంచారు. అదే రాత్రి 11 గంటలకు తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలోని నివాసానికి తీసుకెళ్ళారు. ప్రజల సందర్శనార్థం అక్కడే శనివారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంచారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌తోపాటు మరికొంత మంది పార్టీ ప్రజాప్రతినిధులు తుంగతుర్తికి చేరుకొని ఆయన పార్థివదేహంపై పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ఆయన వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. దామన్న పార్థివదేహాన్ని పాడెపై పెట్టిన తరువాత కాంగ్రెస్ పార్టీ పెద్దలు దహన సంస్కారాలు నిర్వహించే ప్రదేశానికి మోసుకెళ్ళారు. దహన సంస్కారాలకు ముందు పోలీసులు గౌరవ సూచికంగా గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆయన కుమారుడు సర్వోత్తమ్ రెడ్డి చితికి నిప్పంటించారు.

**కడసారి చూపునకు పోటెత్తిన జనం...**

తమ మహానేతను కడసారిగా చూసేందుకు ఆయన అభిమానులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు. దీంతో తుంగతుర్తిలోని ఆయన నివాసం జనంతో పోటెత్తింది. మాజీ పిసిసి అధ్యక్షులు, మాజీ ఎంపి వి.హనుమంతరావు దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని పట్టుకొని బోరున విలపించాడు. ఇదిలా ఉంటే తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలలోని ఆయన అభిమానులు దామన్న ఇకలేరన్న విషయాన్ని జీర్ణించుకోలేక ఆయన పార్థివదేహాన్ని చూసి కంటతడి పెట్టారు. నీవు లేకుంటే మా కష్టసుఖాలు ఎవరికి చెప్పుకోవాలంటూ విలపించడంతో ఆ దృశ్యాలు చూసిన వారందరిని కలిచివేసింది. దామోదర్ రెడ్డి భౌతికకాయానికి జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్‌పి కె నరసింహ, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, నకిరేకల్, మిర్యాలగూడ, పాలకుర్తి ఎమ్మెల్యేలు జి.జగదీష్‌రెడ్డి, మందుల సామేల్, ఉత్తమ్ పద్మావతి, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, యశస్విని రెడ్డి, ఎంపిలు కుందూరు రఘువీర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, వ్యవసాయ కార్పోరేషన్ కమీషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ప్రజలకు సహాయ సామాగ్రిని ట్రంప్, నెతన్యాహు అడ్డుకోవడం అనాగరిక చర్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిరుపేద పాలస్తీనా ప్రజలకు గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లా తీసుకువెళుతున్న సహాయ సామాగ్రిని ఇజ్రాయెల్ ప్రభుత్వం అడ్డుకోవడం అపహరించడం లాంటి అనాగరిక చర్యలను సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తోందని ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింఘూ ఠాకూర్, సహాయ కార్యదర్శి పోటు రంగారావులు అన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు ప్రభుత్వం, అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కలిసి గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లాను అపహరించడం బరితెగించిన నేరపూరిత చర్యగా వారు అభివర్ణించారు. గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లాతో పాటు 500 మంది కార్యకర్తలను బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా మానవతా సహాయాన్ని నిరుపేద పాలస్తీనా ప్రజలకు పంపిణీ చేయడానికి రెడ్‌క్రాస్‌కు అప్పగించాలన్నారు. కేంద్రంలో అధికారంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తక్షణమే నెతన్యాహు ప్రభుత్వంతో అన్ని సంబంధాలను దౌత్య, సైనిక,ఆర్థిక, ఇతర సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## మధ్యప్రదేశ్‌లో స్వల్ప భూకంపం

**సింగ్రౌలి :** మధ్యప్రదేశ్‌లో స్వల్ప భూకంపం సంభవించింది. సింగ్రౌలి జిల్లాలో శనివారం 3.1 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సిఎస్) తెలిపింది. మధ్యాహ్నం 1:33 గంటలకు ఈ భూకంపం సంభవించిందని ఎన్‌సిఎస్ వెబ్‌సైట్ పోస్టు చేసింది. భూకంపం కేంద్రం 10 కిలోమీటర్ల లోతులో ఉందని భారత వాతావరణ శాఖ భోపాల్ కార్యాలయ వాతావరణ శాస్త్రవేత్త విఎస్ యాదవ్ పిటిఐకి తెలిపారు. ప్రకంపన వల్ల ఏదైనా నష్టం జరిగిందా అని తనిఖీ చేయడానికి సింగ్రౌలి కలెక్టర్ చంద్రశేఖర్ శుక్లాను సంప్రదించడానికి చేసిన ప్రయత్నం చేసినా ఫలించలేదు.

## హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో బస్సు చార్జీల పెంపు

ఈ నెల 6 నుంచి అమల్లోకి...



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో బస్సు ఛార్జీలను టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం పెంచింది. నగరంలోని అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని ఆర్‌టిసి వసూలు చేయనుంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈఆర్డినరీ, ఈఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీలు పెంచుతూ ఆర్‌టిసి నిర్ణయం తీసుకుంది. అలాగే మెట్రో డీలక్స్, ఈమెట్రో ఏసి సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 చొప్పున ఛార్జీలు పెంచింది. హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఈ అదనపు చార్జీ అమలు ఈ నెల 6 నుంచి అమల్లోకి వస్తుందని టిజిఎస్ ఆర్‌టిసి శనివారం విడుదల విడుదల ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.

**కాలుష్యరహిత ప్రజారావాణా అందుబాటులోకి తెచ్చేందుకు..**

ఇదిలా ఉండగా హైదరాబాద్ లో కాలుష్యరహిత ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నగరవాసులను అనారోగ్యానికి గురి చేసే వాయు కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించాలని టిజిఎస్ ఆర్‌టిసిని ఆదేశించింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల 2027 నాటికి 2800 ఎలక్ట్రిక్ బస్సులను డిజిల్ బస్సుల స్థానే ప్రవేశ పెట్టాలని నిర్దేశించింది. నగరంలోని ప్రజా రవాణా వ్యవస్థను క్లీన్ అండ్ గ్రీన్ దిశగా నడిపించేందుకు ఈ నిర్ణయం ఒక శుభ సంకేతమని ఆర్‌టిసి పేర్కొంది. పూర్తి స్థాయిలో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు వినియోగంలోకి వస్తే వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లు తగ్గడంతో పాటు ప్రజా రవాణా వినియోగం పెరుగుతోంది. ఫలితంగా వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు తగ్గుతాయి. నగరవాసులకు శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు తగ్గి, ప్రజల ఆయుర్ధాయం మెరుగుపడుతుందని ఆర్‌టిసి అభిప్రాయం వ్యక్తం చేసింది.

**2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు..**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకునేందుకు టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం ఇప్పటికే చర్యలు చేపట్టింది. రాబోయే రెండేళ్లలో దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులను వాడకంలోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించింది. ఎలక్ట్రిక్ బస్సులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో 25 డిపోలు ఉన్నాయి. అందులో 6 డిపోల పరిధిలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, ఈ ఏడాదిలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఒక్కో డిపోలో రూ.8 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయిలో చార్జింగ్ కోసం హెచ్‌టి కనెక్షన్లను టిజిఎస్‌పిడిసిఎల్, ట్రాన్స్ కో ద్వారా నిర్మించింది. రాబోయే 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో చార్జింగ్ కోసం హెచ్‌టి కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా 10 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని అధికారులు అంచనా వేశారు. టిజిఎస్ ఆర్‌టిసి ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఆర్థిక భారాన్ని మోయలేదు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటోంది. హైదరాబాద్ భవిష్యత్ బాగు కోసం వాడకంలోకి తీసుకువస్తోన్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రజలు ఆదరించాలని, నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చబోతున్న ఈ గ్రీన్ జర్నీలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సంస్థ కోరుతోంది. ఈ పర్యావరణహిత కార్యక్రమానికి సహకరించి, గతంలో మాదిరిగానే సేవలను ప్రోత్సహించాలని ఆర్‌టిసి యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

## కొనుగోళ్లలో దళారులను నిలువరించాలి

సిసిఐ ఉన్నతాధికారులకు రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పత్తి కొనుగోళ్లలో దళారులను నిలువరించాలని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ సిసిఐ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21 నుంచి రాష్ట్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అధికారికంగా పత్తి కొనుగోలు ప్రారంభించనున్న నేపథ్యంలో కోదండరెడ్డి శనివారం సిసిఐ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. పత్తి సాగుచేసే రైతులు పత్తి పంట అమ్మకాల సమయంలో ప్రతి ఏటా దళారుల చేతుల్లో మోసపోతున్నారన్నారు. ఈ సందర్భంగా కోందదరెడ్డి గతేడాది తెలంగాణలో పత్తి కొనుగోళ్లలో జరిగిన లోపాలను సిసిఐ అధికార వివరించిన కోదండరెడ్డి ఈ ఏడాది అలా జరగకుండ పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి రైతులకు నష్టం జరగకుండా పత్తి కొనుగోళ్లు జరిగేలా చూడాలని సిసిఐకి సూచించారు. లేకపోతే రైతులు తొందరపడి ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవడం వల్ల నష్టపోతున్నారని, దీనిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పత్తి పంటను తొందరపడి ప్రైవేటు మార్కెట్‌లో అమ్ముకోవద్దని పత్తి రైతులకు రైతు సంక్షేమ కమిషన్ విజ్ఞప్తి చేసింది. తేమ 12 శాతం వరకు అనుమతి ఉంటుందని, పత్తి పంట పొలాల నుంచి కొనుగోలు కేంద్రాలకు సంచులల్లో కాకుండా ఓపెన్ గానే తీసుకురావాలని సూచించింది.. పత్తి కొనుగోలుకు సంబంధించి ఈనెల 6వ తేదీన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సంబంధిత అధికారులతో కేంద్ర కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిర్వహించనున్న సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి వెల్లడించారు.

## 7న పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన

పాలస్తీనా సంఘీభావ కమిటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను జయప్రదం చేయాలనీ పాలస్తీనా సంఘీభావ కమిటీ పిలుపునిచ్చింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరా పార్క్ దాకా ప్రదర్శనను జరుగుతుందని, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శనివారం పాలస్తీనా సంఘీభావ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో వామపక్ష ప్రజాసంఘాల నేతలు, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు స్టాలిన్, మహేందర్, హన్మేష్, ఝాన్సీ, తేజ, తుడుం అనిల్‌కుమార్, కర్ర దానయ్య, విజయ్, పర్వీనా ఖలీద్, కృష్ణ, మునీర్ పటేల్, ఛాయాదేవి, వి. సంధ్య, అనసూయ, అరుణ, అనురాధ, సరళ, శ్రీకాంత్, జావిద్, మహేశ్, అఫ్సర్ పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన వాల్ పోస్టర్‌ను విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంజిమోన్ నెతన్యాహూ, డోనాల్డ్ ట్రంప్‌లు ఆకాశం నుంచి బాంబుల వర్షాన్ని కురిపిస్తూ, నర రక్త జీవనదిని చూస్తూ వికటాట్టహాసం చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్ల కాలంలో 65 వేల మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకొని, కనీస యుద్ధ విలువలను పాటించకుండా తమ నరమేథాన్ని సాగిస్తూనే ఉండడం దుర్మార్గమన్నారు. తక్షణమే పాలస్తీనాపై యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా నష్టపోయిన పాలస్తీనాలోని గాజా ప్రజలను ప్రపంచ దేశాలు ఆదుకోవాలని వారు కోరారు.

## రైలు ప్రయాణికుల సేవలే లక్ష్యం

అధికారులకు జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైలు ప్రయాణికులకు సేవలు అంధించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని అధికారులకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో శనివారం ఆయన 'అమృత్ సంవాద్ స్పెషల్ క్యాంపెయిన్ 5.0'ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా అమృత్ సంవాద్ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమం ప్రతి స్టేషన్‌లో ఈ ఏడాది పొడుగునా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైల్వే ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు ఏ విధంగా చేయవచ్చనే అభిప్రాయాలను ప్రయాణికుల నుంచి తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు అందించే సూచనలు,సలహాలను పరిగణిలోకి తీసుకుంటామన్నారు. పంచుకున్నారు. పారిశుధ్యం, ఎస్కలేటర్ యాక్సెస్ మరియు ఆన్‌బోర్డ్ క్యాటరింగ్ సేవలు వంటి ప్రయాణీకుల సౌకర్యాల మెరుగుదల. శ్రీవాస్తవ ఈ సమస్యలను నేరుగా ప్రస్తావించారు . అమృత్ స్టేషన్ ఇనిషియేటివ్ కింద బేగంపేట ప్రధాన పునరాభివృద్ధి స్టేషన్లలో ఒకటి అని నొక్కి చెప్పారు. భద్రత, పరిశుభ్రత, స్టేషన్ శుభ్రత, నీటి సౌకర్యాలు మరియు క్యాటరింగ్‌కు సంబంధించిన సూచనలను మొత్తం ప్రయాణీకుల అనుభవాన్ని మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే, సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు 'గో గ్రీన్' చొరవలో భాగంగా, జనరల్ మేనేజర్ రైలు వినియోగదారులకు జ్యూట్ బ్యాగులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు.

## హరీశ్‌రావుకు అరుదైన వ్యాధి

టిపిసిసి మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హరీశ్ రావుకు ఓ అరుదైన వ్యాధి ఉందని.. తమకు తామే గొప్ప అని ఊహించుకుంటారని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కామెంట్ చేశారు. కొత్తపేట టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులను శనివారం పరిశీలించిన హరీశ్ రావు రేవంత్ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన వ్యాఖ్యలకు రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అబద్ధాలను నిస్సంకోచంగా, నిస్సిగ్గుగా మాట్లాడటం హరీశ్‌రావుకే చెల్లిందన్నారు. ఆయనకు నార్సిసిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ అనే వ్యాధి ఉందంటూ సెటైర్లు వేశారు. అవతలి వ్యక్తులు చేసే ప్రతి పనినీ తప్పుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని.. ఏదైనా మంచి జరిగితే అది తమ ఖాతాలో వేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని ఫైర్ అయ్యారు. ఓ వైపు టిమ్స్ ఆసుపత్రులను అద్భుతంగా తీర్చిదిద్దే పనిలో ప్రభుత్వం ఉంటే.. పబ్లిసిటీ కోసం హరీశ్‌రావు పాకులాడుతున్నాడని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చాక అన్ని టిమ్స్ హాస్పిటళ్ల నిర్మాణాలపై సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ చేసి పనులను కొనసాగించాలని ఆదేశించారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రాజెక్టుల అంచనాల పెంపు అక్రమాలపై విచారణకు ఆదేశించారని పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. ఓ వైపు అత్యాధునిక వసతులతో టిమ్స్‌లను తీర్చిదిద్దే పనిలో తమ ప్రభుత్వం ఉంటే.. హరీశ్‌రావు పబ్లిసిటీ కోసం పాకులాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఎల్బీనగర్‌కు వెళ్లి ఏదో షో చేసి.. నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడారని ఆరోపించారు. ఇక దశాబ్దాల ఉస్మానియా హాస్పిటల్ కలను తాము నెరవేరుస్తుంటే ఆయన చూసి తట్టుకోలేకపోతున్నాడని సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు.

**ప్రశాంత్ కిషోర్ ఒక రాజకీయ చోర్**

ప్రశాంత్ కిషోర్ ఒక రాజకీయ చోర్ అని టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత్ కిషోర్ ప్రిపెయిడ్ రీచార్జ్ లాంటి వాడని.. ఎంత రీచార్జ్ చేస్తే అంత టాక్ టైం.. అంతే, అంతకుమించి కాదుని అన్నారు. బీహార్ ప్రజల సంక్షేమం కోసం తన 50 ఏళ్ల జీవితంలో కనీసం 15 నిమిషాలు మాట్లాడిన పాపాన పోలేదని విమర్శించారు. బీహార్ కోసం ఆయన ఏనాడు పనిచేయలేదని, ఇతర నేతల పక్షాన టాక్‌టైమ్‌లా ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతాడన్నారు. అలాంటి వ్యక్తిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

## పొన్నం ప్రభాకర్‌పై అంజన్ కుమార్ ఆగ్రహం

పార్టీలో పొన్నం ప్రభాకర్ కంటే తాను సీనియర్ నాయకుడినన్న అంజన్ కుమార్ యాదవ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సొంత పార్టీ నేత, మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టిక్కెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య విభేదాలు వెలుగుచూస్తున్నాయి. జూబ్లీహిల్స్ టిక్కెట్ కోసం అంజన్ కుమార్ యాదవ్ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్థానికులకు అవకాశం ఉంటుందని, బయటి నుంచి దిగుమతి ఉండదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలపై అంజన్ కుమార్ యాదవ్ స్పందించారు. పార్టీలో పొన్నం ప్రభాకర్ కంటే తాను సీనియర్ నాయకుడినని చెప్పారు. జూబ్లీహిల్స్ టిక్కెట్ ఎవరికి అనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని, పొన్నం ప్రభాకర్ కాదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఒకే కుటుంబం నుంచి ఒకరికి మించి ప్రజాప్రతినిధులుగా ఉన్నారని కూడా ఆయన గుర్తు చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి, కోమటిరెడ్డి సోదరులు, మల్లు భట్టివిక్రమార్క, ఆయన అన్న మల్లు రవి, వివేక్ కుటుంబంలో ఆయన మంత్రిగా ఉంటే కొడుకు ఎంపిగా, సోదరుడు ఎమ్మెల్యేగా ఉన్నారని గుర్తు చేశారు. తన కుమారుడు ఎంపిగా ఉన్నంత మాత్రాన తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. బిఆర్ఎస్ హయాంలో కెసిఆర్ హైదరాబాద్‌లో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉండాలని మహమూద్ అలీకి ఎమ్మెల్సీ ఇచ్చి ఉప ముఖ్యమంత్రిని, హోంమంత్రిని చేశారని గుర్తు చేశారు. నాయిని నర్సింహారెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చి హోంమంత్రిని చేశారని అంజన్ కుమార్ యాదవ్ తెలిపారు. మూడు రోజుల కిందట సిఎం నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్, అంజన్ కుమార్ యాదవ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సిఎంను కలుస్తానని అంజన్ కుమార్ యాదవ్ కోరడంతో సిఎం ఎవరిని కలవరని మంత్రి పొన్నం అనడంతో ఇరువురి వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం.

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం




**ప్రజాపక్షం/ఆలేరు** :తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం శనివారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ గ్రామీణ ఉపాధి పనిలో పనిచేస్తున్న పేద కూలీలకు సంవత్సరానికి రూ.12,000 ఇవ్వాలని, అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో కొత్త పెన్షన్లను ప్రవేశపెట్టాలని సిపిఐగా ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గార భిక్షపతి, బొడ్డు ఆంజనేయులు, ఎండి అబీబ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మయ్యను పరామర్శించిన ఎమ్మెల్సీ



**ప్రజాపక్షం/నూతనకల్** : సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ జడ్‌పిటిసి మూరగుండ్ల లక్ష్మయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో శనివారం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆయన స్వగ్రామం ముకుందాపురంకు వెళ్ళి ఆయనను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మయ్య త్వరగా కోలుకొని ప్రజాఉద్యమాలలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు మందవ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌లు పరామర్శించిన వారిలో ఉన్నారు.



## 'ట్రిపుల్‌ఆర్' అలైన్మెంట్ రద్దు చేయాలి

### మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** బడా పారిశ్రామికవేత్తలను కాపాడేలా త్రిబుల్ ఆర్ అలైన్మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారంటూ భూ నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. శనివారం సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని త్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని చిట్యాల మండలంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ దివిస్ కంపెనీను కాపాడేందుకే త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చారని అన్నారు. రీ సర్వే చేసి ఓఆర్ఆర్ నుండి 40 కిలోమీటర్ల పరిధిలో త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ చేయాలని మంత్రి కోమటిరెడ్డిని విజ్ఞప్తి చేశారు. కావున దక్షిణభాగం అలైన్మెంట్‌ను పూర్తిగా రద్దుచేసి రీ సర్వే చేపట్టిన తర్వాతే అలైన్మెంట్ చేయాలని భూ నిర్వాసితులు కోరారు. మంత్రిని కలిసిన వారిలో భూ నిర్వాసితులు పల్లె శేఖర్ రెడ్డి, పల్లె పుష్ప రెడ్డి, పగిళ్ల మోహన్ రెడ్డి, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్‌లు ఉన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/అర్వపల్లి** : అధికారులు ఎప్పుడు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రోగులకు అందించే మందుల స్టాక్ వివరాలకు సంబంధించి డాక్టర్ భూక్య నగేష్ నాయక్‌ను అడిగి రికార్డులను పరిశీలించారు. రోగులతో కలుపుగోలుగా మాట్లాడాలని, వైద్య సేవలను సక్రమంగా అందించాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంను సందర్శించి పరిశీలించారు. కార్యాలయానికి వివిధ రకాల సర్టిఫికెట్లు, సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ శ్రీకాంత్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సాగర్‌లో పర్యాటకుల సందడి..



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. తెలంగాణ రాష్ట్రం నుంచేగాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు సాగర్ సందర్శనకు వచ్చారు. అలాగే వారాంతం కావడంతో పలువురు ఉద్యోగులు సందర్శించారు. పర్యాటకులు అధిక సంఖ్యలో రావడంతో బుద్ధవనం, కృష్ణాతీరం, నాగార్జునకొండ తదితర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి.పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, అణుపు, ఎత్తిపోతల, కొత్తవంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు. హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహం వెనక వైపున ఉన్న లాంచీ స్టేషన్ నుంచి జలాశయం మధ్యలో ఉన్న నాగార్జున కొండకు పర్యాటకశాఖ మూడు ట్రిప్పులు లాంచీలు నడిపింది.

## ప్రజలందరికీ దుర్గామాత అనుగ్రహం



**ప్రజాపక్షం/దేవరకొండ:** పట్టణంలోని ఎయిల్‌టెల్ టవర్ దుర్గామాత కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పూజా కార్యక్రమంలో శనివారం ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రాంత ప్రజలపై ఉండాలని అన్నారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు శాలువాతో ఎంఎల్‌ఏను సన్మానించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, అరుణసురేష్‌గౌడ్, సర్వయ్య, జాన్, హరికృష్ణ, చంద్రశేఖర్, వెంకటయ్య, రంగయ్య, కరుణాకర్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో నాలుగు మేకలు మృతి



**ప్రజాపక్షం/అర్వపల్లి** : విద్యుత్ మెయిన్ లైన్ తెగి పడి విద్యుత్‌శాఖకు గురై నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మనుబోతుల లింగయ్య సాయంత్రం మేకలను మేపుకుంటూ వస్తుండగా సాయంత్రం కురిసిన వర్షానికి అదే సమయంలో మేకలు వెళ్తుండగా విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ వద్ద విద్యుత్ మెయిన్ లైన్ తెగిపోయి మూడు మేకలు అక్కడికి అక్కడే మృతి చెందాయి. మరోవైపు మేకల కాపరి కూడా విద్యుత్ శాఖకు తగిలింది అదృష్టవశాత్తు ప్రాణాలతో బయట పడ్డాడు. మేకల విలువ సుమారు రూ.40వేలకు పైగా ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

# పకడ్బందీగా ఎన్నికల విధులు

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి** : ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని, అధికారులు సమన్వయంగా పని చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకి సంబందించి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకి ఎన్నికల విధులు, బాధ్యతలు, నియమ నిబంధనల పైన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, రెవిన్యూ కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బాధ్యత, రిటర్నింగ్ అధికారిదేనని, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి పోలింగ్ కు సంబంధించిన సామాగ్రి సమకూర్చడం మొదలగు ప్రతి అంశాలను క్షుణ్ణంగా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల ప్రక్రియ కీలకమైనదని అన్నారు. అదనపు కలెక్టర్ నామినేషన్లపై రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేశారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి,ఎన్నికల నిర్వహణ కై వివిధ అంశాలకు కేటాయించిన ఆర్వో లు, ఏ ఆర్వో లు, ఎంపీడీవో లు మండల స్పెషల్ ఆఫీసర్ ఆఫీసర్లు, మండల్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ లు పాల్గొన్నారు.

**ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు హాజరుకాని వారిపై చర్యలు : కలెక్టర్**

ఈనెల ఆరవ తేదీన మండల కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులకు హాజరు కావాలని, హాజరుకానీ వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈనెల ఆరవ తేదీన ప్రతి మండలాలలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమమునకు ప్రిసైడింగ్ అధికారులు, అధికారులు తప్పనిసరిగా ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలని, హాజరు కాని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. లీవ్‌లో ఉన్నవారు సైతం లీవ్ క్యాన్సిల్ చేసుకుని ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆదేశించారు.

## ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** దసరా సెలవుల్లో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి గల్లంతై ఇద్దరు యువకులు మృత్యు వాతకు గురైన సంఘటన మండలంలోని జివ్విగూడెం లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలం పరిధిలోని జువ్విగూడెం అవాసా గ్రామమైన వెంకటేశ్వర్ల బావి కాలనీ సమీపంలోని ప్రైవేట్ ఫామ్ హౌస్లో ఉన్న పాత బావిని గతంలో స్విమ్మింగ్ పూల్గా మార్చడంతో వివిధ గ్రామాలకు చెందిన 13 మంది స్నేహితులు ఈతకు వెళ్లారు. ఇందులో ఈత రాక ఇద్దరు పిల్లలు గల్లంతు కావడంతో, సమాచారం తెలిసిన పోలీసులు ఈత గాళ్ళ సాయంతో వెతకగా ఇద్దరి మృత దేహాలను వెలికి తీశారు. మృతి చెందిన యువకుల్లో నార్కట్ పల్లి పట్టణానికి చెందిన వ్యాపార వేత్త నల్ల గొండ నాగరాజు స్వాతి దంప తుల పెద్ద కుమారుడు రిషిక్, చౌటుప్పల్ కు చెందిన పోలోజు హర్షవర్ధన్ గా గుర్తించినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.




## రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తుర్కలషాపురం గ్రామంలో గాంధీ జయంతి ని పురస్కరించుకొని శనివారం జిల్లా, మండల న్యాయ సేవాధికార సంస్థ , నీడ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సిడబ్ల్యూసి సభ్యులు కునగళ్ల మల్లేశం అధ్యక్షతన జరిగిని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నీడ్ ఎన్జీవో గౌరవ అధ్యక్షులు, ప్రముఖ్య జర్నలిస్టు కాదూరి అచ్చయ్య, గ్రామ మాజీ సర్పంచ్ పురుగుల మల్లేష్‌లు హాజరై మాట్లాడుతూ రోడ్డు భద్రతా చట్టాలు, న్యాయ సలహాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఏడిఎంఎస్ ఈ బైక్ టీం లీడర్ చేట్టిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు పెట్రోల్, డిజిల్ వాహనాలను మార్చి ఎలక్ట్రికల్ వాహనాలను ఉపయోగించాలని సూచించారు. అనంతరం డ్రైవర్లకు శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పిఎల్‌విలు శ్రీశైలం, మౌలానా, యాదయ్య, విజయలక్ష్మీ , గ్రామ పెద్దలు రామచంద్ర, నాగయ్య, డ్రైవర్ల యూనియన్ యాదయ్య, యాకన్న, అయోధ్య, మల్లేష్, గణేష్, నర్సయ్య, పాండు, అనిల్, రాకేష్ పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి : కలెక్టర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ నెల 4 నుండి 12 వరకు మానసిక ఆరోగ్యం శ్రేయస్సుపై లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ వారు నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రం లోని ఎన్‌జి కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరు ఎదో రకంగా మానసికంగా బాధపడుతున్నారని,మరికొందరు మానసిక వత్తిడికి లోనవుతున్నారన్నారు. అయినప్పటికీ మనం ఈ సమస్యను పక్కన పెడుతున్నామని, మానసిక వత్తిడి తగ్గాలంటే జీవన విధానం మార్చుకోవాలని ,స్మార్ట్ ఫోన్ ను సాధ్యమైనంతగా తగ్గించాలని, ప్రత్యేకించి పాఠశాల, కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఫోన్ ను పక్కన పెట్టాలన్నారు. పెద్దలు సైతం రాత్రి సమయాలలో వత్తిడి లేకుండా ఉన్నప్పుడే మంచి నిద్రతో పాటు, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.పోటీ పరీక్షలు,ఇతర అంశాలలో పేద పిల్లలకు సహాయం చేసేందుకు నల్లగొండలో ఒక టౌన్ హాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఈ విషయంలో లయన్స్ క్లబ్ సహకరించాలని కోరారు. లయన్స్ క్లబ్ లాగా అందరూ ముందుకు వచ్చి సామాజిక సేవా పద్ధతిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ మదన్ మోహన్, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు

### ఇఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ ఇరుగుదిండ్ల భాస్కర్

### గట్టుప్పల్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/చండూరు/గట్టుప్పల:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పేదరికంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఆర్థిక చేయూత తో పాటు ప్రజాసేవే ద్యేయంగా పనిచేస్తూ అందరికి అందుబాటులో ఉంటానని ఇఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ ,సామాజిక వేత్త ఈఎల్‌విభాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన గట్టుప్పల మండల కేంద్రంలోని తన వ్యవసాయ క్షేత్రంలో దసరా ఉత్సవాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు, చండూరు, సంస్థాన్ నారాయణపురం , గట్టుప్పల మండల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జీ క్యామ మల్లేష్ హాజరై ప్రసంగించారు. ఏపూరి సోమన్న కళాబృందం ఆలపించిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు జబర్దస్త్ ఫేమ్ రాకింగ్ రాకేష్ లైలాగ్‌లతో ప్రజలను అబ్బురపర్చారు. వేలాదిగా హాజరైన ప్రజలకు రుచికరమైన మటన్ ,చికెన్ ,కూరగాయల బోజనాలు తయారు చేశారు. ఆత్మీయ సమ్మేళనంకు హాజరైన ప్రజలను ఉద్దేశించి భాస్కర్ మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రంలో వ్యాపారం చేస్తున్న తన సొంత రాష్ట్రం తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లా లో ప్రజా సేవ చేస్తూ గ్రామీణ ప్రాంతాలలో విద్య , వైద్యం , ఉపాధి , మౌళిక వసతుల కల్పన లక్ష్యంగా ముందుకు వెళ్తానని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈఎల్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాస్కర్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ , శంకర్ , కర్నాటి వెంకటేశం , సత్తయ్య, చంద్రయ్య , శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ నీళ్లు రాక గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు

### నెల రోజులుగా భగీరథ నీరు రాక ప్రజల అవస్థలు...ప్రత్యామ్నాయ మార్గాలు చూపని అధికారులు

### వాగులో నీటి ఫ్లోటింగ్ తగ్గినా మరమ్మతులు చేయని అధికారులు




**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలంలోని కందుకూరు వాగులో ఎగువన కురిసిన వర్షాల కారణంగా వాగులో వరద ఉధృతికి పైపులు కదిలి లీకేజి కావడంతో గత నెల రోజుల నుండి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో దాదాపు 120 గ్రామాల వరకు నీటి సరఫరా బంద్ కావడం జరిగింది. మిషన్ భగిరత నీరు బంద్ అయినప్పటి నుండి గ్రామాలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కొన్ని గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా గ్రామ పంచాయతీలకు సంబందించిన బోర్లు ఉండడం, మరికొందరు గ్రామ పంచాయతీ ట్రాక్టర్లతో ప్రజలకు తాత్కాలికంగా వెసులుబాటు కల్పించి నీటిని అందిస్తే కొంత అధికారులు మాకేం పట్టనట్లు మెజార్టీ గ్రామాల్లో వ్యవహరిస్తున్న అధికారుల తీరు పట్ల ప్రజలకు నీటి కష్టాలు తీరడం లేదు. గట్టిగా ఎవరైనా అధికారులను ప్రశ్నిస్తే మా పంచాయతీలో డబ్బులు లేవని ప్రభుత్వం ఇవ్వడం లేదని ప్రజలే పెట్టుకొండి తర్వాత బడ్జెట్ వచ్చాక ఇస్తామని సమస్యను జటిలం చేస్తున్నారు. ఇప్పటికి నెల రోజుల గడుస్తున్నా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టకపోగా సదరు మిషన్ భగీరథ అధికారి ఎత్తరు లేదంటే స్విచ్ ఆఫ్ ఉంటుందని ప్రజలు, పలు పార్టీల నాయకులు వాపోతున్నారు. అధికారులు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడొద్దని నిర్లక్ష్యం వీడి మరమ్మతులు చేసి భగీరథ నీటిని అందించాలని కోరుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు ఉంది...నూనె వెంకటేశ్వర్లు**

గత నెల రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, మిషన్ భగీరథ నీటి సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతుందని తక్షణమే మరమ్మతులు చేసి నీటిని అందించాలని ఏఐటీయుసి డివిజన్ సంఘం అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు అన్నారు.

**ప్రజాపాలనలో ప్రజలకు నీటి కష్టాలు....విష్ణు-వర్ధన్‌రెడ్డి**

కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు నీటి కష్టాలు ఎక్కువయ్యాయని గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటి కష్టాలు ప్రజలకు తెలియవని ఒక వేళ ఎక్కడైనా మరమ్మతులు అవసరం వచ్చినా వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం అయ్యేదని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మరమ్మతుల సమయంలో ప్రత్యామ్నాయంగా గ్రామపంచాయతీ ట్యాంకర్లతో ప్రతి ఇంటికి నీటి సమస్య లేకుండా పరిష్కారం చూపారని బిఆర్ఎస్ మండల నాయకులు మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో అధికారులు ప్రజా సమస్యలను ఎప్పుడో వదిలేసారని కేవలం ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు చెప్పింది చేయడమే అధికారుల వంతుగా మారిందని అన్నారు. తక్షణమే నీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.

## నేత్రదానం అంధులకు చూపునిచ్చే కార్యక్రమం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మండలం, బాబాసాహెబ్ గ్రామానికి చెందిన ఏమిరెడ్డి చెన్నరెడ్డి(85) శనివారం మృతి చెందారు. మరణ వార్త తెలిసిన వెంటనే లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ గెలాక్సీ సభ్యులు వారి కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను సేకరించారు. ట్రస్ట్ చైర్మన్ లయన్ కెవి ప్రసాద్,ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఇది 200వ నేత్రదానం అని, వీటి ద్వారా సేకరించిన 400 కార్నియా అను కంటిపొరల ద్వారా 400 మందికి పైగా కార్నియల్ అంధులకు కంటిచూపును ప్రసాదించే మహోన్నతమైన అవకాశం మాకు కలిగినదని ఈ నేత్రదాతల కుటుంబ సభ్యులకు మా ప్రత్యేక ధన్యవాదా లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ డొనేషన్ సెంటర్ టెక్నీషియన్ బచ్చలకూర జానీ, సభ్యులు డాక్టర్ ప్రనూష, డాక్టర్ నితీష, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ అధ్యక్షులు నిమ్మల పిచ్చయ్య, కార్యదర్శి ఎర్రమాద అశోక్, కోశాధికారి ఆదినారాయణ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ దామోర యాదయ్య పాల్గొన్నారు.

## కృష్ణానది వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు కొత్త బ్రిడ్జి ప్రక్కన హనుమాన్ పుష్కర ఘాట్ వద్ద శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. కృష్ణానది హనుమాన్ పుష్కర ఘాట్ వసుమారు (35)సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు అక్కడి స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం స్థానిక ఏరియా కమలా నెహ్రు ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి ఒంటిమీద చొక్కా లేకుండా ముదురు నీలం రంగు నిక్కర్ దరించి ఉన్నాడు. నెలరోజుల క్రితం ఒక ప్రైవేటు ఉద్యోగి ఐదు రోజుల క్రితం ఒక విద్యార్థి ఇదే ప్రదేశంలో గల్లంతవ్వగా ఈ మృతదేహం వారికి సంబంధించినదా, లేదా అనే విషయం తెలియాల్సి ఉంది మృతదేహం మొత్తం బాగా కుళ్ళిపోయి పురుగులు పట్టి గుర్తుపట్టలేని విధంగా ఉందని పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## అశ్వినీకి సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్రప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ నిర్వహించే కౌశల్ దీక్షాంత్ సమారోహ (నైపుణ్య స్నాతకోత్సవ వేడు) 2025లో భాగంగా ఈనెల4న గౌరవ ప్రధానమంత్రివర్యులు నరేంద్రమోడీ అవార్డు ప్రదానం చేయనున్నారు. భా గంగా సిటిఎస్ మెయిన్స్ 2025 పరీక్షలలో ట్రేడ్వైజ్ టాపర్ అయిన ఆడెపు అశ్వినిని గవర్నమెంట్ ఐటిఐ (ఓల్డ్) నల్లగొండ లో సన్మానించారు. సన్మాన గ్రహీత ఆడెపు అశ్విని, తల్లి నర్సమ్మ, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సింహ్మాచారి,నవీన్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సురేందర్గా ,శిక్షణా సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సరిహద్దుల్లో పాక్ డ్రోన్ సంచారం



**సాంబా/జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో సాంబా జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న ఒక గ్రామంపై పాకిస్తాన్‌కు చెందిన డ్రోన్ సంచరిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు గాలింపు చర్యలు ప్రారంభించాయని అధికారులు శనివారం తెలిపారు. పాకిస్తాన్ వైపు నుండి డ్రోన్ లాంటి వస్తువు వచ్చి శుక్రవారం రాత్రి రామ్‌గఢ్ సెక్టార్‌లోని నంగా గ్రామంపై సంచరించడంతో సరిహద్దు ప్రాంతంలో అప్రమత్తత ఏర్పడిందని వారు తెలిపారు. భద్రతా దళాలు, పోలీసు బృందాలు వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి, సరిహద్దు అవతల నుండి మాదకద్రవ్యాలు, ఆయుధాలు వంటి పేలోడ్‌ను విమానంలో పడవేయకుండా చూసుకున్నాయన్నారు. గత నివేదికలు అందినప్పుడు శోధన ఆపరేషన్ కొనసాగుతోందని, ముందు జాగ్రత్త చర్యగా పొరుగు గ్రామాలలో భద్రతను పెంచామని అధికారులు తెలిపారు.



## అరేబియా సముద్రంలో 'శక్తి' తుపాను

**న్యూఢిల్లీ :** నాలుగు నెలల వానా కాలం ముగిసిన తరువాత తొలిసారి అరేబియా సముద్రంలో తుపాను లేచింది. దీనికి 'శక్తి'గా నామకరణం చేశారు. దీని ప్రభావంతో సముద్రంలో అల్లకల్లోలంగా మారి, గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని అధికారులు శనివారం తెలిపారు. తీవ్ర తుపానుగా మారిన 'శక్తి' అరేబియా సముద్రంలోకి మరింత కదులుతూ గుజరాత్‌లోని ద్వారక నుండి 420 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ కార్యాలయం తెలిపింది. ఆదివారం నాటికి పశ్చిమనైరుతి దిశగా కదిలి వాయువ్య, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమమధ్య అరేబియా సముద్రానికి చేరుకునే అవకాశం ఉందని, సోమవారం ఉదయం నుండి శక్తి తిరిగి తూర్పు-ఈశాన్య దిశగా కదులుతుందని, క్రమంగా బలహీనపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఈ తుపాను ప్రభావంతో గుజరాత్‌-ఉత్తర మహారాష్ట్ర తీరంష పాకిస్తాన్ తీరం వెంబడి ఆదివారం వరకు సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశముంది. మంగళవారం వరకు వాయువ్య అరేబియా సముద్రం, ఈశాన్య అరేబియా సముద్రం, మధ్య అరేబియా సముద్రం, గుజరాత్‌-ఉత్తర మహారాష్ట్ర తీరాల వెంబడిష వెలుపల మత్స్యకారులు వెళ్లవద్దని వాతావరణ కార్యాలయం హెచ్చరించింది. ఇటీవలి సంవత్సరాలలో, అరేబియా సముద్రంలో తౌక్తే (2021), బిపర్‌జోయ్ (2023) వంటి తుపునులు ఏర్పడ్డాయి. ఇది బంగాళాఖాతంతో పోలిస్తే తక్కువ తుపానులను చూసింది. ఉష్ణమండల తుపానులపై డబ్ల్యుఎంఒ / ఇఎస్‌సిఎపి ప్యానెల్ అనుసరించిన సమావేశం మేరకు శ్రీలంక సూచించిన పేరు ప్రకారం ఈ తుపానుకు శక్తి అని పేరు పెట్టారు. బంగాళాఖాతం, అరేబియా సముద్ర అంచున ఉన్న 13 దేశాలు తుపానుల పేర్లను సూచించాయి.

## మా డిమాండ్‌లో 8వ వంతు కూడా ఇవ్వలే

### వయనాడ్‌కు వరద సాయంపై కేంద్ర సర్కార్‌పై మండిపడిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



**తిరువనంతపురం :** కొండచరియలు విరిగిపడిన వయనాడ్‌కు సహాయం అందించడంలో ఆలస్యం జరిగిందనే ఆరోపణలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రం డిమాండ్‌లో ఎనిమిదవ వంతు కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. నిబంధనల ప్రకారం కొండ ప్రాంత జిల్లా పునర్నిర్మాణానికి రాష్ట్రం రూ.2221.03 కోట్ల కేంద్ర సహాయాన్ని డిమాండ్ చేసిందని ఆయన చెప్పారు. కానీ, ముండక్కై-చూరల్‌మలలో కొండచరియలు విరిగిపడిన విషాదం జరిగిన ఒక సంవత్సరం రెండు నెలల తర్వాత కేంద్రం రూ.260.56 కోట్లు మాత్రమే మంజూరు చేసిందని ముఖ్యమంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తం తమ వాస్తవ డిమాండ్‌లో ఎనిమిదవ వంతు కూడా కాదని, కేరళను విస్మరించాలనే నిర్ణయంపై అన్ని వర్గాల నుండి నిరసన వ్యక్తమైందని, ఆ నిరసన యావత్ రాష్ట్ర భావోద్వేగమని విజయన్ అన్నారు. కేరళ మనోభావాలను అర్థం చేసుకుని, రాష్ట్రం, విపత్తు బారిన పడిన ప్రజల హక్కులను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, వారికి ఎటువంటి ఆలస్యం లేకుండా అవసరమైన సహాయం అందించాలని ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారు. వయనాడ్‌కు సకాలంలో సహాయం అందించడంలో కేంద్రం వైపు నుండి జరిగిన జాప్యాన్ని వివరిస్తూ, వయనాడ్ కొండచరియలు విరిగిపడిన విషాదాన్ని కేంద్ర ప్రభుత్వం పెద్ద విపత్తుగా ప్రకటించడానికి ఐదు నెలలు పట్టిందని, దీనివల్ల అంతర్జాతీయ సహాయాలు లభించే అవకాశం లేకుండా పోయిందని విజయన్ ఎత్తి చూపారు. జులై 30, 2024న కొండచరియలు విరిగిపడిన విపత్తు సంభవించిందని, ప్రధానమంత్రి నేరుగా ఆ ప్రదేశాన్ని సందర్శించడానికి వచ్చారని ఆయన అన్నారు. పది రోజుల్లోనే, పరిస్థితిని సమీక్షించడానికి కేంద్ర బృందం వచ్చింది. ప్రాథమిక అంచనా వేసిన తర్వాత, కేరళ రూ.1202.12 కోట్ల అత్యవసర సహాయం కోరగా, ఏమీ ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. విపత్తు బాధితుల రుణాలను మాఫీ చేయాలని అభ్యర్థించినప్పటికీ, కేంద్రం ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోలేదని విజయన్ అన్నారు. రుణాల మాఫీకి సహాయపడే విపత్తు నిర్వహణ చట్టంలోని సెక్షన్ 13ని కూడా కేంద్ర ప్రభుత్వం తొలగించిందని ఆయన అన్నారు. కాగా, కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఇలాంటి అభిప్రాయాలను పంచుకున్నారు. కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో ప్రభావితమైన వయనాడ్ ప్రజలను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. సహాయ, పునరావాస పనులను రాజకీయాల కంటే ఎక్కువగా చూడాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల బాధలను రాజకీయ అవకాశంగా చూడకూడదని, వయనాడ్ ప్రజలు న్యాయం, మద్దతు, గౌరవానికి అర్హులని ఎంపి పేర్కొన్నారు.

## మావోయిస్టులతో చర్చలకు.. నో ఛాన్స్



### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

### ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తాం

### ప్రభుత్వపరమైన ప్రయోజనాలు, పునరావాసం కల్పిస్తామని హామీ

**జగ్‌దల్‌పూర్ (ఛత్తీస్‌గఢ్) :** మావోయిస్టులతో ప్రభుత్వం ఇక ఎలాంటి చర్చలు జరుపబోదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టంచేశారు. వారు ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకువస్తే స్వాగతిస్తామని, లొంగిపోయిన మావోయిస్టులు అందరికీ ప్రభుత్వం నుండి అందాల్సిన ప్రయోజనాలను అందిస్తామని, పునరావసం కూడా కల్పిస్తామని అమిత్‌షా హామీ ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తార్ జిల్లా కేంద్రం జగ్‌దల్‌పూర్‌లో శనివారం జరిగిన 'బస్తర్ దసరా లోకోత్సవ్' మరియు 'స్వదేశీ మేళా'ను ఉద్దేశించి హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించారు. 2026 మార్చి 31వరకు డెడ్‌లైన్ లోపల నక్సలిజాన్ని అంతమొందిస్తామని అమిత్‌షా పునరుద్ఘాటించారు. 'నేను నా గిరిజన సోదరులు, సోదరీమణులు అందరికీ చెప్పే మాట ఒకటుంది. మీ గ్రామాల యువత చేతిలో ఉన్న ఆయుధాలను విడిచిపెట్టేలా మీరంతా వారిని ఒప్పించండి. వారు హింసను వీడి జనజీవన స్రవంతిలో కలవాలి. బస్తర్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని అమిత్‌షా పేర్కొన్నారు. బస్తర్‌లో మావోయిస్టులు శాంతికి విఘాతం కల్పిస్తే ఛత్తీస్‌గఢ్ పోలీసులు సహా సిఆర్‌పిఎఫ్ బలగాలు తగిన బుద్ధి చెబుతాయని హోం మంత్రి అమిత్‌షా హెచ్చరించారు. తాను ఇక్కడి ప్రసిద్ధ మాత దంతేశ్వరి ఆలయాన్ని సందర్శించానని, 2026 మార్చి 31వరకు రెడ్ టెర్రర్' నుంచి యావత్ బస్తర్ ప్రాంతానికి పూర్తి విముక్తిని ప్రసాదించేలా భద్రతా బలగాల బలాన్ని పెంచాలని తాను దంతేశ్వరి మాతను ప్రార్థించానని ఆయన తెలిపారు. 2023లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం అయ్యాయి. ఎన్‌కౌంటర్లలో 450మందికి పైగా మావోయిస్టులను భద్రతా బలగాలు కాల్చి చంపాయి. ముఖ్యంగా గత ఏడాది జనవరి నుంచి బస్తర్ ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతున్నారు. కొంతమంది మావోయిస్టులతో చర్చలకు పిలుపు నిచ్చారు. 'ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వం ఇరు ప్రభుత్వాలు కూడా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన బస్తర్ వ్యాప్తంగా అభివృద్ధికి కట్టుబడి ఉంది. ఇక వారితో మేం మాట్లాడాల్సి ఏమి ఉంటుంది? వారు లొంగిపోయిన పక్షంలో వారికి మంచి ఆకర్షణీయమైన ప్రభుత్వం నుండి అందాల్సిన ప్రయోజనాలు, పునరావాసం కూడా కల్పిస్తాం. వారంతా ముందుకు వచ్చి వారి ఆయుధాలను వీడి లొంగిపోవాలి' అని అమిత్ షా పిలుపునిచ్చారు. 'ఢిల్లీలో కొంతమంది చాలా ఏళ్లుగా నక్సలిజం పుట్టుక అభివృద్ధి కోసం, పోరాటం కోసమే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ బస్తర్ మొత్తం అభివృద్ధి చెందకుండా పోయిందని నా గిరిజన సోదరులకు చెప్పడానికి నేను ఇక్కడకు వచ్చాను. దీనికి మూల కారణం నక్సలిజం' అని అమిత్‌షా చెప్పారు. 'నరేంద్రమోదీ ప్రభుత్వం10 ఏళ్లలో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లు ఇచ్చింది. నేడు విద్యుత్, తాగునీరు, రోడ్లు, ప్రతీ ఇంటిలో టాయిలెట్లు, రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా, 5 కిలోల ఉచిత బియ్యం భారతదేశంలోని ప్రతీ ఇంటికీ అందాయి. కానీ బస్తర్ ప్రాంతం మాత్రం ఆ తరహా అభివృద్ధిఫలాలను అందుకోలేకపోయింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తరపున నేను మీకు మాట ఇస్తున్నాను. 2026మార్చి 31 తర్వాత మావోయిస్టులు కూడా మీ అభివృద్ధిని ఆపలేరు. వారు మీ హక్కులను అడ్డుకునే శక్తిని ఏ మాత్రం కలిగి ఉండరు' అని అమిత్‌షా అన్నారు. 75రోజుల పాటు ఈ ప్రాంతంలో గిరిజన సాంప్రదాయంగా జరుపుకునే దసరా పండుగ ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన పండుగ అని, పండుగలు అన్నింటిలోకెల్లా దసరా పండుగ ఈ ప్రాంతంలోనే అత్యంత ప్రాముఖ్యమైనదని అమిత్‌షా చెప్పారు. 'నేను ఈరోజు మురియా దర్బార్‌కు హాజరయ్యాను. అది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. బస్తర్ డివిజన్ నుంచి అందరు గిరిజన నాయకులు హాజరయ్యారు. వారి సమస్యలను పంచుకున్నారు. నేను ఢిల్లీకి వెళ్లి ప్రతీ ఒక్కరినీ మురియా దర్బార్‌కు ఒక్కసారైనా హాజరు కావాలని చెబుతాను. 1874సంవత్సరం నుంచి చురుకుగా సాగుతోంది. న్యాయవ్యవస్థ, గిరిజన సంస్కృతి, ఆలోచనాత్మక సంభాషణ, ప్రజల భాగస్వామ్యం ఆనవాయితీగా కొనసాగుతోంది'అని హోం మంత్రి అమిత్‌షా చెప్పారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర 'మహ్‌తారీ వందన్ స్కీమ్' కింద లబ్ధిదారులైన మహిళలకు 20వ నెలవారీ ఇన్‌స్టాల్‌మెంట్‌గా ఒక్కొక్కరికీ నెలకు రూ. 1,000చొప్పున దాదాపు రూ.65లక్షల మొత్తాన్ని బ్యాంక్ అకౌంట్లకు బదిలీ చేశారు.

## 12 రాజకీయ పార్టీలతో ఇసి భేటీ

### బిహార్‌లో ఎన్నికల సన్నద్ధతను సమీక్షించిన ఎన్నికల సంఘం

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఎన్నికల సన్నద్ధతపై రెండ్రోజుల పాటు అధికారులతో సమీక్షించేందుకు ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషి, ఎస్ఎస్ సంధు శనివారం ఉదయం పాట్నా చేరుకున్నారు. తాజ్ హోటల్‌లో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో పాల్గొన్నారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇసిఐ సీనియర్ అధికారులు, బిహార్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వినోద్ గుంజ్యాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన 12 రాజకీయల పార్టీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణపై వారి అభిప్రాయలను ఇసిఐ అడిగి తెలుసుకున్నారు.

**ఒకే విడతలో ఎన్నికలకు జెడియు విజ్ఞప్తి**

రాష్ట్రంలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని తాము కోరినట్టు జెడి(యు) ఎంపి సంజయ్ ఝా తెలిపారు. బిహార్‌లో శాంతిభద్రతల సమస్య కానీ, నక్సల్స్ సమస్య కానీ లేవనీ, మహారాష్ట్రలో ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించిన తరహాలోనే బిహార్‌లోనూ ఎన్నికలు నిర్వహించాలని సమావేశంలో కోరామన్నారు. కాగా, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని అఖిలపక్ష సమావేశంలో ఎన్నికల కమిషన్ కోరింది. మతసామరస్యం, పరస్పర గౌరవం చాటుకుంటూ ఎన్నికల పండుగలో పాల్గొనాలని, ప్రతి బూత్‌లోనూ పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించింది. ఓటర్ల జాబితా సవరణకు కమిషన్ తీసుకున్న చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు గరిష్ట ఓటర్ల సంఖ్య 1,200గా కమిషన్ నిర్ణయించడాన్ని స్వాగతించారు. ఛాత్ పండుగ పూర్తయిన తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, ఇందువల్ల ఎక్కువ మంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కమిషన్‌కు తెలిపారు. సాధ్యమైనంత తక్కువ విడతల్లో ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఈనెల 6 లేదా 7వ తేదీన ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.


## రాహుల్‌పై బిజెపి విమర్శలు వంచనే అంతర్జాతీయంగా అవమానించడమే : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** అధికారంలో ఉన్న పార్టీ తన దుష్ప్రవర్తన, అవినీతి, అప్రజాస్వామిక స్వభావాన్ని బహిర్గతం చేసిన రాహుల్ గాంధీపై బిజెపి విమర్శలు చేయడం వంచనే అని కాంగ్రెస్ మండిపడింది. దేశంలో తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లినందుకు రాహుల్ గాంధీ 'భారత వ్యతిరేక శక్తుల పతాకధారి'గా మారారని ఆరోపించిన బిజెపి, ఆయన పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చిన మరుసటి కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్‌ను విమర్శించడం బిజెపికి అలవాటు మారిందని, ఇది అంతర్జాతీయంగా తమకు అవమానాన్ని తెస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. కొలంబియాలో లేదా కాన్పూర్‌లో చెప్పినా, వాస్తవికత అలాగే ఉందని, భారత ప్రభుత్వం మన ఆర్థిక వ్యవస్థ విస్తారమైన సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమైందని, మన జనాభా డివిడెండ్‌ను రద్దు చేస్తోందని మండిపడ్డారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థను హైజాక్ చేయడం ప్రపంచవ్యాప్తంగా మనకు చెడ్డపేరు తెచ్చిపెట్టిందని, దీనికి బిజెపియే కారణమన్నారు. రాహుల్ జీ స్పష్టంగా మాట్లాడినందుకు దాడి చేయడం బిజెపి మోసపూరితమైన, తప్పుదారి పట్టించే వ్యూహమని, ఆయన ప్రకటనలపై నిశితంగా దృష్టి సారించి, 2014 నుండి ఆయన ఎత్తి చూపుతున్న స్పష్టమైన లోపాలను సరిదిద్దడానికి వారు చర్య తీసుకుంటే అది వారికి బాగా ఉపయోగపడుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలను గుర్తుచేస్తూ ఆయన తన ప్రసంగాలలో కాంగ్రెస్‌పై దాడి చేస్తున్నారని, తద్వారా భారతదేశం, దేశ ప్రజలను అవమానించారన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి దుష్ప్రవర్తన, అవినీతి, అప్రజాస్వామిక స్వభావాన్ని బహిర్గతం చేసినందుకు రాహుల్ జీని ఇప్పుడు ప్రశ్నించడం బిజెపి కపటత్వం స్పష్టమవుతుందని వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో బిజెపి జాతీయ ప్రతినిధి సుధాంషు త్రివేది మాట్లాడుతూ కొలంబియాలో జరిగిన ఒక సెమినార్‌లో గాంధీ చేసిన తాజా వ్యాఖ్యలపై తీవ్రంగా విమర్శించారు. 100 సంవత్సరాలకు పైగా నెహ్రూగాంధీ కుటుంబ నియంత్రణలో ఉన్న కాంగ్రెస్ భారత వ్యతిరేక శక్తుల బారిలో పడిపోతోందని ఇప్పుడు స్పష్టమైందని ఆరోపించారు.

## బిహార్‌లో తుది ఓటర్ల జాబితాలో భారీ అవకతవకలు

### ఎన్నికల కమిషన్ అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మ : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** బిహార్‌లో తుది ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. కొన్ని నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కంటే ఓటర్ల పేర్ల తొలగింపు సంఖ్య ఎక్కువగా ఉందని పేర్కొంది. ఎన్నికల కమిషన్ అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మ అని, బిజెపి, దాని భాగస్వామ్యపక్షాలకు రాజకీయ ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించిందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. అది బిజెపి 'బిటీమ్'గా కాకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలని హితవు పలికారు. బిహార్‌లోని జముయ్‌లో ఒకే ఇంట్లో 247 మంది ఉన్నారని, ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత తుది ఓటర్ల జాబితాలో అనేక అవకతవకలు జరిగాయని పేర్కొన్న వార్తలను కూడా ఆయన ఉదహరించారు. 'బిజెపి ఆదేశం మేరకు ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ డ్రామాను రూపొందించింది. తుది ఎస్ఐఆర్‌లో ఎన్నికల కమిషన్ చేసిన సంస్కరణల వాదనలు కూడా తప్పు అని రుజువు అవుతున్నాయి. బిహార్‌లోని అన్ని ప్రాంతాల నుండి నివేదికలు వస్తున్నాయి. ఈ మొత్తం ప్రక్రియ ఏకైక ఉద్దేశ్యం బిజెపి, దాని అనుబంధ పార్టీలకు రాజకీయ ప్రయోజనం చేకూర్చడమేనని' ఆయన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత కూడా తుది జాబితాలో అనేక అవకతవకలు జరిగిన సందర్భాలు సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదని సూచిస్తున్నాయని రమేష్ ఆరోపించారు. బిజెపికి బిటీమ్‌గా పని చేస్తున్న ఎన్నికల కమిషన్ పూర్తిగా సిగ్గులేని స్థితికి దిగజారిందన్నారు. ఒకే ఇంట్లో 247 మంది ఓటర్లు ఎలా దొరికారో, ఒకే బూత్‌లో ఒక వ్యక్తి పేరు 33 సార్లు ఎందుకు వచ్చిందో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వివరిస్తారా? తుది ఓటరు జాబితాలో ఇంత భారీ అక్రమాలు ఎలా కనిపిస్తున్నాయి? లేదా వారు మునుపటిలాగే మౌనంగా ఉంటారా? అని కాంగ్రెస్ నాయకుడు నిలదీశారు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలగించబడిన ఓటర్ల సంఖ్య గత ఎన్నికల విజయాల సంఖ్య కంటే ఎక్కువగా ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మొత్తం దేశానికి చెందినదని, పాలక పార్టీకి కీలుబొమ్మలా కనిపించకూడదని కాంగ్రెస్ మొదటి రోజు నుండి చెబుతోందని ఆయన అన్నారు. బిజెపికి సహాయం చేయడానికి ప్రారంభించబడిన ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయడానికి తొందరపడకుండా ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా పనిచేయాలని తాము పునరుద్ఘాటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ప్రక్రియను ఆపడానికి ఇతర పార్టీలతో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. అయితే ఎన్నికల కమిషన్ ఎటువంటి అక్రమాలను ఖండించింది. చట్టం, రాజ్యాంగం ప్రకారం ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

## దగ్గు సిరప్ మరణాలు... తయారీ యూనిట్లలో తనిఖీలు

**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్‌లో కలుషితమైన దగ్గు సిరప్ వినియోగం వల్ల పిల్లలు మరణించినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో ఆరోగ్య మంత్రిత్వ శాఖ చర్యలకు ఉపక్రమించింది. ఆరు రాష్ట్రాల్లోని దగ్గు సిరప్‌లు, యాంటీబయాటిక్స్‌తో సహా 19 ఔషధాల తయారీ యూనిట్లలో కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ, సిడిఎస్‌సిఒ, రిస్క్ ఆధారిత తనిఖీని ప్రారంభించిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. ఔషధ నాణ్యత వైఫల్యాలకు దారితీసిన అంతరాలను గుర్తించడం, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలను నివారించడానికి ప్రక్రియ మెరుగుదలను సూచించే లక్ష్యంతో సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) తనిఖీలు అక్టోబర్ 3న ప్రారంభమయ్యాయని తెలిపింది. అదనంగా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, సిడిఎస్‌సిఒ, ఎయిమ్స్ నాగ్‌పూర్ నుండి నిపుణులతో కూడిన బహుళ విభాగ బృందం మధ్యప్రదేశ్‌లోని చింద్వారా, చుట్టుపక్కల ప్రాంతాలలో మరణాలకు కారణాన్ని అంచనా వేయడానికి వివిధ నమూనాలు, అంశాలను విశ్లేషిస్తున్నట్లు పేర్కొంది. సిడిఎస్‌సిఒ పరీక్షించిన ఆరు ఔషధ నమూనాలలో, మధ్యప్రదేశ్ ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎంపిఎఫ్‌డిఎ) పరీక్షించిన మూడు ఔషధ నమూనాలలో తీవ్రమైన మూత్రపిండాల నష్టాన్ని కలిగించే డైథిలిన్ గ్లైకాల్ (డిఇజి) మరియు ఇథిలీన్ గ్లైకాల్ (ఇజి) కలుషితాలు లేవని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు, తమిళనాడు ఆహార భద్రత, ఔషధ పరిపాలన విభాగం తమిళనాడు కాంచీపురంలోని శ్రేసన్ ఫార్మా తయారీ యూనిట్ నుండి సేకరించిన కోల్డ్‌ఫ్ కాఫ్ సిరప్ నమూనాలను పరీక్షించింది. ఫలితాలను శుక్రవారం ఆలస్యంగా వచ్చాయని, నమూనాలలో అనుమతించదగిన పరిమితికి మించి డిఇజి ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం కాఫ్ సిరప్ అమ్మకాలను నిషేధించింది. దానిని మార్కెట్ నుండి తొలగించాలని ఆదేశించింది. ఈనెల 1 నుండి, నగరానికి చెందిన సంస్థ తయారు చేసిన కాఫ్ సిరప్ అమ్మకాలను తమిళనాడు అంతటా నిషేధించినట్లు ఒక అధికారి తెలిపారు. పొరుగున ఉన్న కాంచీపురం జిల్లాలోని సుంగువర్చత్రంలో ఔషధ కంపెనీ తయారీ కేంద్రంలో గత రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించారని, నమూనాలను సేకరించినట్లు ఆయన చెప్పారు.

**రాజస్థాన్‌లో డ్రగ్ కంట్రోలర్ సస్పెన్షన్**

దగ్గు మందు వల్ల పిల్లలు మరణించినట్లు వచ్చిన ఆరోపణలపై రాజస్థాన్ ప్రభుత్వం స్పందించింది. ఆ రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్‌ను సస్పెండ చేసింది. అలాగే జైపూర్‌కు చెందిన కేసన్స్ ఫార్మా తయారు చేసిన 19 మందుల పంపిణీని నిలిపివేసింది. డెక్స్ట్రోమెథోర్ఫాన్ కలిగిన అన్ని ఇతర దగ్గు సిరప్‌ల పంపిణీని కూడా నిలిపివేసినట్లు ఆరోగ్య శాఖ తెలిసింది. ఔషధ ప్రమాణాలను నిర్ణయించే ప్రక్రియను ప్రభావితం చేశారనే ఆరోపణలపై డ్రగ్ కంట్రోలర్ రాజారాం శర్మను ప్రభుత్వం సస్పెండ చేసిందని ఆ శాఖ వెల్లడించింది.

## 10 మంది ఉగ్రవాదుల అరెస్టు

**ఇంఫాల్ :** గత కొన్ని రోజులుగా వేర్వేరు ఆపరేషన్లలో మణిపూర్‌లోని వివిధ నిషేధిత సంస్థలకు చెందిన 10 మంది ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేశాయని అధికారులు తెలిపారు. అస్సాం రైఫిల్స్ సిబ్బంది నిషేధిత సంస్థకు చెందిన 'సీనియర్ కమాండర్', చురాచంద్‌పూర్ జిల్లా అడవుల నుండి ఐదుగురు ఇతర ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పారామిలిటరీ దళం శనివారం తెలిపింది. అక్టోబర్ 1న జరిగిన ఆపరేషన్ సమయంలో ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు అది తెలిపింది. అసోం రైఫిల్స్ అక్టోబర్ 1న 'ఆపరేషన్ సాంగ్‌కోట్' అనే పేరుతో నిర్వహించిన సాహసోపేతమైన అడవి ఆపరేషన్‌లో యునైటెడ్ కుకి నేషనల్ ఆర్మీకి చెందిన సీనియర్ కమాండర్ ఎస్ఎస్ లెఫ్టినెంట్ జామ్‌ఖోగిన్ గైట్ లుఫో అలియాస్ పెప్సిని అరెస్టు చేసిందని ఒక ప్రకటనలో తెలిపింది. ఆపరేషన్ సమయంలో మరో ఐదుగురిని కూడా అరెస్టు చేసినట్లు అది తెలిపింది. 2024 జనవరిలో బిష్ణుపూర్ జిల్లాలో తండ్రి, కొడుకుతో సహా మెయిటీ కమ్యూనిటీకి చెందిన నలుగురు సభ్యుల హత్యలో యుకెఎన్ఎ కమాండర్ ప్రమేయం ఉందని మణిపూర్ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, శుక్రవారం థౌబాల్, ఇంఫాల్ పశ్చిమ జిల్లాల నుండి నలుగురు ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిషేధిత కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (అపున్‌బా)కి చెందిన ఇద్దరు క్రియాశీల కార్యకర్తలను తౌబాల్ వాంగ్‌ఖేమ్‌లో అరెస్టు చేయగా, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన స్వయం ప్రకటిత కార్పోరల్‌ను ఇంఫాల్ పశ్చిమంలోని నింగోంబమ్ నుండి అరెస్టు చేసినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. ఇంఫాల్ పశ్చిమంలోని నౌరెమ్ థాంగ్ నుండి కెసిపి (పిడబ్ల్యుజి) సభ్యుడిని భద్రతా దళాలు కూడా అరెస్టు చేశాయని ఆయన తెలిపారు.

## ఆర్‌జెడి పాలనలో.. బిహార్ 'విద్యారంగం విధ్వంసం'

### ప్రధాని మోదీ విమర్శనాస్త్రాలు

### నితీశ్ నేతృత్వంలోని 'ఎన్‌డిఎ ప్రభుత్వం భేష్' అని కితాబు

### కర్పూరీ ఠాగూర్ 'జన్‌నాయక్' గౌరవాన్ని కొందరు చోరీకి యత్నిస్తున్నారని రాహుల్‌పై పరోక్ష విమర్శలు


### బిహార్ ఎన్నికలే లక్ష్యంగా పథకాలను ప్రారంభించిన నరేంద్రమోదీ



**న్యూఢిల్లీ :** బిహార్ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల ప్రచార అట్టహాసం ఆరంభమైంది. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) ప్రభుత్వ హయాంలో 'విద్యారంగంలో విధ్వంసకర స్థితి' నెలకొన్నందువల్లే బిహార్ రాష్ట్రం నుండి పెద్దయెత్తున వలసలు జరగడానికి కారణం అయ్యిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. అప్పటి పరిస్థితిని మెరుగుపరిచి రాష్ట్రాన్ని పురోగతి మార్గంలో నడిపించినందుకు నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని ప్రధానమంత్రి ప్రశంసల్లో ముంచెత్తారు. బిహార్ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు అనేక ప్రాజెక్టులు సహా యువత కోసం నైపుణ్యాల ప్రోత్సాహకాల పథకాలను శనివారం ప్రారంభించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యులచే 'జన్‌నాయక్' అని ప్రశంసించబడే కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీపై విమర్శలు గుప్పించారు. కొంతమంది ఒబిసి నాయకుడు, మాజీ బిహార్ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాగూర్ గౌరవాన్ని 'దొంగిలించే ప్రయత్నం చేస్తున్నారని రాహుల్ గాంధీ పేరు ఎత్తకుండానే మండిపడ్డారు. ఠాకూర్‌కు సామాజిక ట్రోల్స్ జన్‌నాయక్ బిరుదును ఇవ్వలేదని, ప్రజలల్లో ఆయనకున్న ప్రేమకు 'జన్‌నాయక్' అనేది ఒక ప్రతిబింబం అన్నారు. గత సంవత్సరం నరేంద్రమోదీ ప్రభుత్వం దివంగత ఒబిసి నాయకుడికి భారతరత్నను ఇచ్చి సత్కరించింది. అక్టోబరు చివరలో లేదా నవంబరు నాటికి ఎన్నికలు జరుగనున్న బిహార్ రాష్ట్రంపై కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రూ.62,000కోట్ల కంటే ఎక్కువ విలువైన యువత కేంద్రీకృత కార్యక్రమాలను కూడా మోదీ ఆవిష్కరించారు. రూ.60,000 కోట్ల పెట్టుబడితో కేంద్ర ప్రాయోజిత పథకం అయిన పిఎంఎస్ఇటియు ని ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ను మోదీ ప్రశంసించారు. బిహార్ రాష్ట్ర అభివృద్ధి కోసం బిహార్ ప్రభుత్వం కొత్త నిర్ణయాలను తీసుకుందన్నారు. గత 20సంవత్సరాలతో పోలిస్తే రాబోయే 5 సంవత్సరాలలో ప్రజలు ఉపాధి పొందుతున్నవారి సంఖ్యను రెట్టింపు చేయాలని బిహార్ ప్రభుత్వం నిర్ణయించింది అన్నారు. బిహార్ యువత రాష్ట్రంలోనే ఉపాధి పొందేలా చూడటమే ఈ ఆలోచనలోని ముఖ్యోద్దేశం అని ఆయన అన్నారు. ప్రతీ తల్లిదండ్రులూ తమ పిల్లలు స్థానికంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటారని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు.అయితే బలవంతపు కారణాలవల్ల లక్షలాది మంది పిల్లలు బిహార్ రాష్ట్రాన్ని వదిలి బనారస్, ఢిల్లీ, ముంబై వంటి ప్రదేశాలకు వలస వెళుతున్నారు. ఆర్‌జెడి పాలనలో బిహార్ రాష్ట్రం ఇలాగే ఉండేదని, వేర్లు కుళ్లిపోయిన చెట్టును పునరుద్ధరించడం చాలా కష్టమని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులన ఆయన ప్రశంసించారు. ఐటిఐలు పారిశ్రామిక విద్యకు కేంద్రం మాత్రమే కాదని, అవి 'ఆత్మనిర్భర్ భారత్' కోసం వర్క్‌షాపులుగా పనిచేస్తున్నాయని మోదీ చెప్పారు. 2014వరకు దేశంలో కేవలం 10,000 ఐటిఐలు మాత్రమే ఉండేవని, కానీ గత దశాబ్ద కాలంగా దాదాపు కొత్తగా 5,000ఐటిఐలను నెలకొల్పడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్ఐటి పాట్నా బిహార్ క్యాంపస్‌ను జాతికి అంకితం చేశారు. బిహార్‌లో పునరుద్ధరించబడిన 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయతా భట్ట యోజన' పథకాన్ని మోదీ ఈ సందర్భంగా ప్రారంభించారు. 5లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఉచిత నైపుణ్య శిక్షణతో రెండు సంవత్సరాలకు నెలకు రూ.1,000చొప్పున నెలవారీ అలవెన్స్ పొందుతారు. అంతేకాకుండా పున:రూపకల్పన చేయబడిన 'బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్'ను కూడా ప్రధాని మోదీ ప్రారంభించారు. వడ్డీలేని విద్యారుణాలు రూ.4లక్షల వరకు ఈ పథకం కింద ఎంపికైన అర్హులకు అందజేయబడతాయి. ఈ సందర్భంగా నరేంద్రమోదీ జన్‌నాయక్ కర్పూరీ ఠాకూర్ స్కిల్ యూనివర్సిటీని కూడా ప్రారంభించారు.ఆ తర్వాత బిహార్ ప్రభుత్వంలో నూతనంగా నియామకం చేయబడిన అభ్యర్థులకు 4,000మందికి పైగా అపాయింట్‌మెంట్ లెటర్స్‌ను ప్రధానమంత్రి పంపిణీ చేశారు.





## కుక్కలే మేలు!



మనిషి తోటి మనిషి కంటే ఎప్పుడు కుక్కలతోనే తన ఆలోచనలు పంచుకుంటాడు. ఇటీవలి శాస్త్ర పరిశోధనల నివేదికను అనుసరించి, మనుషులు కష్టాల్లో ఉన్న చాలా సందర్భాలలో సాటి మనుషుల కంటే కుక్కలతో వాటిని పంచుకుంటాడు. దీనికి కారణం ఏమిటన్న ప్రశ్నకు మనోవిజ్ఞాన నిపుణులు ఇచ్చే సమాధానం మనల్ని ఆలోచింప చేస్తుంది. కుక్కలు సాధారణంగా నిష్కల్మషంగా, నిరపరాధంగా, బలహీనంగా కనిపిస్తాయి. అదే సమయంలో అవి తమ భావోద్వేగాలను స్పష్టంగా వ్యక్తం చేస్తాయి. కన్నీళ్లు కార్చకపోయినా, శరీర భాష, కళ్ళలోని వేదన, తోక కదలిక వంటి సూచనలు మన హృదయాన్ని తాకుతాయి. ఈ లక్షణాలు మనలో సహజసిద్ధమైన రక్షణ, పోషణ, ఆదరాభిమానాల ప్రవృత్తిని ప్రదర్శిస్తాయి. మనోవిజ్ఞాన శాస్త్ర పరిశోధనల్లో నిర్వహించిన అనేక ప్రయోగాల్లో, కష్టాల్లో ఉన్న కుక్కలపై రాసిన కథలకు ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందన, అదే పరిస్థితిలో ఉన్న మనుషుల కథలకంటే మరింత బలంగా, గాఢంగా ఉండిందని తేలింది. కుక్కల పట్ల అపారమైన కరుణ చూపుతూ, వాటిని రక్షించాలన్న తపన వ్యక్తమైంది. జంతువులు మనలో ఒక ప్రత్యేకమైన మానవత్వాన్ని మేల్కొలుపుతాయి. వాటి నిరపరాధత మన హృదయంలోని కరుణ అనే మృదుత్వాన్ని వెలికి తీయగల సామర్థ్యాన్ని కలిగివుందనడం ఏమాత్రం తప్పుకాదు.

## కొత్త పదార్థ దశ 'టైం క్యాసిక్రిస్టల్'!



ఒక కొత్త పదార్థ దశను వాషింగ్టన్ యూనివర్సిటీ, సెయింట్ లూయిస్ పరిశోధక సంస్థ శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనిని క్వాంటమ్ భౌతికశాస్త్రంలోనే ఒక పెద్ద మైలు రాయిగా అభివర్ణిస్తున్నారు. సాధారణ పదార్థాల కదలిక, సమయంపై మనకు తెలిసిన సిద్ధాంతాలు లేదా అంచనాలను ఈ కొత్త ఆవిష్కరణ సవాలు చేస్తున్నది. 'టైం క్యాసిక్రిస్టల్'గా పేర్కొంటున్న ఈ కొత్త దశ సమయాన్ని కొలవటానికి, క్వాంటమ్ సమాచారాన్ని నిల్వ చేయడానికి అనువైన మార్గాన్ని అందిస్తుంది. తక్కువ శక్తితో, సుస్థిరమైన ఫలితాలు సాధ్యమని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఈ 'టైం క్యాసిక్రిస్టల్'ను ఒక మిల్లీ మీటర్ పరిణామం కలిగిన చిన్న వజ్రపు భాగంలో తయారు చేశారు. ఈ అత్యంత సూక్ష్మ నిర్మాణం ద్వారా 'టైం క్యాసిక్రిస్టల్' సూత్రాన్ని అభివృద్ధి చేసే ప్రయత్నంలో ఉన్నారు. 'టైం క్యాసిక్రిస్టల్స్'ను వజ్రాలు, క్వార్ట్జ్ రాళ్లతో పోల్చవచ్చు. ఈ సాంకేతిక విజయం భవిష్యత్తులో శాస్త్రానికి, టెక్నాలజీకి ఒక కొత్త దిశ ఇవ్వగలుగుతుందని చెప్తున్నారు. క్వాంటమ్ ప్రణాళికలు, సమయ నిర్ణయ సిస్టమ్స్ మరింత నిబిడంగా, సమర్థవంతంగా ఉండేందుకు ఈ కొత్త దశ సహకరించే అవకాశం ఉంది. ఈ అన్వేషణ ద్వారా ఇప్పటి వరకూ అనుసరిస్తున్న సమయ, కదలిక పట్ల ఆలోచనలకు కొత్త అర్థం రావచ్చు.

## డ్రోన్ల వర్షం!



చైనాలోని జెంగ్జౌ ప్రాంతంలో డ్రోన్ల వర్షం కురవడంతో, ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. విషయం ఏమిటంటే, జెంగ్జౌ మాల్‌పై డ్రోన్ లైట్ షో జరుగుతుండగా, అకస్మాత్తుగా 200కి పైగా డ్రోన్‌లు నియంత్రణ కోల్పోయి, ఆకాశం నుంచి నేలకు పడిపోయాయి. ఈ ఘటనతో భయపడిన ప్రేక్షకులు తమను తాము కాపాడుకునేందుకు ప్రయత్నించడంతో, కొంత సేపు గందరగోళ పరిస్థితుఉ నెలకొన్నాయి. కాగా కొన్ని డ్రోన్‌లు భవనాలు, వాహనాలపై పడడంతో, స్వల్ప ఆస్తి నష్టం జరిగింది. అక్కడ సుమారు ఐదువేల మంది ఘటనను వీక్షిస్తూ ఉండగా చోటు చేసుకున్న ఈ సంఘటనతో, వారంతా భద్రత కోసం మాల్‌లోకి పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రోన్లు అన్నీ ఒకేసారి నియంత్రణ కోల్పోవడానికి కారణాలపై విచారణ ప్రారంభమైంది. వ్యాపార ప్రచారం తదితర కారణాలతో డ్రోన్ల ప్రదర్శన నిర్వహించడం చైనాలో సామాన్యం. ఈ క్రమంలోనే అనేక ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అందుకే, డ్రోన్ పరిశ్రమలో మరింత కఠినమైన నియంత్రణల అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## ఈ హంస మాకొద్దు..



ఇంగ్లాండ్‌లోని స్ట్రాట్‌ఫోర్డ్‌అపన్ ఏవాన్ నగరంలో అత్యంత అరుదైన బ్లాక్ స్వాన్ (నల్ల రంగు హంస) సందర్శకులను విపరీతంగా ఆకర్షిస్తున్నది. అయినప్పటికీ, అధికారులు దీనిని వద్దంటూ మరో ప్రాంతానికి తరలించారు. 'మిస్టర్ టెర్మినేటర్' అని అభిమానులు పిలుచుకుంటున్న ఈ నల్ల హంస అసలు పేరు 'రెగ్గీ'. ఒక సరస్సులో విహరిస్తూ ఇది అందరినీ ఆకర్షించేది. అయితే, ఈ నల్ల హంసను చూసిన స్థానిక పక్షులు భయంతో గూళ్లను నిర్మించుకోవడం మానుకుంటున్నాయి. ఈ నల్ల హంస కూడా తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి ఇతర పక్షుల పిల్లలపై దాడి చేసేది. వాటి గూళ్లను ఆక్రమించుకునేది. పరిస్థితి రోజురోజుకూ సంక్లిష్టంగా మారడంతో, ఆ హంస పరిరక్షకుడు సిరిల్ బెన్నిస్ దానిని పట్టుకొని, దావ్లిష్ వాటర్‌ఫాల్ సెంటర్ (డెవన్లో)కు తరలించాడు. ఒక అరుదైన హంసను ఈ విధంగా 'మాకు వద్దు' అనడం, దానిని తరలించడం చాలా అరుదు. కాగా, ప్రపంచంలో బ్లాక్ స్వాన్లు ఆస్ట్రేలియాలో ప్రాచుర్యం పొందినా, బ్రిటిష్ నదుల్లో ఇది అరుదైన జాతి. దీని ప్రవర్తన మిగతా బాతు జాతి పక్షులతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. దాడులు చేయడం, క్రూరంగా ప్రవర్తించడం బ్లాక్ స్వాన్స్ అలవాటు. 'మిస్టర్ టెర్మినేటర్' కూడా అవే లక్షణాలను ప్రదర్శించింది. ఫలితంగా ఎక్కువగా పక్షులుగానీ, సందర్శకులుగానీ లేని చోటుకు 'బదిలీ' అయింది.

## మనుషుల కోసం వాషింగ్ మెషీన్!



దుస్తులను ఉతకడానికి వాషింగ్ మెషీన్లను వాడుతున్నాం. అయితే, జపాన్‌లో మనుషుల కోసం 'హ్యూమన్ వాషింగ్ మెషీన్' పేరుతో ఆధునిక శుభ్రతా యంత్రాన్ని అభివృద్ధి చేశారు. ఇది క్యాప్సూల్ ఆకారంలో ఉండి, వ్యక్తిని కేవలం 15 నిమిషాల్లో శుభ్రపరుస్తుంది. అంతేకాదు, మసాజ్ చేస్తుంది... శరీరంపై నీరు లేకుండా తుడుస్తుంది. దీనిలో అల్ట్రాసోనిక్ తరంగాలు, వేడి నీటి జెట్‌లు, ఎయిర్ డ్రైయింగ్ సిస్టమ్‌లు వాడతారు. మొదటగా ఆసుపత్రులు, వృద్ధబాలల సంరక్షణ కోసం తయారు చేసిన ఈ యంత్రం, శుభ్రతను కాపాడుతుంది. ఇది అత్యంత సురక్షితమైనది. ఆరోగ్య పరిరక్షణలోనూ కీలక భూమిక పోషిస్తుంది. ఈ శుభ్రతా యంత్రం వృద్ధులు, స్థిరంగా కదలలేని వ్యక్తులు, ఆసుపత్రిలో ఉన్నవారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. సంరక్షణదారుల పని భారాన్ని తగ్గిస్తుంది. అంతరిక్ష ప్రయాణాలతోపాటు, హోటళ్లు, లగ్జరీ స్పాలు వంటి అరుదైన నీరు వాడే చోట్లలో కూడా ఈ హ్యూమన్ వాషింగ్ మెషీన్ ఉపయోగపడవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రతి వ్యక్తికీ, వారివారి అవసరాలకు అనుగుణంగా తగిన వాష్ సైకిల్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. టెక్నాలజీని నిత్యజీవితంలో వినియోగించడంలో జపాన్‌కు ఉన్న నవీన దృష్టిని ఈ యంత్రం ప్రతిఫలిస్తుంది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# బిహార్ ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రధాని నరేంద్ర మోదీ, తన ప్రతిష్ఠను ఒడ్డుతున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సోమ లేదా మంగళవారం షెడ్యూలు విడుదలకు భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) సన్నాహాలు పూర్తి చేసింది. రాజకీయ పార్టీలు ఇంకనూ ఎన్నికల ప్రణాళికలు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ పాలక ఎన్‌డిఎ కూటమి ప్రధాని ముఖ్యసారథిగా అసంఖ్యాక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు పూర్తి చేసింది. ఇండియా కూటమిలో ప్రధాన భాగస్వాములైన ఆర్‌జెడి, కాంగ్రెస్ మౌఖికంగా ఓటర్లకు అనేక వాగ్దానాలు చేశాయి. 2010 నుంచి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలన్నింటిలో మొత్తం ఓటర్ల సంఖ్యలోనే కాకుండా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలోనూ పురుషులకన్నా మహిళలే 3నుంచి 5శాతం హెచ్చుగా ఉన్నందున రెండు కూటములూ మహిళా ఓటర్లపై ప్రత్యేక దృష్టితో సంక్షేమ కార్యక్రమాలు వాగ్దానం చేస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ లేదా కూటమికి ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు ముందే ప్రభుత్వ ఖజానా నుంచి ధనం పంపిణీ చేసి ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉండే అవకాశాన్ని జెడి(యు), బిజెపిల తదితర పార్టీలతో కూడిన ఎన్‌డిఎ గరిష్ఠంగా ఉపయోగించుకుంది. ప్రధానమంత్రి దాదాపు రెండు నెలలుగా బిహార్‌లోని వివిధ రీజియన్‌లలో దఫాదఫాలు పర్యటిస్తూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు ప్రాంతీయ అసంతృప్తులను సంతృప్తిపరిచే ఎన్నో వాగ్దానాలు చేశారు. అవి నెరవేర్చాలంటే ఎన్‌డిఎకు తిరిగి అధికారం అప్పగించాలన్నది ఆయన ఉపన్యాసాల బాణీ. అంతేనా – ఎన్నికలపై దృష్టితో నితీశ్‌కుమార్ ప్రభుత్వం మూడు మాసాల క్రితం నిర్ణయించిన 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన ' (ఉపాధి పథకం)కింద ప్రధానమంత్రి స్వహస్తాలతో సెప్టెంబర్ 26వ తేదీన 75లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.7500 కోట్లు రాష్ట్ర ఖజానా నుంచి బదిలీ చేశారు. మిగిలిపోయిన 25లక్షల మందికి రూ.2500కోట్లు ముఖ్యమంత్రి దసరా తెల్లారి బదిలీ చేశారు. రూ.10వేల కోట్లు ఉచిత సహాయం ! సంక్షేమ పథకాలు మంచిదే కాని అందుకు ఎంచుకున్న సమయంలోనే ఉంది కుత్సితం. 20ఏళ్లుగా ఏలుబడిసాగిస్తున్న నితీశ్ కుమార్‌కు ఇటువంటి ఆలోచన ఈ ఎన్నికల ముందే రావటం దేనికి సంకేతం? ఇది తమ ప్రభుత్వం పట్ల ప్రజల్లోని వ్యతిరేకతను తటస్థీకరించే ప్రయత్నం తప్ప ప్రజల దుర్భర స్థితిగతుల పట్ల సానుభూతి కాజాలదు. అందునా మహిళా ఓటర్లనే ఆయన ఎంచుకున్నారు. వారిని డబ్బుకు ఓటు అమ్ముకునే బలహీన మనుస్కులుగా భావిస్తున్నారన్న మాట! అయినా గెలుపుపై నమ్మకం కుదిరినట్లులేదు. ప్రధానమంత్రి మోదీజీ విద్యార్థులు, యువకులను ముఖ్యంగా బిహారీయులను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం నాడు ఓ 62వేల కోట్ల రూపాయల పథకాలు ప్రకటించారు. మేము ముందే చెప్పినట్లు ఈ సంక్షేమ ప థకాలు అభిలషణీయమే. కాని ప్రతిపక్షపార్టీలు అటువంటి వాగ్దానాలు చేసినపుడు వాటిని రేవడీ(మిఠాయిలు)లని అపహాస్యం చేసిన ప్రధాన మంత్రి, వాటిని నియంత్రించకపోతే మనదేశ ఆర్థిక వ్యవస్థ శ్రీలంక దారిపడుతుందని ఖండించిన ఆక్షేపించిన వారు లోక్‌సభ ఎన్నిక ల్లో దెబ్బతిన్న తదుపరి అదేబాట పట్టటంలో ఆశ్చర్యంలేదు. జిఎస్‌టి పన్నుల విధానం సా మాన్యులను దోచుకుంటున్నదని ఎప్పటినుం చో విమర్శలున్నా, దాన్ని గట్టిగా సమర్థిస్తూ వచ్చిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు పన్ను రేట్ల ను సవరించటం, పేదలు, మధ్యతరగతులకు ఎంతో మేలుచేసినట్లు దగాకోరు ప్రచారం చే సుకోవటం విడ్డూరంగా లేదూ ! అది రాష్ట్రాల సమష్టి నిర్ణయం అని మరిచిపోకూడదు.బిహార్ ఓటర్ల జాబితాల ప్రక్షాళనను ఎస్ఐఆర్ (ముమ్మర రివిజన్) పేరుతో ఎన్నికల కమిషన్ నాలుగు నెలల క్రితం ఆకస్మికంగా ప్రకటించటంలో బిజెపితో ఇసిఐ కుమ్మక్కును ప్రతిపక్షాలు శంకించాయి. ఎస్‌సి, ఎస్‌టిలు, మైనారిటీలు ఇతర బడుగు బలహీన తరగతుల ఓట్ల తొలగింపు కుట్ర గూర్చి హెచ్చరిస్తూ ఓట్ చోరీ యాత్ర జరిపి ప్రజలను చైతన్య పరిచాయి. రెండో వైపున ఎడిఆర్ వంటి స్వచ్ఛంద సంస్థలు, రాజకీయపార్టీలు సుప్రీంకోర్టులో పోరాటంతో ఇసిఐని డిఫెన్స్‌లో పడేశాయి. అనేక వడపోతల తదుపరి సెప్టెంబర్ 30న ఇసిఐ ఓటర్ల తుది జాబితా ప్రచురించింది. జూన్ 24, 2025న మొత్తం ఓటర్ల సంఖ్య 7,89కోట్లు. ఆగస్టు 1న ప్రకటించిన ముసాయిదా జాబితాలో 65లక్షల పేర్లు తొలగింపుకు గురికాగా, 7.24కోట్లుగా ఇసిఐ నిర్ధారించింది. తుది జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 7.42కోట్లు. కొన్ని రీజియన్స్‌లో ఓటర్లు పెద్ద సంఖ్యలో తగ్గటం, మహిళా ఓటర్లు, ముఖ్యంగా ముస్లిం మహిళా ఓటర్లు గణనీయంగా తగ్గటం స్పష్టంగా కనిపిస్తున్నది. మొత్తం మీద లోగడ 1000మంది పురుష ఓటర్లకు 914మంది స్త్రీలు ఉండగా, తాజా జాబితా ప్రకారం ఆ దామాషా 1000/892కు తగ్గింది. ఏమైనా, ఓటర్ల జాబితా దిద్దుబాటు చర్యలతో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు మొత్తం దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ప్రజాపక్షం
05-10-2025, ఆదివారం

# బలహీనపడుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

## 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' తాజా అంచనా

సాత్యకీ చక్రవర్తి




వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) ముఖ్య ఆర్థికవేత్తల తాజా దృక్కోణం ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలహీన వృద్ధి , వ్యవస్థాగత అంతరాయం కాలంలోకి ప్రవేశిస్తోంది. ఈ నివేదిక సెప్టెంబర్ 24న విడుదలైంది. సర్వే చేసిన ముఖ్య ఆర్థికవేత్తలలో సుమారు 72 శాతం మంది రాబోయే సంవత్సరంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుందని అంచనా వేస్తున్నారు. దీనికి కారణాలు వాణిజ్య అంతరాయం తీవ్రతరం కావడం, పెరుగుతున్న విధాన అనిశ్చితి, వేగంగా సాగుతున్న సాంకేతిక మార్పు. నిరంతర అంతరాయం, పెరుగుతున్న విభజన ద్వారా రూపుదిద్దుకుంటున్న ఒక కొత్త ఆర్థిక వాతావరణం ఆవిర్భావాన్ని ఈ పరిశోధన ఫలితాలు సూచిస్తున్నాయి. ఈ దృక్కోణం తీవ్రమైన ప్రాంతీయ విభజనలను ఎత్తిచూపుతోంది. మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా (మెనా), దక్షిణాసియా, తూర్పు ఆసియా, పసిఫిక్ వంటి వర్ధమాన మార్కెట్ ప్రాంతాలు వృద్ధికి ప్రధాన చోదక శక్తులు, ఆకర్షణీయమైన కేంద్రాలుగా ఉంటాయని అంచనా వేసింది. ఈ ప్రాంతాలలో బలమైన లేదా అత్యంత బలమైన వృద్ధిని ప్రతి ముగ్గురు ముఖ్య ఆర్థిక వేత్తలలో ఒకరు ఆశిస్తున్నారు. చైనాకు సంబంధించిన అంచనా మిశ్రమంగా ఉంది. ఇక్కడ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ మధ్యతరహా వృద్ధి ఉంటుందని ముఖ్య ఆర్థిక వేత్తలలో 56 శాతం మంది అభిప్రాయం పడుతున్నారు. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో వృద్ధి మరింత స్తబ్దుగా ఉంటుందని అంచనా. ఐరోపాలో 40 శాతం మంది ద్రవ్య సడలింపుతో బలహీన వృద్ధి ఉంటుందని (74 శాతం), తక్కువ లేదా మధ్యస్థ ద్రవ్యోల్బణం (88 శాతం)తో బలహీన వృద్ధి ఉంటుందని భావిస్తున్నారు. చాలా మంది ముఖ్య ఆర్థిక వేత్తలు (52 శాతం) అమెరికాలో బలహీనమైన లేదా అత్యంత బలహీనమైన వృద్ధి ఉంటుందని, అధిక ద్రవ్యోల్బణం (59 శాతం) ఉంటుందని, ద్రవ్య విధానం సడలించబడుతోందని (85 శాతం) మంది అంచనా వేస్తున్నారు. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు మరింత భిన్నమైన వృద్ధి మార్గాలలో ఉన్నాయని ముఖ్య ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

రాబోయే మూడు సంవత్సరాలలో ఈ విభజన మరింత పెరుగుతుందని 56 శాతం మంది భావిస్తున్నారు. నేటి అంతరాయాలు ఆవృత్తాలకు సంబంధించినవి కాకుండా వ్యవస్థాగతమైనవి అని ముఖ్య ఆర్థిక వేత్తలు అత్యధికంగా అంగీకరిస్తున్నారు. సహ జ వనరులు , ఇందనం (78 శా తం), సాంకేతికత, ఆవిష్కరణ (75 శాతం), వాణి జ్యం, ప్రపంచ విలువ గొలుసులు (63 శాతం), ప్రపంచ ఆర్థిక సంస్థలలో (63 శాతం) దీర్ఘకాలిక అంతరాయం ఉం టుందని అధికులు అంచనా వేస్తున్నారు. ఇది ఒక ముఖ్యమైన పరివర్తనను సూచిస్తుంది. ప్రపంచ ఆ ర్థిక వ్యవస్థ ఏకాకిగా కుదుపులను తట్టుకోవడానికి ప్రయత్నించడం కంటే నూతన పద్ధతులలో నాయకత్వం, సహకారం, యథాతథ స్థితి రావడం కోసం పాటుపడాలి.

'వాణిజ్యం, సాంకేతికత, వనరులు, సంస్థలలో అంతరాయం ద్వారా నిర్వచించబడిన ఒక కొత్త ఆర్థిక వాతావరణం ఆకృతులు ఇప్పటికే రూపుదిద్దుకుంటున్నాయి,' అని ప్రపంచ ఆర్థిక ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జహిది అన్నారు. 'నేటి కుదుపులను రేపటి యథాతథ స్థితికి వచ్చేందుకు అనుగుణంగా మార్చేందుకు నాయకులు తక్షణమే సహకరించుకునేలా మారాలి'. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థాగత మార్పులు వాణిజ్యం, ద్రవ్య విధానం, రుణాలలో అత్యంత స్పష్టంగా కనిపిస్తున్నాయి. సర్వే చేసిన ముఖ్య ఆర్థికవేత్తలలో సుమారు 70 శాతం మంది ప్రస్తుత వాణిజ్య అంతరాయ స్థాయిని ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాల కంటే 'చాలా ఎక్కువగా' నమోదు చేశారు. నాలుగింట మూడొంతుల మంది వాణిజ్యం, ప్రపంచ విలువ గొలుసులకు అంతరాయం ఇతర రంగాలకు కూడా విస్తరిస్తుందని భావిస్తున్నారు. ఆర్థిక మార్కెట్లు మరియు ద్రవ్య విధానంలో, సర్వే చేసిన ఆర్థికవేత్తలలో 45 శాతం మంది అంతరాయాన్ని ఎక్కువగా లేదా చాలా ఎక్కువగా నమోదు చేశారు, అయితే కేవలం 21 శాతం మంది మాత్రమే ఇది కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. అయినప్పటికీ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో సమీప భవిష్యత్తులో పెద్ద సంక్షోభం అవకాశం లేదని 52 శాతం మంది భావించినప్పటికీ, ఏదైనా కుదుపులు విస్తృత వ్యవస్థాగత ప్రభావాలను కలిగి ఉంటుందని 85 శాతం మంది హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ప్రభుత్వ రుణ స్థాయిలు పెరుగుతున్న నేపథ్యంలో రుణ ఎగుడుదిగుడులు ఒకప్పుడు వర్ధమాన ఆర్థిక వ్యవస్థలతో ముడిపడి ఉన్నప్పటికీ, ఇప్పుడు అవి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో ఎక్కువగా కేంద్రీకృతమవుతున్నాయని సర్వే చేసిన ముఖ్య ఆర్థికవేత్తలు ఎత్తిచూపారు. వచ్చే సంవత్సరంలో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో ప్రమాదాలు పెరుగుతాయని 80 శాతం మంది భావిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో (12 శాతం) పోలిస్తే అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో (41 శాతం) ద్రవ్య ఎగుడుదిగుడులు కూడా వృద్ధి నిరోధకాలలో తరచుగా గుర్తించబడుతున్నాయి.

(ఐపిఎ సర్వీస్)

# రాజకీయ పార్టీలకు రెండు పరీక్షలు



రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

రాష్ట్ర రాజకీయాలలో ఈ వారం కీలకం కానున్నది. రాజకీయ పార్టీలు ఎన్నికల పరీక్షకు నిలవనున్నాయి. ఇప్పటికే గత వారం పంచాయతీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎంఎల్‌ఎ మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఖాళీ అయిన ఆ స్థానానికి ఈ వారంలోనే బిహార్ ఎన్నికలతో పాటు షెడ్యూలు విడుదలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒక రకంగా ఈ రెండు ఎన్నికలు ప్రధాన రాజకీయ పార్టీల తాజా బలాబలాలను సూచించనున్నాయి. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల తరువాత ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు గీటురాయి కానుంది. అధికార కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందా? బిఆర్ఎస్ కోల్పోయిన పునాదిని కూడదీసుకున్నదా? వచ్చేసారి అధికారంలోకి రావాలని కలలుగంటున్న బిజెపి లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు నిలుపుకుంటుందా? అనే ప్రశ్నలపై ఓటరు మహాశయులు తీర్పు చెప్పనున్నారు. ముందుగా జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుంటుందా? అధికార కాంగ్రెస్ రాజధానిలో కంటోన్మెంట్ సీటు దక్కించుకున్న తరువాత నగరంలోని ఇతర ప్రాంతానికి విస్తరించనుందా? కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సొంత లోక్‌సభ నియోజవర్గ పరిధిలో కమలం పార్టీకి ఆదరణ ఉందా? అనేది తేలనుంది. తమ పార్టీ అభ్యర్థిగా గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత పేరును ప్రకటించడం ద్వారా అభ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ అందరికంటే ముందుంది. మూడు సార్లు వరుసగా గెలుపొందిన సిట్టింగ్ ఎంఎల్‌ఎ మరణించిన సానుభూతి తమకు లబ్ధిచేకూర్చుతుందని గులాబీ పార్టీ భావిస్తోంది. ఈ ఎన్నికలు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు నాయకత్వ పటిమకు సవాలుగా మారాయి. మాగంటి గోపీనాథ్ ఆయనకు అత్యంత సన్నిహితుడు కావడంతో పాటు, వారిరువురి కుమారులు మిత్రులు కూడా, అటు పార్టీ పరంగా, వ్యక్తిగత మైత్రి పరంగా కెటిఆర్‌కు ఈ ఎన్నిక ముఖ్యం. మరోవైపు ఇటు కెటిఆర్, అటు మాగంటి కుటుంబంలో అంతర్గత పోరుతో బిఆర్ఎస్ తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటోంది. కెటిఆర్ సోదరి, ఎంఎల్‌సి కవిత తిరుగుబాటు, రెండో వైపు టికెట్ ఆశించిన గోపీనాథ్ సోదరుడికి దక్కకపోవ డం ఆ పార్టీకి తలనొప్పిగా మారాయి. శాసనసభ సాధారణ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నే అత్యధిక స్థానాలు సాధించి బిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కించుకోగలిగింది. అయితే, ఆ ఎన్నికల తరువాత ఇప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానాన్ని ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు కోల్పో యి డీలా పడింది. పార్టీ శ్రేణులలో విశ్వాసం కల్పించాలంటే బిఆర్ఎస్ ఈ ఎన్నికల్లో గెలుపు తీరం చేరాల్సిందే.

ఇక అధికార కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఏర్పడిన తరువాత తనకు కంచుకోటగా ఉన్న హైదరాబాద్‌లో నాయకులు పార్టీ మారడంతో క్రమంగా పట్టుకోల్పోయి మూడవ స్థానంలోకి పడిపోయింది. సాధారణ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండవ స్థానంలో నిలిచింది. ఈసారి ఎలాగైనా జూబ్లీహిల్స్ సీటును తన ఖాతాలో వేసుకొని పట్టు నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలగా ఉన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ తరుపున ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్‌లకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించగా, వారు నియోకవర్గమంతా కలియదిరుగుతూ నాయకులను, కాంగ్రెస్ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకొచ్చారు. అనేక అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ నియోజకవర్గంలో బలం ఉన్న ఎంఐఎం ఈసారి కాంగ్రెస్‌కు మద్దతిచ్చే అవకాశం ఉంది. అభ్యర్థులుగా గతంతో ఎంఐఎం టికెట్‌పై పోటీ చేసి రెండవ స్థానంలో నిలిచిన నవీన్ యాదవ్, జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ రేసులో ముందు ఉన్నారు. ఇక బిజె పి విషయానికి వస్తే, దేశ వ్యాప్తంగా మోదీ హవాలో ఈ నియోజక వర్గంలో పార్లమెం టు ఎన్నికల్లో బిజెపి అధిక్యత సాధించి, కిషన్ రెడ్డి ఎంపిగా ఎన్నికయ్యారు.దీంతో ఈ ఉప ఎన్నిక ఆయనకు, కొత్తగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రా మచంద్రరావుకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. శాసనసభ ఎన్నికల్లో మాత్రం ఈ నియోజకవర్గంలో గతంలో బిజెపికి పెద్దగా ఓట్లు వచ్చిన దాఖలాలు లేవు.

### పంచాయతీ సమరానికి పార్టీలు సిద్ధం

గ్రామీణ తెలంగాణ నాడిని పట్టి ఇచ్చే పంచాయతీ రాజ్ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం జెడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలకు రెండు దశలు, సర్పంచ్ ఎన్నికలకు మూడు దశల్లో ఎన్నికల నిర్వాహణకు షెడ్యూలును జారీ చేసింది. గురువారం నుంచి మొదటి దశ నామినేషన్‌లు ప్రారంభం కానున్నాయి. దీనికి ఒక రోజు ముందే, అంటే అక్టోబర్ 8న ఈ ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయడంపై దాఖలైన పిటిషన్‌లు హైకోర్టు ధర్మాసనం ముందుకు రానున్నాయి. ఒక్కరోజే తేడా ఉండడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌పై కోర్టు స్టే విధిస్తుందా? ఏమి చేస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇదే సమయంలో సుప్రీం కోర్టులో కూడా స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్‌ల పెంపును సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ పిటిషన్‌లపై బహుశా బిసి రిజర్వేషన్‌ల అంశం వరకే పరిమితమై కోర్టు ఆదేశాలు రావొచ్చే తప్ప ఎన్నికల నిర్వహణపై రాకపోవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, రాజకీయ పార్టీలు మాత్రం స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా రిజర్వేషన్‌పై తీర్పు ఎలా ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ ఎన్నికల నిర్వహణ వైపే మొగ్గు చూపిస్తున్నది. ఇప్పటికే సర్పంచ్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యుల పదవీకా లం ముగిసి దాదాపు రెండేళ్ళు కావస్తుండడంతో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిధులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం కారణంగా పెరిగిన ఆర్థిక భారాలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఎన్నికలు నిర్వహిస్తే, పంచాయతీరాజ్ నిధులు చేదోడు వాదోడుగా ఉంటాయి. కాంగ్రెస్ ఇప్పటికే అమలవుతున్న సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గృహ విద్యుత్ తదితర పథకాలు కలిసి వస్తాయని భావిస్తోంది. యూరియా కొరత గ్రామీణ ప్రాంతాలలో ఇబ్బంది కలిగించినప్పటికీ, దానికి కేంద్ర ప్రభుత్వమే కారణమనే విషయం ఇప్పుడిప్పుడే ప్రజలకు చేరుతుంది. అయినప్పటికీ, నాయకుల మధ్య సమన్వయం తీసుకురావడం కాంగ్రెస్ గెలుపునకు ముఖ్యం. శాసనసభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్, సిపిఐలు అవగాహనతో సా గే అవకాశాలు కనపడుతున్నాయి. ఇక బిఆర్ఎ స్.. ప్రభుత్వం ఇతర హామీలు అమలు చేయడం లే దనే అంశంపైనే ఆశలు పెట్టుకుంది. అయినప్పటికీ ఆ పార్టీ పదేళ్ళు వ్యవహరించిన తీరు, అప్రజాస్వామిక ధోరణి కారణంగా ప్రజల విశ్వాసం పొం దడం అంత సులువుగా కనపడడం లేదు. బిజెపి మాత్రం ఇరు పార్టీల పట్ల ప్రజావ్యతిరేకతతో పాటు, ప్రధాని మోదీ ఇమేజిపైనే ఆశలు పెట్టుకున్నది.

## సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం

**ప్రజాపక్షం/అక్కన్నపేట:** లోడి సాంఘీక సేవా సంస్థ వారి నేతృత్వంలో గిరిజన రైతాంగాన్నీ సేంద్రియ సాగు వైపు దృష్టిసారించేలా క్షేత్రస్థాయిలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. గ్రామీణ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంతో పాటు చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయంలో చేయూతనందిస్తూ లోడీ సంస్థ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ మేరకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా పండించే సేద్యం వైపు రైతులను ప్రోత్సహించే దిశగా మానోస్ యూనిదాస్ సహకారంతో లోడీ సంస్థ డైరెక్టర్ ఫాదర్ సింగారెడ్డి ఇన్నారెడ్డి చర్యలు చేపట్టారు. లోడీ సంస్థ ఆర్థిక సహకారంతో అక్కన్నపేట మండల పరిధిలోని గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రోత్సహించేందుకు చేపట్టిన వర్మి కంపోస్టు పిట్స్ నిర్మాణాలను ప్రతినిధుల బృందం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ,సిబ్బంది కనకం రవీందర్, భూక్య బిచ్చా, ముడావత్ తిరుమల, పిల్లి రమేష్, రైతులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి మాజీ ఫిట్ సెక్రటరీకి నివాళులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిడికె 11వ ఇంక్లైన్ మాజీ ఫిట్ సెక్రటరీ అమరజీవి కామ్రేడ్ మోదుల సంపత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం గోదావరిఖని ఉదయ్ నగర్ లో జరిగిన కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నాయకులు పాల్గొని సంపత్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంకా ఈ వర్ధంతి కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు,



నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, నాయిని శంకర్, గొడిశల నరేశ్, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, ప్రభుదాస్, వై.లెనిన్ పాల్గొన్నారు.

## డిజిపిని కలిసిన పెద్దపెల్లి ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రాష్ట్ర నూతన డిజిపిగా నియమితులైన శివధర్ రెడ్డిని పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు హైదరాబాద్ లోని డీజీపీ మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన శివధర్ రెడ్డికి ఎమ్మెల్యే విజయరమణారావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పాలకుర్తి జడ్‌పిటిసి టికెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాంచాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పాలకుర్తి మండల జడ్పీటిసి కాంగ్రెస్ టికెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కు నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్, రాష్ట్ర ముఖ్య సలహాదారు దుర్గం నర్సయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి గోల్లే రాజమల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ శనివారం వినతిపత్రం అందజేశారు. పాలకుర్తి మండలంలో నేతకాని జనాభా అత్యధికంగా ఉందని, మా సామాజిక వర్గానికి చెందిన గోల్లే రాజ్ కుమార్ కు కాంగ్రెస్ జడ్పీటిసి అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నేతకాని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని మండల నాయకులు జాడి తిరుపతి, పాయిడి సత్యనారాయణ, మంచినీళ్ళ లింగయ్య, బౌతు గంగజలం, రావుల శ్రీనివాస్, ముడిమడుగుల చంద్రశేఖర్, ముడిమడుగుల శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల ట్యాక్స్ చెల్లించాలి

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** జిల్లాలో సరుకు, ప్రయాణికులను చేరవేసే వాహనాలకు సంబంధించి 4,419 గల వాహనాల యజమానులు పన్ను చెల్లించాలని జిల్లా ఇంచార్జి రవాణా శాఖ అధికారి వంశీదర్ ఒక ప్రకటనలో సూచించారు. ఆయా వాహనాలు రోడ్డు టాక్స్ కట్టకుండా వినియోగిస్తున్నారని తెలిపారు. సిరిసిల్ల డివిజన్‌కు సంబంధించి 2,787 వాహనాలు, వేములవాడ డివిజన్‌కు సంబంధించి 1,632 వాహనాలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా జిల్లాలో 11,425 వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. సిరిసిల్ల రెవెన్యూ డివిజన్‌లో 6,647, వేములవాడ డివిజన్‌లో 4,778 ఉన్నట్టు రికార్డ్‌లో ఉందని పేర్కొన్నారు. ట్యాక్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని వాహనాల యజమానులు ట్యాక్స్ చెల్లించి ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 6వ తేదీ సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కేసులు బుక్ చేసి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

## భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రపంచమే ఆచరిస్తుంది



**ప్రజాపక్షం/మల్లాపూర్:** ఆచార సాంప్రదాయాలకు పుట్టినిల్లు అటువంటి భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచ నలుమూలాల భారతీయులు చాటి చెప్పారని మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచమే ఆచరిస్తుందని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి గుర్రాల ప్రేమ్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా దేశాన్ని ప్రతి పౌరుడు కాపాడేందుకు ముందు ఉండాలని నిస్వార్థంగా దేశానికి సేవ చేయాలని వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని పిలుపునిచ్చారు. మన ప్రాచీన పురాణాలు, మహాభారత, రామయణాల ద్వారా మన భారతదేశ విశ్వ గురువుగా వర్ధిల్లుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, విష్ణువర్ధన్, రాజు, సత్యం, నవీన్, గణేష్, జనార్దన్, భాస్కర్, మహేష్, వినోద్, జీవన్, రాజు, నందు , మనోహర్ తదితరులు ఉన్నారు

## వాగులో గల్లంతైన వ్యక్తి.. నాలుగు రోజులకు మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/ముత్తారం :** నాలుగు రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు మానేరు వాగులో గల్లంతు అయిన అజ్మీర రాజేందర్ (55) మృతదేహం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం కాల్వపల్లి ఇసుక రీచ్ మోరంచ వద్ద శనివారం లభ్యమయింది. ఈనెల 1వ తేదీన గిద్దె ముత్తారం నుండి ఓడేడు గ్రామం వైపు మానేరు దాటుతూ వస్తుండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాగులో గల్లంతయినట్టు స్థానికులు తెలిపారు. అయితే రాజేందర్ కుటుంబ సభ్యులు ముత్తారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు, ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన ఆచూకీ లభించలేదు.నాలుగవ రోజుకుటుంబ సభ్యులు శనివారం ఉదయం నుండి మానేరు వాగు వరద ఉధృతత తగ్గడంతో కాల్వపల్లి వైపు వెళ్లి వెతకగా కాల్వపల్లి గ్రామ శివారులోని ఇసుక రిచ్ వద్ద శవమై కనిపించాడు. వెంటనే ఈ సమాచారాన్ని పోలీసులకు తెలుపగా సంఘటన స్థలానికి వచ్చి పోలీసులుమృతదేహాన్ని వాగులో నుంచి బయటకు తీశారు. రాజేందర్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

# మత్తు పదార్థాల అనర్థాలపై విస్తృత ప్రచారం

### కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్:** నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరు వరకు విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తూ మత్తు పధార్థాల అనర్దాలపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తైన సంధర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో నిర్వహించాల్సిన వివిధ కార్యక్రమాల్లో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆద్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యువత, విధ్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అక్టోబర్ నెలాఖరు వరకు జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, డ్రగ్స్ వల్ల కలిగే అనర్దాలను వివరించాలని అన్నారు. పోలీస్, ఎక్సైస్, డిఆర్డీవో, మెప్మా, విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, తదితర శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ఈ అవగాహన కార్యక్రమాల్లో బాగస్వాములను చేయాలని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, మెడికల్ కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మాదకద్రవ్య వ్యతిరేక సందేశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అన్నారు. మాదక ద్రవ్య రహిత భారత్ గురించి యువతకు వివరించేలా డ్రాయింగ్ కాంపిటీషన్ ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద ఎత్తున మారథాన్ నిర్వహించి మాదకద్రవ్యాల అనర్ధాలపై ప్రజలకు సందేశం ఇవ్వాలని సూచించారు. సామూహిక ప్రతిజ్ఞ చేయించాలని, ప్రతిజ్ఞను సూచించే ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్‌ను జనసందోహం ఉన్న చోట ప్రదర్శించాలని సూచించారు. అనంతరం నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అడిషనల్ కలెక్టర్ తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ రాంబాబు, నాకార్ధ విభాగం సిఐ పుల్లయ్య, డిసిపివో ఫర్వీన్, సిడిపివో సబిత, విద్యాశాఖ కోఆర్డినేటర్ ఆంజనేయులు, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ సంపత్, ఎస్సై పాషా, నషా ముక్త్ భారత్ కమిటీ మెంబర్లు కేశవరెడ్డి, రాజేందర్‌లు పాల్గొన్నారు.




## గని ప్రమాదాల్లో గాయపడ్డ కార్మికులను పరామర్శించిన సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి లో వివిధ ప్రాంతాల్లో జరిగిన గని ప్రమాదాల్లో గాయపడి హైదరాబాద్ కార్పోరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను శనివారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పరామర్శించారు, సింగరేణి మందమర్రి ఏరియా కు చెందిన జె రవీందర్, ఆర్జీ టూ ఏరియా లోని ఓసిపి3 మైన్ లో షావల్ ఆపరేటర్ ఎ. లక్ష్మీ నారాయణ, భూపాలపల్లి ఏరియాలో కేటికే 6వ ఇంక్లైన్ లో గూడెల్లి మొండయ్య లు గని ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వీరిని ఆయన పరామర్శించారు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి యూనియన్ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. కాగా సీతారామయ్య వెంట డాక్టర్ బాల కోటయ్య ఉన్నారు.

## జిఎంను సన్మానించిన ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఎస్ ఓ టూ జి.ఎం గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన చెంద్రశేఖర్ ను శనివారం ఆర్జీ వన్ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నాయకులు పూలబోకే అందించి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, నాయకులు రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి, ఎం చక్రపాణి, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, దాసరి శ్రీనివాస్, బండి మల్లేష్, ఇజ్జగిరి రాజు, రెడ్డి వెంకట స్వామి, ఎం.రవి కుమార్ , ఏవిఎస్ ప్రకాశ్, రంజిత్, ఎర్రగొల్ల చేరాలు తదితరులు ఉన్నారు.

## సిద్దిపేట జిల్లా పరిషత్‌పై కాంగ్రెస్ జెండా ఎగరాలి

### మంత్రి వివేక్ వెంకటస్వామి


**ప్రజాపక్షం/సిద్దిపేట :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకట స్వామి అన్నారు. సిద్దిపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్.శివప్ప మంత్రి వివేక్‌వెంకటస్వామిని మర్యాద పూర్వకంగా కలసి,దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ సిద్దిపేట నియోజక వర్గం కాగ్రెస్ పార్టీకి కంచుకోట అని పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు అందరు సమిష్టిగా గ్రూపులకు అతీతంగా కృషిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా పరిషత్‌పై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలన్నారు. అలాగే ఎంపిటిసి,సర్పంచ్ ఎన్నికలో సైతం మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికి వివరించాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీ పథకాలు, రైతులకు రుణమాఫీ. రైతు బంధు, ఉచిత రేషన్‌కార్డుల పంపిణి ప్రజలకు వివరించారు. అలాగే మహిళలకు ఉచిత ఆర్టీసి ప్రయాణం, ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే ఉచిత గ్యాస్ తదితర పథకాలు ప్రజలకు పూర్తిగా వివరించి కాంగ్రెస్‌కు మద్దతు పలకాలన్నరు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ సర్కార్ ప్రజల సొమ్మును దుర్వినియోగ పర్చారన్నారు. మిగుల బడ్జెట్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ కెసిఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కంకణ బద్దులై పనిచేస్తున్నారన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం బిఆర్ఎస్ తన ఉనికి కాపాడుకునేందుకు కాంగ్రెస్ పై తప్పుడు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. బిఆర్ఎస్‌ను నమ్మె స్థితిలో ప్రజలు లేరన్నారు. రోజురోజుకు ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆధరణ పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కృషిచేసి సిద్దిపేటలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని మంత్రి వివేక్‌వెంకటస్వామి సూచించారు. ఈసమావేశంలో ఎంపి సురేష్ షెట్కార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శివప్ప తదితరులు పాల్గొన్నారు.



## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ కె. హైమవతి

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా పాలనాధికారి శనివారం హుస్నాబాద్ మండలం, అక్కన్నపేట మండలంలోని అకస్మిక పర్యటనలు చేసి మీర్జాపూర్ ప్రాధమిక అరోగ్య కేంద్రంలో ఏలాంటి సెలవులు పెట్టకుండ విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన వైద్యసిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లెల గడ్డ వద్దగల ఎస్ ఎస్ టి శిబిరాన్ని సందర్శించి వాహనాల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాలో పరిశీలించి రిజిష్టర్‌ను తనిఖీచేశారు. రాష్ట్రంలో అతి త్వరలో నిర్వహించనున్న నేపాధ్యంలో ఎన్నికలు ముగిసే వరకు 24/7 ప్రతి రోజు వాహనాలను తనిఖీ చేస్తు విడియోలు తీయాలని అదేశించారు. అలాగే మీర్జాపూర్‌లోని అరోగ్యకేంద్రంను తనిఖీ చేయగా ఒక్క నర్సు తప్ప ఎవ్వరు లేక పోవడంతో తీవ్రస్థాయిలో సిబ్బని మందలిస్తు ఈ లాంటి సంఘటనలు మళ్లి పునరావృతం అయితే తీవ్రపరినామాలు ఉంటాయని హెచ్చరిస్తు వెంటనే జిల్లా వైద్యాధికారికి తగు చర్యలకు అదేశించారు. అలాగే అక్కన్నపేట మండలం లోని కుందనవాణి పల్లిలో గల ప్రసిద్ద రైతుల ఉత్పత్తిదారుల సంస్థలను పరిశీలించారు. వారి వ్యాపారలావాదేవీల గూర్చి వివరాలను డైరెక్టరు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్బంగా సంస్థ డైరెక్టర్ స్వామిరెడ్డిని కలెక్టర్ అభినందించారు. అలాగే అక్కన్నపేట అరోగ్య కేంద్రంను సందర్శించారు.వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సిజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాని అలాగే అరోగ్యకేంద్రంలో శుభ్రతలు పాటించాలని అదేశించారు. కలెక్టర్ వెంట వైద్యసిబ్బంది స్థానిక అధికారులు పాల్గోన్నారు.



## నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తొద్దు

### మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** మంచినీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. పెండింగ్ అభివృద్ధి పనులతో పాటు కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పోరేషన్ లిమిటెడ్ పెండింగ్ అభివృద్ధి పనులు, మంచినీటి సరఫరా తదితర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. స్మార్ట్‌సిటీ కార్పోరేషన్ లిమిటెడ్‌లో చేపట్టిన పెండింగ్ అబివృద్ది పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగర వ్యాప్తంగా వివిధ గ్రాంట్ల నిధులతో పనులు ప్రారంభం చేసి పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ది పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు జరిగే చోట ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. చేపట్టిన అభివృద్ధి పనులన్నీ టైమ్ లైన్ ప్రకారం,టెండర్ అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగర వ్యాప్తంగా త్రాగునీటి సరఫరాలో ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నార. సమయం ప్రకారం ప్రతి రోజు ప్రజలకు త్రాగు నీటి సరఫరా చేయాలని, సరఫరా సమయంలో ఇంజనీరింగ్ అధికారులతో పాటు లైన్‌మెన్ ఫిట్టర్లు పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. లీకేజీలను వెంటనే అరికట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటి సరఫరా పైపులైన్ వాల్స్ మరమ్మత్తులు ఉంటే వెంటనే చేపట్టాలని, ప్రజలకు ప్రెషర్‌తో కూడిన నీరు సరఫరా జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈలు సంజీవ్ కుమార్, యాదగిరి, డీఈ ఓం ప్రకాష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఏఈలు తదితరులున్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులతో కలిసి నిర్మాణ పనులకు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్, శ్రీపాద కాలనీలో శనివారం ఐ ఎన్ టి యు సి జాతీయ కార్యదర్శి పేరవేణ లింగయ్య యాదవ్ తోపాటు ఎస్సీ సెల్ మంత్రి డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చైతన్య,ప్రభాకర్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సదానందం, నితీష్, బూడిద రంజిత్, కిష్టయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ అన్నారు.స్వచ్ఛత హీ సేవ 2025 26 కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున పెద్దపల్లి పట్టణం లోని మినీ ట్యాంక్ బండ్ పై ప్లాస్టిక్ మరియు చెరువులోని బతుకమ్మలు వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది తో కలిసి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు ఈరోజు మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు మరియు సిబ్బంది తో కలిసి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, పెద్దపల్లి పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మీ వద్దకు వచ్చే మున్సిపల్ ఆటో రిక్షాలకు మీ ఇండ్లలో వెళ్లే తడి పొడి చెత్తను వేరుచేసి మా సానిటేషన్ సిబ్బందికి అందించి స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చిదిద్దడానికి మీ వంతు సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లింగయ్య, రెవిన్యూ ఆఫీసర్ మనోహర్,వార్డ్ ఆఫీసర్లు,బిల్ కలెక్టర్లు సానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** తాను మరణించినా తన కండ్లు మరొక ఇద్దరికి చూపును ఇవ్వాలని ఆమె కోరిక మేరకు ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన యాద సరస్వతి ఆదర్శప్రాయురాలు అని సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి అభినందించారు. శుక్రవారం సాయంత్రం సరస్వతి (45) గుండెపోటుతో మృతి చెందారు. సరస్వతి మృతి విషయాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్న మచ్చగిరి నరహరి జిల్లా సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు నేత్రదానంపై వారి కుటుంబ సభ్యులకు శనివారం అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్‌వి ప్రసాద్ టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైద్రాబాదు ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపారు. ఇద్దరు అందులకు చూపును ప్రసాదించిన భర్త యాద వీరన్న, కుటుంబ సభ్యులను అభినందించి ప్రశంసా పత్రం అందించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డా.బీష్మాచారి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, లగిశెట్టి చంద్రమౌళిలు పాల్గొని బంధుమిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.



## కడెం ప్రాజెక్ట్ గేట్ల నుంచి నీటి విడుదల



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :కడెం ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున,ప్రాజెక్టు వరద గేట్ల నుంచి నీటిని ఏ క్షణంలోనైనా విడుదల చేయడం జరుగుతుందని కడెం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.కడెం ప్రాజెక్టు పర్తిస్థాయిలో నిండిపోవడంతో శనివారం నీటిని దిగువకు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు.పశువులు గాని గొర్రెలు,మేకల కాపలాదారులు,రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



ప్రజాపక్షం / దండేపల్లి :గత ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడాన్ని నిరసిస్తూ దండేపల్లి మ ధ్యాహ్న భోజన కార్మికులు భోజనాన్ని బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మండల విద్యాధికారి మంత్రి రా జు కు బిల్లులు వెంటనే ఇప్పించాలని కోరుతూ వి నతిపత్రం అందించారు. గత ఆరు నెలలుగా బి ల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమ ంలో శ్రీదేవి, మల్లీశ్వరి, రమాదేవి, రాజేశ్వరి, శంకరమ్మ, లక్ష్మి, జమున, పుష్పలత, మదునమ్మపుష్పల, అంజు బాయి పాల్గొన్నారు.

## కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలి : ఐఎఫ్‌టియు




ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర సదస్సు పిలుపు మేరకు ఈనె ల 6న జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయాలని పిలుపునివ్వగా జయప్రదం చేయాలని అధ్యక్షులు దాసు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈనెల 4న పడిగెల్ గ్రామంలో సాకలి ఐలమ్మ విగ్రహం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలను పెంచి పర్మినెంట్ చేయాలని కోరారు. సుప్రీంకోర్టు 2016 అక్టోబర్ 26న సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పునిచ్చిన మోడీ ప్రభుత్వం ఆదేశంగా భావించి దేశంలో అమలుకు పూనుకోవాలన్నారు. 6న జరిగే కార్యక్రమాన్ని జీపీ మున్సిపల్ వర్కర్స్ పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా దాసు పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మ ణ్, పోశన్న, లింగన్న, బాబన్న, రాజు, గంగాముత్తెవ్వలు పాల్గొన్నారు.

## నవోదయ 9, 11 తరగతుల దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాపక్షం/మంచిర్యాల రూరల్ :పిఎం శ్రీ నవోదయ విద్యాలయం 202627 విద్యా సంవత్సరానికి 9వ, 11వ తరగతుల ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ప్రిన్సిపల్ రేపాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీకి దరఖాస్తులను కోరుతున్నట్లు పేర్కొన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతి ప్రవేశానికి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతి ప్రవేశానికి అర్హులని, విద్యార్థులు 9వ తరగతి కొరకు https://cbseitms.nic.in/2025/nvsix_9 లో, 11వ తరగతి కొరకు https://cbseitms.nic.in/2025/nvsxi_11 వెబ్‌సైట్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 7, 2025 చివరి తేదీ కాగా, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 7, 2026 న జరుగుతుందని తెలిపారు. అర్హులైన ఆసక్తిగల విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పంచాయతీ ఎన్నికలకు పారదర్శకంగా ఏర్పాట్లు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/ బెల్లంపల్లి :సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో పారదర్శకమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం ఆయన డిసిపి ఎ.భాస్కర్‌తో కలిసి బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ), బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని (కోడ్ ఆఫ్ కండక్ట్) తూ.చ. తప్పకుండా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా చూడాలన్నారు. జిల్లాలో 16 జెడ్‌పిటిసి, 129 ఎంపిటిసి స్థానాలకు 2 విడతలలో, 306 సర్పంచ్, 2,680 వార్డు సభ్యుల స్థానాలకు 3 విడతలలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. నామినేషన్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయి, ఫలితాలు వెలువడే వరకు నియమావళి అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమావళి అమలు కోసం మండల స్థాయిలో తహసిల్దార్లను నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సిఇఆర్ క్లబ్‌లో 'ఖాదీ మేళా' ప్రారంభం



ప్రజాపక్షం/ మందమర్రి :దీపావళి పండుగ సందర్భంగా మందమర్రిలోని సిఇఆర్ క్లబ్‌లో ఖాదీ మేళాను ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్ పటేల్ శనివారం ప్రారంభించారు. వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మేళా అక్టోబర్ 4 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సింగరేణి ఉద్యోగులకు ప్రత్యేక సౌకర్యాన్ని కల్పిస్తూ, రూ.20,000 వేల వరకు ఖాదీ వస్త్రాలను క్రెడిట్ పద్ధతిలో కొనుగోలు చేసే అవకాశం ఉందని, ఈ మొత్తాన్ని ఉద్యోగుల జీతం నుంచి ఐదు కిస్తులలో చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. ఖాదీ వస్త్రాలపై 30 శాతం, ఖాదీ పోలి వస్త్రాలపై 30 శాతం, పొందూర్ ఖాదీ వస్త్రాలపై 20 శాతం, కోసా సిల్కు, ఉలన్ వస్త్రాల పై 20 శాతం చొప్పున ప్రత్యేక రాయితీలు అందిస్తున్నారు. ఈ మేళాలో అన్ని రకాల ఖాదీ వస్త్రాలతో పాటు టవల్స్, చెద్దర్లు, కలంకారీ, బెడ్ షీట్లు, లుంగీలు, స్టార్ కార్పెట్స్, సిల్క్ షర్టింగ్, టస్సర్, పాలిస్టర్ ఖాదీ అందుబాటులో ఉన్నాయి. స్వచ్ఛమైన తేనె, కుటీర్ సోప్స్, అగరవత్తులు, జీవశక్తి టానిక్, స్టేవియా పౌడర్ వంటి గ్రామోద్యోగ ఉత్పత్తులు కూడా లభిస్తాయి. చేతి వృత్తి కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు అండ్ సిఇఆర్ క్లబ్ సెక్రటరీ బానయ్య, ఆర్. చంద్రమౌళి (వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ మేనేజర్), కె. సంపత్ (ఇన్‌చార్జ్), కె. సురేందర్ రెడ్డి (సహవాక్), రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణా తరగతుల్లో కలెక్టర్**




ప్రజాపక్షం/నిజామాబాద్ :ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసిఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ఏజెంట్ల నియామకం, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై మాస్టర్ ట్రేనర్లచే అవగాహన కల్పించి మాట్లాడారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావు లేకుండా నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా, పూర్తి పారదర్శకంగా నిర్వర్తించాలని హితవు పలికారు. నామినేషన్లను నిబంధనలకనుగుణంగా సరైన పద్ధతిలో సమర్పించేలా అభ్యర్థులకు సహకారమందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆర్ఓ, ఎఆర్ఓల సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా జెడ్‌పి సిఇఒ కార్యాలయంలో కూడా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో విత్‌డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే అవి తగిన ఆధారాలుగా ఉపయోగపడుతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకనుగుణంగా పక్కాగా జరిగితే పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశముంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్ఓ, సహాయ ఆర్ఓలకు మార్గనిర్దేశం చేశారు కలెక్టర్, ఎన్నికలనిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏమాత్రం సంకోచించకుండా పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఏ శలోనూ స్వంత నిర్ణయాలు తీసుకోకుండా రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సాఫీగా పూర్తి చేయాలన్నారు. శిక్షణ అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్‌పి సిఇఒ సాయగౌడ్, డిప్యూటీ సిఇఒ సాయన్న, డిఇఒ అశోక్, హౌసింగ్‌పిడి పవన్‌కుమార్, ఆర్ఓలు, సహాయ ఆర్ఓలు పాల్గొన్నారు.

## భవిష్యత్తంతా... బడుగులు, బహుజనులదే

### బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీల ఐక్యత అవసరం * జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్



ప్రజాపక్షం/గజ్వేల్:రాబోవు కాలమంతా బడుగులు, బహుజనులదే రాజ్యమని, అలాగే రాష్ట్రంలో బిసి ఎస్‌సి ఎస్‌టి మైనార్టీల ఐక్యత ఎంతో అవసరమని రాష్ట్ర జాగృతి ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం పొందిన అనంతరం కల్వకుంట్ల కవితను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బిసిల్లో ఐక్యత లోపించిన కారణంగానే రాజ్యాధికారానికి దూరం అవుతుండగా, వారిని చైతన్యం చేస్తూ సంఘటిత పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు సత్తా చాటాలని, ఇందుకు జాగృతి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా బిసిలకు 42 శాంత రిజర్వేషన్ దక్కుతుండడాన్ని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతుండగా, అన్ని పార్టీల్లోని బడుగు బలహీన వర్గాలు అధిష్టానాలను ఒప్పించేందుకు కృషి కోరారు. అయితే కామారెడ్డి డిక్లరేషన్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, కోర్టులో అడ్డుకోవాలని చూస్తున్న వారికి తగిన రీతిలో జవాబు చెప్పాలని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలవుతుండగా, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా కొన్ని పార్టీలు వ్యవహరిస్తూ తమ అనుచరులను కోర్టులో కేసులు వేయించినట్లు గుర్తు చేశారు. కాగా తమకు న్యాయస్థానాలపై పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతిని పటిష్టం చేసి సత్తా చాటుతామని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాటం చేస్తున్న కవితకు అన్ని వర్గాల నుండి సంపూర్ణ మద్దతు వస్తుండగా, రాష్ట్రంలో జాగృతి, కాంగ్రెస్, బిజెపి మినహా ఇతర పార్టీలు అంతర్ధానం అవుతాయని వివరించారు.

## పంచాయతీ ఎన్నికల కోసం సహాయక కేంద్రం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజాపక్షం/ నస్పూర్:మంచిర్యాల జిల్లాలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రత్యేక సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ (ఎంపిపి), జిల్లా ప్రజా పరిషత్ (జడ్‌పి) ఎన్నికల దృష్ట్యా ప్రజలకు సమాచారం అందించడానికి, ఫిర్యాదులు స్వీకరించడానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ సహా ఇతర ఎన్నికల సంబంధిత వివరాలు, ఫిర్యాదుల కొరకు హెల్ప్‌లైన్ నెంబరు 08736 250501 ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సహాయక కేంద్రం సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రవర్తన నియమావళి (కోడ్ ఆఫ్ కండక్ట్) అమలులో ఉందని, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారాన్ని కూడా ఈ నెంబరుకు అందించవచ్చని ఆయన సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి

### అధికారులకు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/నిజామాబాద్ :జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం జియలాల కేంద్రంలోని దుబ్బలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పునాది దశ వరకు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను కలిసి వారికి మొదటి విడత బిల్లు మంజూరు అయ్యిందా అని ఆరా తీశారు. ఇంకనూ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్దిదారులతో బేటీ అయి పనులు ఎందుకు ప్రారంభించలేదని కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక మంజూరీ ప్రక్రియలలో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. ఆయా దశల ఇళ్ల నిర్మాణాలకనుగుణంగా లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తాను తదుపరి తనిఖీలు జరిపే సమయానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అంకితభావంతో కృషి చేయాలన్నారు. అలసత్వానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**అభయహస్తం కాలనీ సందర్శన :**దుబ్బలోని అభయహస్తం కాలనీని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శనివారం సందర్శించారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిని పరిశీలించిన కలెక్టర్, జాయింట్ సర్వే జరిపి హద్దులను నిర్ధారించాలని రెవెన్యూ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, హౌసింగ్ పీడీ పవన్‌కుమార్, డీఈ నివర్తి, మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి రమేష్, నార్త్ తహసీల్దార్ విజయ్‌కాంత్ ఉన్నారు.

## ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకులు

### రక్షించిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



ప్రజాపక్షం/పాపన్నపేట:- మంజీరా నది ప్రవాహంలో కొట్టుకుపోయిన ఇద్దరు యువకులను పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరా లు హైదరాబాద్ కూకట్‌పల్లికి చెంది న 20 మంది యువకులు అమ్మవారి విగ్రహాన్ని ని మజ్జనం చేసేందుకు శనివారం ఏడుపాయలకు వ చ్చారు. ఆల యం సమీపంలో ఉన్న చెక్ డ్యాం అ వతలి వైపు విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అనంతరం స్నానం చేసేందుకు వినయ్, సాయి అనే ఇ ద్దరు నదిలోకి దిగారు.ఈ క్రమంలో వినయ్ అనే యువకుడు కాలు జారి నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా మరో యువకుడు సాయి కాపాడేం దుకు ముందుకు వెళ్లగా ఇద్దరు సైతం ప్రవాహం లో కొంత దూరం కొట్టుకుపోయి నీటి మధ్యలో ఉ న్న చెట్లను పట్టుకొని ఆగారు. అక్కడ బిక్కు బిక్కు మంటూ ఉండగా తోటి స్నేహితులు, స్థానికులు గ మనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పాపన్నపేట ఎస్ఐశ్రీనివాస్ గౌడ్ క్యూఆర్టీ, పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించగాడిఎస్‌పి ప్రసన్నకుమార్, రూరల్ సిఐ జార్జి, అగ్నిమాపక కేంద్రం అధికారి వెంకటేష్ సి బ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఫైర్, పోలీసు సి బ్బంది తాడు సాయంతో నదిలోకి దిగి ఇద్దరిని ఒ డ్డుకు తీసుకు వచ్చారు. సంబంధీకులకు అప్పగించారు. ఈ సందర్భంగా యువకుల ప్రాణాలు కా పాడిన అగ్నిమాపక, పోలీసు సిబ్బందిని తోటి స్నే హితులు, స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా మెదక్ డిఎస్‌పిప్రసన్నకుమార్ మాట్లాడుతూ, నీటి ప్రవాహాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనాలకు కోసం వచ్చే వారు నది ప్రవాహం వైపు వెళ్లొద్దని సూచించారు. పోలీసు అధికారులసూచనలుపాటించాలన్నారు.పోలీ సు, క్యూఆర్‌టి టీమ్, అగ్నిమాపక సిబ్బంది,ఉన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాన్ని ప్రతిబింబించేది బతుకమ్మ పండుగ







### మాజీ జెడ్‌పి వైస్‌చైర్మన్ రజిత యాదవ్

ప్రజాపక్షం/ఎడపల్లి:తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా బతుకమ్మ పండగ ఉందని, ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకుంటున్నారని, ఎడపల్లి మండల కేంద్రంలో బతుకమ్మ పండుగను ప్రత్యేకంగా మహిళలందరూ కలిసి స్థానిక దేశ్‌ముఖ్ గడిలో గల హనుమాన్ టెంపుల్ వద్ద శనివారం సంబరంగా నిర్వహించారని మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ రజిత యాదవ్, మాజీ సర్పంచ్ ఆకుల మాధవి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దసరా పండుగకు ముందు బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు. కానీ నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో మాత్రం అలా జరపుకోరు. దసరా అనంతరం ఐదు రోజులకు అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. 66ఏండ్లకు పైగా వస్తున్న ఆచారాన్ని నేటికి కొనసాగిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ప్రతిఏటా దసరా తరువాత పౌర్ణమికి ముందు ఇక్కడ భిన్నంగా బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. ఇంటి కోడళ్లు, ఆడపడుచులు కలిసి పెద్ద ఎత్తున సుమారు రెండు వేలకు పైచిలుకు బతుకమ్మలను పేర్చి ఆడారు. పెద్ద పెద్ద బతుకమ్మలతో మగవారు సైతం పాల్గొని బతుకమ్మలను నిమజ్జానికి తీసుకెళ్లారు. ఈ మేరకు బతుకమ్మ సంబరాల్లో మాజీ జడ్పీ వైస్ ఛైర్ పర్సన్ రజిత యాదవ్, స్థానిక మాజీ సర్పంచ్ ఆకుల మాధవి, స్థానిక మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ రజిత యాదవ్, సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్ తో పాటు పలువురు మహిళలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని వి ధంగా ఎడపల్లిలో ప్రత్యేకంగా దసరా తరువాత బతుకమ్మ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ఈ ప్రత్యేక పండుగకు పుట్టింటి, మెట్టినింటి ఆడపడుచులు, బంధువులు, యువతులు పాల్గొనడం విశేషమన్నారు. అనంతరం బతుకమ్మలను వారు స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్ఐ ముత్యాల రమ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, మహిళలు, యువతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బిజెపికి బిగ్ షాక్



కాంగ్రెస్‌లో బిజెపి ఎంపిటిసి అభ్యర్థి చేరిక..

ప్రజాపక్షం/ముథోల్:స్థానిక సంస్థల ఎన్నికల ముందు బిజెపికి బిగ్ షాక్ తగిలింది.మండలంలోని అష్ట గ్రామం నుండి బిజెపి కార్యకర్త ఎంపిటిసి అభ్యర్థి అప్పన్న మురళి సూమారు వందమంది కార్యకర్తలతో ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు సమక్షంలో శనివారం బిజెపిని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు.పార్టీలో చేరిన వారిని మాజీ ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు.ఇలా స్థానిక సమరం ముందు ఒక పార్టీ కార్యకర్తలు,ముఖ్య నాయకులు ఇతర పార్టీల్లో చేరడం పార్టీలకు ఎదురు దెబ్బే.రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయంలో అభివృద్ధి,సంక్షేమ పథకాల ఆకర్షితులై అష్టా గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకులైన రావుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరినట్లు పేర్కొన్నారు.రానున్న రోజుల్లో గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగువ వేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు సురుగుల శ్రీనివాస్ మెట్టు గంగాధర్,ఇందూర్ ముత్యం,కొంత రాజేశ్వర,అనిల్,బాలగారి ముత్యం సురుగుల కోటయ్య మోహన్,బుండాజి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



# మ్యాచ్ రద్దు!

## వరల్డ్ కప్‌ను వెంటాడుతున్న వరుణుడు..

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో బోణీ కొట్టాలనుకున్న శ్రీలంక ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరగాల్సిన మ్యాచ్‌కు టాస్ ముందు నుంచి వాన కురుస్తూనే ఉండడంతో ఆట రద్దయ్యింది. దాంతో.. ఆసీస్‌కు చెక్ పెట్టి పాయింట్ల ఖాతా తెరవాలనుకున్న చమరి ఆటపట్టు నేతృత్వంలోని లంక టీమ్ తీవ్ర నిరాశలో కూరుకుపోయింది. వరల్డ్ కప్ లీగ్ దశలో 5వ మ్యాచ్ కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరగాల్సింది. మధ్యాహ్నానికి ఇరుజట్ల ప్లేయర్లు స్టేడియానికి చేరుకున్నారు కూడా. కానీ, టాస్ వేద్దామనుకునే సమయానికి వాన మొదలైంది. కాసేపటికే తెరిపినిచ్చినా మళ్లీ జోరుగా వర్షం పడింది. దాంతో.. వాన తగ్గితే బాగుండు అని నాలుగ్గంటలపైగా శ్రీలంక, ఆసీస్ క్రికెటర్లు, అంపైర్లు ఎదురుచూశారు. అయినా సరే వరుణుడు శాంతించకపోవడంతో రద్దుకే మొగ్గుచూపారు. మామూలుగా అయితే.. మ్యాచ్ నిర్వహించాలా? వద్దా? అనేది నిర్ణయించేందుకు కటాఫ్ సమయం రాత్రి 8:08 గంటలు. కానీ, సాయంత్రం ఆరు గంటలు కావొస్తున్నా వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు కెప్టెన్లు ఆటపట్టు, అలీసా హేలీతో మాట్లాడి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

**ఆస్ట్రేలియా అగ్రస్థానంలో..** వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడంతో ఆసీస్, లంకకు చెరొక పాయింట్ మాత్రమే దక్కనుంది. తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను 89 పరుగులతో ఓడించిన కంగారూ టీమ్‌కు మూడు పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. శ్రీలంక జట్టు మాత్రం ఒకేఒక పాయింట్‌తో ఐదో స్థానంలో నిలిచింది. ఇంగ్లాండ్ బంగ్లాదేశ్, భారత్ వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నాయి. అయితే.. నేడు (అక్టోబర్ 5 ఆదివారం) ఇదే ప్రేమదాస స్టేడియంలో టీమిండియా, పాకిస్థాన్ తలపడనున్నాయి. ఒకవేళ శనివారం మాదిరిగానే వర్షం పడితే దాయాదుల మ్యాచ్ కొనసాగుతుందా? లేదా? అని అభిమానుల్లో ఆందోళన నెలకొంది.

# భారత్ ఘన విజయం

## ఫస్ట్ టెస్టులో విండీస్ విలవిల..



అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఘన విజయం సాధించింది. ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచింది. 146 రన్స్‌కే వెస్టిండీస్ ఆలౌటైంది. మూడో రోజు ఆట ప్రారంభానికి ముందే టీమ్‌ఇండియా.. రెండోరోజు ఓవర్‌నైట్ స్కోర్ 448/5 వద్ద తన తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. వెస్టిండీస్ ముందు 286 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ బ్యాటర్లు మరోసారి విఫలమయ్యారు. లంచ్‌కు ముందే అయిదు వికెట్లు కోల్పోయారు. లంచ్ సమయానికి కరేబియన్ జట్టు స్కోర్ 66/5గా ఉంది. లంచ్ అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన వెస్టిండీస్ జట్టు కనీసం టీ బ్రేక్ వరకు కూడా నిలవలేకపోయింది. వెస్టిండీస్ తన తొలి వికెట్‌ను 12 పరుగుల వద్ద చంద్రపాల్ రూపంలో కోల్పోయింది. సిరాజ్ బౌలింగ్‌లో(7.2) చంద్రపాల్ భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే నితీశ్ రెడ్డి అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు.

సిరాజ్ ఇచ్చిన శుభారంభాన్ని రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్ చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. చకచకా వికెట్లు కూల్చారు. వెస్టిండీస్ బ్యాటర్లలో అలిక్ అథనేజ్ (38; 74 బంతుల్లో, 3 ఫోర్లు) టాప్ స్కోరర్. జస్టిన్ గ్రీవ్స్(25; 52 బంతుల్లో, 4 ఫోర్లు), జాన్ క్యాంప్‌బెల్ (14; 32 బంతుల్లో, 1 ఫోర్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లంతా ఘోరంగా విఫలమయ్యారు. టీమ్‌ఇండియా బౌలర్లలో రవీంద్ర జడేజా 4, మహ్మద్ సిరాజ్ 3, కుల్‌దీప్ యాదవ్ 2, వాషింగ్టన్ సుందర్ ఓ వికెట్ తీసుకున్నారు. అటు బ్యాట్‌తోనూ (104*), ఇటు బంతితోనూ (4/54) రాణించిన రవీంద్ర జడేజా ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.

## ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు

# కెప్టెన్‌గా గిల్

### టీ-20లకు సూర్య సారథ్యం..

### 'వన్డే'ల్లోకి రోహిత్, కోహ్లీ



ఆస్ట్రేలియాతో జరిగే వన్డే, టీ–20 సిరీస్‌లకు చెందిన భారతీయ జట్టును ప్రకటించారు. టీమిండియా వన్డే జట్టుకు శుభమన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇక టీ–20 సిరీస్ మ్యాచ్‌లకు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలను నిర్వర్తిస్తాడు. ఆస్ట్రేలియా, ఇండియా మధ్య మూడు వన్డేలు, అయిదు టీ–20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అక్టోబర్‌నవంబర్ నెలల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. సీనియర్స్ మెన్స్ సెలక్షన్ కమిటీ భారత బృందాన్ని ఎంపిక చేసింది. అయితే వన్డేల్లో సీనియర్ క్రికెటర్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఛాన్స్ దక్కింది. ఆ ఇద్దర్నీ ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇక వైస్ కెప్టెన్సీ బాధ్యతలను శ్రేయాస్ అయ్యర్‌కు అప్పగించారు. వన్డేలకు వికెట్ కీపర్‌గా కె.ఎల్.రాహుల్ ఎంపికయ్యాడు. వన్డే టీమ్‌లో నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్షదీప్, ప్రసిద్ధ కృష్ణ, ధ్రువ్ జురెల్ , జైస్వాల్ కూడా ఉన్నారు.

ఆసీస్‌తో జరిగే టీ–20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆ జట్టులో అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ, నితీశ్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్షదీప్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ సాంసన్, రింకూ సింగ్, సుందర్ ఉన్నారు. అయితే వన్డే జట్టుకు స్పీడ్ బౌలర్ బుమ్రాను ఎంపిక చేయలేదు.

తొలుత వన్డేలు జరుగుతాయి. అక్టోబర్ 19వ తేదీన పెర్త్‌లో ఫస్ట్ వన్డే, అడిలైడ్‌లో 23న రెండో వన్డే, 25న సిడ్నీలో మూడో వన్డే ఆడనున్నారు. తొలి టీ20 అక్టోబర్ 29వ తేదీన కెనబెరాలో జరగనున్నది. మెల్‌బోర్న్‌లో రెండో టీ20 అక్టోబర్ 31వ తేదీన, మూడవ మ్యాచ్ నవంబర్ 2న హోబర్ట్‌లో, నాలుగో టీ–20 గోల్డ్ కోస్టులో నవంబర్ 6న, 5వ టీ–20 బ్రిస్బేన్‌లో నవంబర్ 8వ తేదీన ఆడుతారు.

కెప్టెన్సీ మార్పు గురించి రోహిత్ శర్మకు తెలియజేసినట్లు చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపారు.

## ఫోకస్

# బిజినెస్




# పాజిటివ్ ట్రెండ్

బులియన్ మార్కెట్‌లో ఈవారం పాజిటివ్ ట్రెండ్ కొనసాగింది. అమెరికాలో ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, డాలర్ మారకం విలువలో మార్పులు వంటి అంశాలు ప్రపంచ వ్యాప్తంగా బులియన్ మార్కెట్‌ను ప్రభావితం చేసినప్పటికీ, భారత్‌లో పండుగ సీజన్ కావడంతో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకుంది. అయితే, వారం చివరిలో డాలర్ విలువ అనూహ్యంగా పెరగడంతో, లాభాలు తగ్గిపోయాయి. వారం చివరిలో గ్రాము బంగారం 24 క్యారట్ల ధర రూ.11,940, 22 క్యారట్ల ధర రూ.10,945, అదే విధంగా 18 క్యారట్ల ధర రూ.8,955గా ముగిసింది. శుద్ధి వెండి ధర కిలోకి సుమారు రూ.1,43,000 వద్ద స్థిరంగా ఉంది. చెన్నై, హైదరాబాదు, కేరళలో వెండి ధర రూ.1,44,000 వరకూ చేరింది. స్థానికంగా బులియన్ డీలర్లు, బ్యాంకులు, ఇండస్ట్రియల్ వినియోగదారుల సెంటిమెంట్లు స్థిరంగా కొనసాగినప్పటికీ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ అనిశ్చితులు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. దీనికి పండుగ సెంటిమెంట్ కూడా జతకలిసింది. మొత్తానికి, ఈ వారం బంగారం, వెండి ధరలు పండుగ సీజన్, ఆర్థిక అనిశ్చితులు నేపథ్యంలో తేలికపాటి మార్పులతో కొంత స్థిరంగానూ, మరికొంత పాజిటివ్‌గానూ కొనసాగాయి. వచ్చే వారం ట్రెంట్స్‌ను పరిశీలిస్తే, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ముఖ్యంగా అమెరికా డాలర్ బలపడటం లేదా బలహీనపడటం వంటి అంశాలు బంగారు, వెండి ధరలపై అధిక ప్రభావం చూపుతాయి. డాలర్ బలపడితే, బంగారం, వెండి ధరలు కొంతమేర పడిపోవచ్చు. అమెరికా, చైనా మధ్య వర్తక ఒప్పందాల పరిణామాలు, గ్లోబల్ ఆర్థిక వృద్ధి అంచనాలు బులియన్ మార్కెట్ భావనలను ప్రభావితం చేయవచ్చు. భారతదేశంలో పండుగ కాలం కొనుగోళ్లు, వివాహ సీజన్ వినియోగాలు బంగారం, వెండి ధరలను స్థిరంగా లేదా కొంచెం పెరుగుదల చూపించే అవకాశం ఉంది. ఆర్‌బిఐ, కేంద్ర ప్రభుత్వం నిధులను నియంత్రించే విధానాలు, ఇంపోర్ట్ నిబంధనలు కూడా బులియన్ మార్కెట్‌ను శాసిస్తాయి. ఇటీవలి ఐటీ, స్టాక్ మార్కెట్ ఉత్పత్తులు, ఇతర ఆర్థిక సూచికలు కూడా పెట్టుబడిదారుల నిర్ణయాలపై ప్రభావం చూపుతాయి. మొత్తంగా, బులియన్ ధరలు ఈ వారం కూడా గ్లోబల్ ఆర్థిక పరిణామాల ఆధారంగా మధ్యస్థాయి దిశ కొనసాగించవచ్చు. సాధారణంగా, పండుగల కారణంగా స్థానిక డిమాండ్ పెరగడం వల్ల కొంత స్థిరత్వం, చిన్న పెరుగుదల కనిపించవచ్చు. అయితే ఏవైనా భారీ ఆర్థిక లేదా రాజకీయ పరిణామాలు వస్తే ధరలు తీవ్ర మార్పులు అసాధ్యమేమీ కాదు. కాబట్టి ధరల వెనుక గ్లోబల్ ట్రెండ్స్‌ను నిరంతరం గమనించి నిర్ణయాలు తీసుకోవాలే తప్ప, ముందుగా ఊహించడం సాధ్యం కాదు.

# కొనసాగిన బుల్ రన్

బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్‌ఇ)లో సెప్టెంబర్ 29వ తేదీ సోమవారం 80,426.46 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్, ఈవారం ట్రేడింగ్‌కు చివరి రోజైన శుక్రవారం (3 అక్టోబర్) 81,207.17 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా, జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్‌ఇ)లో నిఫ్టీ ఈవారం 24,654.70 పాయింట్లతో మొదలై, 24,984.25 పాయింట్లకు చేరింది. కొన్ని ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, ఈవారం స్టాక్



మార్కెట్లు కొంత మెరుగైన ప్రదర్శనతో లాభపడ్డాయి. బ్యాంకింగ్, మెటల్, ఆటో, ఐటీ రంగాలు లాభాల్లో నిలిచాయి. బుధవారం, గురువారం దేశవాళీ షేర్లలో ట్రేడింగ్‌లు సాగాయి. విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నుంచి అమ్మకాల ఒత్తిడి కొంత ఉన్నప్పటికీ, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డిఐఐ) కొనుగోళ్ళు చేసి మార్కెట్‌ను నిలబెట్టారు. మెటల్, బ్యాంకింగ్ రంగాలు ముందుండగా, ఆటో, కన్స్యూమర్, ఎనర్జీ రంగాలు కొంత తక్కువగా ఉన్నాయి. ఈ వారం మొత్తం బీఎస్‌ఈ సెన్సెక్స్ 780.71 పాయింట్లు, నిఫ్టీ 229,55 పాయింట్లు లాభపడింది. అమెరికా మార్కెట్, విదేశి మార్గదర్శకాలు, ఆర్‌బిఐ ద్రవ్య విధాన నిర్ణయాలు, పండుగ సీజన్‌తో కూడిన వినియోగ రంగం కూడా మార్కెట్‌కు సానుకూలంగా పనిచేశాయి. బ్యాంకింగ్ రంగానికి ఆర్‌బిఐ చర్యలు లాభం కలిగించాయి. మెటల్ రంగానికి అంతర్జాతీయ డిమాండ్ పెరిగింది. పండుగ కాలం వినియోగ రంగానికి మెరుగైన మద్దతు ఇచ్చింది. విదేశీ అమ్మకాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్ ప్రతిఘటిస్తూ లాభంగా ముగిసింది.

### పెట్టుబడులు పెరిగే అవకాశం..

సుమారు మరో మూడు వారాలు పండుగ వాతావరణం కొనసాగడంతో, ఎక్కువ మంది వివిధ రకాల సెంటిమెంట్లతో బంగారంవైపు మొగ్గు చూపుతారని, కాబట్టి రీటైల్ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్‌వైపు దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వారి అంచనాలు నిజమైతే, వచ్చే వారం స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, ప్రత్యేకించి అమెరికా ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాలు స్టాక్ మార్కెట్లను విపరీతంగా ప్రభావితం చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. కాబట్టి, అన్ని రకాలుగా ఆలోచించి పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకోవాలి. వచ్చే వారం ఆర్‌బిఐ ద్రవ్య విధానాలపై మరింత స్పష్టతనిస్తుందని అంటున్నారు. దీనితోపాటు పబ్లిక్ ప్రమాణాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తాయి. పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగం మంచి పెరుగుదల సాధించవచ్చు. అంతర్జాతీయంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, వాణిజ్య ఒప్పందాల పరిణామాలు మార్కెట్‌లో మార్పులకు కారణమవుతాయి. భారతీయ ఉత్పత్తులు, వాణిజ్య నిబంధనలు, ప్రభుత్వ పథకాలు కూడా ట్రెండ్స్‌పై గట్టి ప్రభావం చూపుతాయి. పండుగ సీజన్ కొనుగోళ్లు, వినియోగ రంగ మాంద్యత తగ్గడం వల్ల వినియోగ వస్తువుల రంగంలో ఆశించిన మార్పులు ఉండకపవచ్చు. టెక్నాలజీ, మెటల్, బ్యాంకింగ్ రంగాలు ట్రెడర్ల దృష్టిలో కొనసాగవచ్చు. కొత్త ఐటీ ప్రాజెక్టులు, ఎక్స్‌పర్ట్ డిమాండ్లు టెక్ రంగాన్ని సహాయపడతాయి. చిన్న, మధ్య తరగతి పెట్టుబడిదారుల కొనుగోలు చర్యలు మార్కెట్‌లో స్థిరత్వాన్ని సృష్టించవ్చు. మొత్తానికి, వారం తొలి భాగంలో కొంత స్థిరత్వం, మధ్యలో మార్పిదలవుతూ చివర్లో తిరుగు లాభాలు కనిపించే అవకాశం ఉంది. మార్కెట్ ముందుగానే వినియోగదారుల, పెట్టుబడిదారుల ఆందోళనలకు స్పందించి స్పందన చూపుతుంది. అయితే, ఇవన్నీ భారతీయ, అంతర్జాతీయ రాజకీయాలు, ఆర్థిక పరిణామాల పరంగా మార్పులు చెందవచ్చు, కనుక సచ్చిత్తాంశాల కోసం రోజువారీ కొత్త అప్‌డేట్‌లను గమనించి, తదనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలి.

# ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ మైత్రి


### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని సిపిఐ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానించింది. జిల్లా పార్టీ కార్యాలయంలో జోగుల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ముఖ్య అతిథులుగా మాట్లాడారు. గత సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభల వివరాలను తెలిపారు. ఫాసిజానికి వ్యతిరేకంగా, ఫెడరలిజాన్ని కాపాడేందుకు పోరాటం చేయాలని మహాసభలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన కలవేన శంకర్‌ను సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, బొల్లం పూర్ణిమ, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బీమనాథుని సుదర్శన్, కారుకూరి నగేష్, ఖలీందర్ అలీఖాన్, దాగం మల్లేష్, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, చిప్ప నర్సయ్య, మండల కార్యదర్శులు బొంతల లక్ష్మి నారాయణ, కొండు బానేష్, దేవి పోచన్న, మేదరి దేవావరం, నేన్నెల సమ్మయ్య, అందే పురుషోత్తం, అడెపు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద బిజెపికి బుద్ధి చెబుదాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ సత్తా చాటాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం, మోత్కూర్ అడ్డగూడూర్ రామన్నపేట మండలాల ముఖ్య నాయకుల సమావేశం దేవిశ్రీ గార్డెన్‌లో బోడ సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐకి బలం ఉన్నచోట్ల ఎంపీటీసీలుగా, సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నుండి కాంగ్రెస్‌తో ఈ రాష్ట్రంలో అవగాహనతో ఉన్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కలిసి పనిచేయడానికి సిపిఐ సిద్ధంగా ఉన్నదని సిపిఐ బలం ఉన్నచోట సిపిఐ ప్రాధాన్యతను గుర్తించి సీట్ల సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్‌తో పాటు సిపిఎం ఇతర వామపక్ష పార్టీలతో సర్దుబాటు చేసుకుని మతోన్మాద భారతీయ జనతా పార్టీని ఓడించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చెడ చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, ఏశాల అశోక్, మండలాల కార్యదర్శిలు సలిగంజి వీరస్వామి, అన్నపు వెంకటేష్, గోదల నాగభూషణం, రేఖల శ్రీనివాస్, దాసరి లక్ష్మ య్య, జిల్లా సమితి సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, ఉప్పుల శాంతి కుమార్, చాపల అంజయ్య, పోలేపాక యాదయ్య, బాలగోని సత్యనారాయణ, నరిగే యాదయ్య, సుద్దాల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని, గ్రామకమిటీలు, వార్డు కమిటీలను అప్రమత్తం చేసి పోటీ చేసిన ప్రతీ స్థానంలో అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన లక్ష్మీ దేవిపల్లి, సుజాత నగర్ మండలాల జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, మండలాల ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. పాషా ముఖ్య అతిథిగా మాట్లాడారు.కొత్తగూడెంనియోజకవర్గంతో పాటుజిల్లాలోసిపిఐనిఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజలు, కార్మికుల పక్షాన సిపిఐ, అనుబంధ ప్రజా, కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న పోరాటాలే సిపిఐ అభ్యర్థులకు గెలుపుబాట వేస్తాయని చెప్పారు. ఎన్నికల్లో సమన్వయంలో వచ్చిపోయే రాజకీయ నాయకులకు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, నిత్యం ప్రజల్లో మమేకమయ్యే ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ కూనంనేని చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, చట్టసభల్లో అన్ని వర్గాల ప్రజలసమ్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారం కోసం ఆయన చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి అభ్యర్థుల ఎంపిక బాధ్యత మండల, గ్రామకమిటీలదే అని, ఈ ఎంపికలో ఎలాంటి ఒత్తిళ్లకు తావివ్వరాదన్నారు.బలమైన అభ్యర్థులను, ప్రజల్లో ఉండే వారిని ఎంపిక చేసి పోటీలో నిలబెట్టి గెలిపించుకోవడం ద్వారా ప్రజలకు సైరన న్యాయం జరుగుతుందని చెప్పారు. డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శత వసంతాల ముగింపు బహిరంగ సభ, ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, బహిరంగ సభ విజయవంతానికిఆదివారం ఖమ్మంలో జరిగే ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని సూచించారు. ఈ సమావేశానికి జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, భూక్యా ధస్రు మండలాల కార్యదర్శులు ధీటి లక్ష్మీ పతి, కోమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు గుత్తుల సత్యనారాయణ, ధనలక్ష్మీ, జక్కుల రాములు, రత్నకుమారి, తాళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



### సిపిఐలో చేరిన కాంగ్రెస్ ఆళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్

**ఆళ్లపల్లి:** సిపిఐ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటుందని భద్రాద్రి కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఆసబీర్ పాషా అన్నారు. శనివారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆళ్లపల్లి గ్రామ పంచాయితీ మాజీ ఉపసర్పంచ్ గుంతోజు సదానందచారి సిపిఐలో చేరారు. పార్టీ కండువా క్పిప పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని, ఆళ్లపల్లి మండలంలోని ఐదు ఎంపిటిసి స్థానాలు, 12 గ్రామ పంచాయితీలు, జెడ్‌పిటిసి అన్ని స్థానాలలో అభ్యర్థులను నిలబెట్టి వారి గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కష్టపడితే విజయాలు సొంతమవుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఆళ్లపల్లి మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య, సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పరమ ఇమ్మానియేల్, సిపిఐ జిల్లా నాయకులు గొగ్గల కృష్ణయ్య, సిపిఐ మండల కార్యదర్శి కొమరం హనుమంత రావు, సహాయ కార్యదర్శి నరెడ్ల రాంబాబు, ఏఐటియూసి మండల కార్యదర్శి కుంట సహాదేవ్, మాజీ జెడ్పిటిసి గొగ్గల లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ మలిపెద్ది లాజర్, మండల నాయకులు మద్దెల వెంకటేశ్వర్లు, కసనబోయిన నరేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

### హుస్సేన్ కుటుంబ సభ్యులకు పరామర్శ

మార్కోడు గ్రామానికి చెందిన ఎండి హుస్సేన్ అనారోగ్యంతో మృతి చెందారు. హుస్సేన్ మృతి వార్త తెలుసుకొని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా శనివారం మార్కోడు చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, ఉప్పుశెట్టి రాహుల్, స్థానిక నాయకులు ఉన్నారు.

# ఐదు నెలలుగా జీతాల్లేవ్.. బతికేదెట్టా?

### ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు

**ప్రజాపక్షం/కల్లూరు:** పెండింగ్ లో ఉన్న గ్రామ పంచాయతీ, మున్సిపల్ వర్కర్ల జీతాలను చెల్లించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో కల్లూరు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ గత ఐదు నెలల నుండి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలో చెప్పాలని ప్రశ్నించారు. కల్లూరు మండలంలో తొమ్మిది గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లు లేనందునబడ్జెట్ వచ్చినాకానీ ఇంతవరకు పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వలేదన్నారు. ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. కల్లూరు మండల పరిధిలోని పేరువంచ, ముగ్గు వెంకటాపురం, కొర్లగూడెం, చిన్నకోరుకొండి, తెలగవరం, మర్లపాడు, లక్ష్మీ పురం, లింగాల, ఎర్రబోయినపల్లి తదితర గ్రామపంచాయతీలకు తక్షణమే స్పెషల్ ఆఫీసర్లను నియమించి కార్మికులకు రావాల్సిన మూడు నెలల వేతనాలని చెల్లించాలన్నారు. తక్షణమే వారిని ఆదుకోవాలన్నారు. ఎఐటియుసి ఖమ్మ ం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా నాయకులు దామాల దయాకర్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు మాగంటి రాజశేఖర్, జానుపాటి మల్లేష్, బానోతు రమేష్, మున్సిపల్ యూనియన్ నాయకులు కృష్ణమూర్తి, ఎస్.డి వజీర్ లు తదితరులు పాల్గొన్నారు.


# నోట్లతో ఓట్లు కొనే అభ్యర్థులను తిరస్కరించండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో నీతి నిజాయితీ గల అభ్యర్థులను, లౌకిక వామపక్ష పార్టీలను గెలిపించాలని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు.శనివారం హసన్ పర్తి మండల సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎల్లాపూర్ గ్రామంలో దోమ రాకేష్, మజ్జిగ అజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి మాట్లాడారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని డిసెంబర్ 26, 2025 కు శత వార్షికోత్సవ సభ ఖమ్మంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. శ్రామిక, రైతు, కష్టజీవుల పక్షాన నిరంతర పోరాటాలు నిర్వహించి శ్రమజీవులకి అనేక విజయాలు సాధించి పెట్టిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓట్ల తొలగింపు, ఓట్ల చోరీతో అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పది సంవత్సరాలుగా ప్రజలపై జిఎస్టి విధించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, వాటిని తిరిగి ప్రజలకు చెల్లించాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన స్వతంత్ర సంస్థలైన జ్యుడీషియరీని, సిబిఐని, గవర్నర్ పదవిని, రాష్ట్రపతి పదవిని దుర్వినియోగం చేస్తున్నారని కేంద్రంపై ధ్వజమెత్తారు. గుత్త కోటీశ్వరులకు 15 లక్షల కోట్లు మొండి బకాయిల పేరుతో లోన్స్ రైట్ ఆఫ్ చేయడం క్షమించరాని విషయం అన్నారు. చిన్న, సన్నకారు రైతాంగం పేదలు లక్ష, పది లక్షల లోన్ తీసుకొని చెల్లించకుంటే వారి ఆస్తులు జప్తులు చేసే పాలకులు ధనవంతులకు మాత్రం అప్పులు రద్దు చేయడం అన్యాయమన్నారు. బీసీ హక్కుల రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, హసన్ పర్తి మండల సిపిఐ కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, బిఎస్ఎన్ఎల్ నాయకులు సాంబయ్య, జక్కుల సాంబరాజు, గిన్నారపు రాజు, అనంతసాగర్ దాసు,నాంపల్లి లక్ష్మ య్య, నేదునూరి రామచందర్, నేదునూరి చేరాలు, దోమ రాజమౌళి వంగపాడు వెంకటేష్,మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డికి అభినందన



**ప్రజాపక్షం/డిండి:** భారతకమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ఇటీవల జరిగిన జాతీయ మహాసభల్లో నూతన సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన మాజీ ఎంఎల్‌ఏ కామ్రేడ్ పల్లా వెంకట్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, డిండి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, మండల సిపిఐ నాయకులు తూం బుచ్చిరెడ్డి, రహమంతాపూర్ మాజీ ఎంపిటిసి తూం శేఖర్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## గనిమేనేజర్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి ఏరియాలోని కెటికె 5 ఇంక్లైన్ కు గని మేనేజర్ గా ప్రమోషన్ మీద బదిలీపై వచ్చిన కొత్త మేనేజర్ మాచర్ల రమేష్‌ను గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఫిట్ సెక్రెటరీ దోర్నాల తిరుపతి శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ యు కుమారస్వామి, టి.శ్రీనివాస్, ఇ.శ్రీకాంత్ రెడ్డి, ఏ.అఖిల్ కుమార్, ఎం.సదయ్య, జి.స్వామి, అశోక్, పి.రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సహాయక కేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/ హనుమకొండ:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సహాయక కేంద్రంను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం తెలిపారు. సుబేదారిలోని హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ఈ సహాయక కేంద్రం 24/7పాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. జడ్పిటిసి, ఎంపిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సహాయక కేంద్రం ఫోన్ నెంబర్ 7981975495 ను సంప్రదించాలని జిల్లా ప్రజలకు సూచించారు.

## దామోదర్‌రెడ్డికి నాయిని నివాళి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇటీవలే పరమపదించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపరు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిమానాన్ని, అనుభవాన్ని, ఆప్యాయతను పంచుకున్న ఆ మహనీయుడి లేని లోటు తీరనిది, వారి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని నాయిని పేర్కొన్నారు.దామోదర్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

## నర్సంపేట ఎమ్మెల్యేకు మాతృ వియోగం



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మాతృవియోగం కలిగింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ (88) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతిచెందారు. కాంతమ్మ అంత్యక్రియలు నేడు (ఆదివారం) హన్మకొండలోని పద్మాక్షమ్మగుట్ట పక్కన గల శివముక్తి ధామ్ స్మశాన వాటికలో నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. దొంతి కాంతమ్మ స్వగ్రామమైన నర్సంపేట డివిజన్‌లోని చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## కుటుంబ వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత మనదే!

వరంగల్ క్రైమ్ ఎసిపి సదయ్య



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** కుటుంబ వ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై అధికారులపై ఉందని క్రైం ఎసిపి మహిళా పోలీస్ స్టేషన్ 1 ఇన్స్ స్పెక్టర్‌కు క్రైమ్ ఎసిపి సదయ్య సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా క్రైం ఎసిపి శనివారం రంగం పేట లోని వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్ 1 సందర్శించారు. తనిఖీల్లో భాగం స్టేషన్ సంబంధించిన రికార్థులను పరిశీలించడంతో పాటు కేసులకు సంబంధించిన సిడి ఫైల్స్ లను పరిశీలించడంతో పెండింగ్ కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో కేసులు, నిందితుల అరెస్ట్ సంబంధించిన వివరాలను స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ సూర్యప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాఖపరమైన సమస్యలపై స్టేషన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ భార్య భర్తల మధ్య జరిగే గోడవలపై స్టేషన్ కు వచ్చే బాధితులకు సరైన కౌన్సిలింగ్ నిర్వహించి భార్య భర్త మధ్య సఖ్యతను కుదర్చడమే మన లక్ష్యం పనిచేయాలని, అలాగే మహిళా బాధితులకు సరైన రీతిలో న్యాయం కూడా అందించాలని ఎసిపి తెలియజేసారు.

## దొంగ పోలీస్ అరెస్ట్

తానే పోలీస్ అంటూ డబ్బులు వసూల్



**ప్రజాపక్షం/ జనగామ :** తానే పోలీస్ అంటు డబ్బులు వసూలు చేస్తున్న కిరణ్ అనే వ్యక్తిని జనగామ పోలీసులు అరెస్ట్ చేశారు. జనగామ సిఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జనగామ పట్టణానికి చెందిన కిరన్ గతంలో జనగామ పోలీస్ స్టేషన్ నందు ప్రైయివేట్ వాహన డ్రైవర్‌గా పనిచేసేవాడన్నారు. ఆ సమయంలో వేహికిల్ చెక్కింగ్ కూడా వెళ్లెవాడని, తన బంధువు అమ్మాయిని ప్రేమించిన విషయంలో కేసు నమోదు కాగా జైలుకు వెళ్లాడన్నారు. ఆ తరువాత కిరన్ చల్లూరు చెందిన ఉమారాణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని, ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో తన బంధువైన కానిస్టేబుల్ కుమారస్వామి ఐడి కార్డును అతనికి తెలియకుండా తీసుకొని పెంబర్తి, నెల్లుట్ల హైవేపై వెళ్లె వాహనాలను నేనే కుమారస్వామిన అని చెబుతూ డబ్బులు వసూలు చేసేవాడన్నారు. తన భావ బందువైన జనగామకు చెందిన వ్యక్తులు గ్యాంగ్ రేప్ చేయగా ఇట్టి విషయంలో మహమ్మద్ ఓవైసి తన తమ్ముడు మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూమ్‌లు ఉన్నారని తెలిసి వారితో మాట్లాడడానికి వారితో మాట్లాడడానికి వారి కులస్థుడైన మహమ్మద్ జహంగీర్ (భారత్ ప్రింటింగ్ ప్రెస్ ) వద్దకు వారిద్దరిపై కేసు నమోదు కాకుండా ఉండాలంటే రెండున్నర లక్షల రూపాయలు ఇవ్వాలని జహంగీర్ ఫోన్ నుండి అన్వర్ కొడుకు అయిన మహమ్మద్ అనీష్‌తో మాట్లాడించాడని, ఆ తరువాత మరుసటి రోజు సాయంత్రం నిందితుడు కిరణ్, జహంగీర్‌లు కలిసి అన్వర్ ఇంటికి వెళ్లి రెండున్నర లక్షలు ఇవ్వకుండే కేసు పెడతామని బెదిరించాడన్నారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో బెదిరించారన్నారు. ఫిర్యాదు మహమ్మద్ అన్వర్ ఫిర్యాదు మేరు కేసు నమోదు చేయగా శనివారం జనగామ చౌరస్తాలో అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కిరణ్ వద్ద నుండి మొబైల్ ఫోన్, పోలీస్ ఐడి కార్డు స్వాధీనం చేసుకున్నామన్నారు. కిరణ్‌ను పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన జనగామ ఎస్‌హెచ్‌ఓ పి సత్యనారాయరెడ్డి, ఎస్‌ఐ భరత్, కానిస్టేబుల్లు కరుణాకర్, సాగర్, క్రిష్ణ, చరన్, రాజేష్, మధుసూదన్‌లను జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్, ఎసిపి పండరి చేతన్‌లు అభినందించారు.

# గ్రామాల్లో రాజకీయ సందడి

పోటీకి సై అంటున్న నాయకులు
రిజర్వేషన్లు కలిసిరాక కొందరు
జిల్లా పరిషత్ చైర్మన్ కోసం పోటీ



**ప్రజాపక్షం / జనగామ :** గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. రిజన్వష న్లు కలిసి రాని వారు నా పనైపోయిందని నిరాశ చెందుతుండగా కలిసి వ చ్చిన వారు పోటీకి సై అంటున్నారు. ఒకొక గ్రామంలో ఎంపిటిసి, సర్పంచ్ కోసం పది మందికి పైగా పోటీ పడుతున్నారు. ఇక జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ ఎస్‌సి మహిళకు రిజర్వ్ కావడంతో సరియైన అభ్యర్థులు లేని పరిస్థితి. ఉదయం, రాత్రి రచ్చబండ చర్చలు ఎన్నికపైనే జరుగుతున్నాయి. ఈ నెల 8న కోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో ఎన్నికలు ఉంటాయా..ఉండవా అనే సందేహాలు సైతం ఉన్నాయి. జనగామ జిల్లాలో 12 మండలాలు ఉండగా 12 జడ్‌పిటిసి, 12 ఎంపిపి, 134 ఎంపిటిసి, 280 సర్పంచ్, 2532 వార్డు స భ్యులకు ఎన్నికలు జరగున్నాయి. గత నెల 27 జిల్లాలో ఎంపిటిసి, జడ్‌పిటి సి, ఎంపిపి, వార్డు సభ్యుల రిoజర్వేషన్లు ప్రకటించారు. 12 జడ్‌పిటిసి, ఎం పిపి స్థానాల్లో రెండు ఎస్‌సి, మూడు ఎస్‌టి, ఐదు బిసి రెండ్ జనరల్ కేటగిరి కు రిజర్వ్ చేయబడ్డాయి. అదే విధంగా గ్రామ సర్పంచ్‌కు సైతం రిజర్వేషన్లు డ్రా పద్దతిలో తీశారు. పూర్తిగా ఎన్నికల నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు చే యబడ్డాయి.జెడ్‌పిటిసి స్థానాల్లో బచ్చన్నపేట, కొడకండ్ల రెండు జనరల్ కేటగిరికి దక్కాయి. ఇందులో కొండకండ్ల మహిళకు రిజర్వ్ చేయబడింది. ఎస్ సిల్లో మూడు స్థానాల్లో కేటాయించగా ఒకటి మహిళకు కేటాయించారు. ఎస్ టిలకు రెండు కేటాయించగా ఒకటి మహిళ, ఒకటి జనరల్‌కు కేటాయించారు. బిసిలకు ఐదు స్థానాలు దక్కగా రెండు మహిళలకు, మూడు బిసి జనరల్‌కు కేటాయించారు. ఎంపిపి స్థానాల్లోనూ ఇదే పరిస్థితి కొడకండ్ల జనరల్‌కు దక్కగా బచ్చన్నపేట జనరల్ మహిళలకు రిజర్వ్ చేయబడింది. ఇలా రిజర్వేషన్లు పూర్తి చేసిన అధికారులు ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు.

### ఆశావహుల్లో నిరాశ

ఎంపిపి, జడ్‌పిటిసి పదవులు ఆశిస్తున్న చాలా మంది నాయకులు నిరాశకు గురయ్యారు. రిజర్వేషన్లకు వారి ఆశలు గల్లంతయ్యాయి. కొందరు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి పైనా కన్నేశారు. వారి ఆశలు సైతం గల్లంతయ్యాయి. లింగాలఘనపురం తాజా మాజీ జడ్‌పిటిసి గుడి వంశీధర్‌రెడ్డి రఘునాథపల్లి, లింగాలఘనపురం నుండి పోటీ చేయాలని భావించారు. ఆ రెండు చోట్ల ఒకటి బిసిలకు, ఒకటి ఎస్‌సిలకు రిజర్వ్‌డ్ చేయబడింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబుసైతం రఘునాథపల్లి జడ్‌పిటిసిగా పోటీ చేసి కలిసొస్తే జిల్లా పరిషత్ చైర్మన్ కావాలనుకున్నారు. కానీ రఘునాథపల్లి జడ్‌పిటిసి బిసి మహిళకు రిజర్వ్‌డ్ కావడంతో ఆయన ఆశలు సైతం గల్లంతయ్యాయి. జనగామ జెడ్‌పిటిసి కోసం అనేక మంది పోటీ పడ్డారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లోనూ ఎక్కువ పోటీ ఉండేది. అయితే జనగామ జడ్‌పిటిసి, ఎంపిపి స్థానాలకు ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో పోటీకి సిద్ధంగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాల్నె సిద్దిలింగంతో పాటు అనేక మంది నిరాశకు గురయ్యారు. అన్ని మండలాల్లోనూ అనేక మంది నాయకు ఆశలు నిరాశలయ్యాయి.

### జిల్లా పరిషత్‌కు ఎస్‌సి మహిళ

జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ ఎస్సీ మహిళలకు రిజర్వ్ చేయబడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోనూ గతంలో ఎస్సీ మహిళలకు రిజర్వ్ చేయగా జనగామ జిల్లాకు చెందిన గద్దల పద్మకు దక్కింది. ఒక దఫా గిరిజన మహిళకు రిజర్వ్ చేయబడగా జనగామకు చెందిన గిరిజన మహిళకే చైర్మన్ పదవి దక్కింది. ప్రస్తుతం ఎస్సీ మహిలకు రిజర్వ్ చేశారు. అయితే బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లోనూ సరియైన వ్యక్తులు లేని పరిస్థితి. ప్రస్తుతం సీనియర్ డాక్టర్ సిహెచ్ రాజమౌళి భార్య పేరు కాంగ్రెస్ నుండి వినిపిస్తుండగా, బిఆర్‌ఎస్ నుండి చేవెళ్లి సంపత్ భార్య, డాక్టర్ సుగుణాకర్ రాజు భార్య పేర్లు వినిపిస్తున్నాయి. అయితే మెజార్టీ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కె అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కాంగ్రెస్ అభ్యర్థులే కూర్చొవచ్చు అనే చర్చ జరుగుతుంది.

### ఎవరి అంచనాలు వారివి

జడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసి, సర్పంచ్ స్థానాల్లో గెలుపు ఓటములపై ఎవరి ఆశలు వారికి ఉన్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కైవసం చేసుకునే అవకాశం మాకే ఉంటుందన్న ధీమాలో కాంగ్రెస్ ఉండగా అధిక స్థానాల్లో తామే గెలుపొంది ఎక్కువ జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం దక్కించుకుంటామని బిఆర్‌ఎస్ అంటుంది. 12 మండలాలు ఉండగా 7 స్థానాల్లో ఎవరు గెలిస్తే వారే చైర్మన్ పీఠం దక్కించుకునే అవకాశం ఉంటుంది. కొన్ని మండలాల్లో కాంగ్రెస్, కొన్ని మండలాల్లో బిఆర్‌ఎస్ బలంగా ఉన్న నేపథ్యంలో పోటీ ఎలా ఉంటుందన్నది చూడాలి.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ కార్యాచరణ

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం / వరంగల్ :** జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసిపి అంకిత్ కుమార్, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, శాంతిభద్రతలు (లా అండ్ ఆర్డర్), సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు, రూట్ మ్యాప్ల తయారీ, రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతుల మంజూరు వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతలలో స్థానిక సంస్థలను, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, మొదటి విడతలో 5 మండలాలు, రెండవ విడతలో 6 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయని అన్నారు. ఎన్నికల శాంతియుత నిర్వహణకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి)ను కఠినంగా అమలు చేయాలని, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి లైవ్ వెబ్ కాస్టింగ్, ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఆర్ ఓ లు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు టాయిలెట్స్, ఫర్నిచర్, ర్యాంప్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రహరీ గోడలు లేని పోలింగ్ కేంద్రాలకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులు సమన్వయంతో రూట్ మ్యాప్లు రూపొందించాలని, రాజకీయ పార్టీల ప్రచారాలకు అవసరమైన అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని నియమించి, ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ కల్పించాలని అన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ, మద్యం పంపిణీ, బెదిరింపులు, అక్రమ ప్రచారాలు వంటి ఉల్లంఘనలపై నిరంతరం నిఘా పెట్టి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించాలని అన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ రామి రెడ్డి, డిపిఓ కల్పన, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపిడిఓలు, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## పక్కాగా ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ జనగామ :** ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల కోసం ఏకశిల బిఈడి కళాశాల, ఎబివి, విబిఐటి కళాశాలను, డిస్టిభూషన్ కోసం గౌతమ్ మోడల్ స్కూల్‌ను డిసిపి రాజమహేంద్రనాయక్, ఏసిపి పండరి చేతన్, ఎన్నిలకు సంబంధించిన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమాలకు అనుగుణంగా డిస్ట్రిభ్యూషన్, కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లు ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేయాల్సిన ఏర్పాట్లను, వసతులపై పరిశీలించి అధికారులకు సపలు సూచనలు చేశారు. పోలీస్ బందోబస్తు, రవాణా, పార్కింగ్, సదుపాయాలతో పాటు భద్రతాపరమైన అంశాలను సంబందిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ,ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణి రద్దు :** జెడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. ఈ విషయాన్ని గమణించిఎవరు ప్రజావాణిలో దరఖాస్తుల కోసంకలెక్టరేట్‌కు రావొద్దని తెలిపారు.

## కోడ్ ముగిసేవరకూ 'ప్రజావాణి' రద్దు

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం ఒక ప్రకటనలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని కలెక్టర్ ప్రకటనలో వెల్లడించారు.

## 'స్థానిక'కు సమాయత్తం కావాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా పొత్తులతో సంబంధం లేకుండా పోటీకి కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మరియు సుధాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపెల్లిలో జరిగిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార పార్టీ పొత్తుతో సంబంధం లేకుండా, మన పార్టీ ప్రాతినిధ్యం పెంచే విధంగా సరైన అభ్యర్థులను ఎంపిక చేసి పోటీకి సిద్ధం కావాలని కోరారు. గత బీఆర్ఎస్ పదేండ్ల ప్రజా వ్యతిరేక పాలన, బిజెపి అవలంబిస్తున్న మతతత్వ ,నియంతృత్వ విధానాలను ప్రతిఘటించే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో ప్రజలు మరోసారి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో



సిపిఐ మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, గ్రామ కార్యదర్శి బొల్లు వెంకన్న, నాయకులు కందుల యాకయ్య, నర్సింగం గురువయ్య, జిన్నా వీరయ్య ,గజ్జి చంద్రయ్య, శ్రీను బుడిగ వెంకన్నతదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌ను అభినందించిన ఎమ్మెల్యే నాగరాజు

ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించడం గర్వకారణం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన గాలి విజయలక్ష్మి – రవికుమార్ దంపతుల కుమారుడు గాలి రాహుల్ గ్రూప్1 లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందిన సందర్భంగా శనివారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ 'పేద కుటుంబం నుంచి కష్టాలు ఎదుర్కొంటూ, పట్టుదలతో చదువుకొని అంచలంచలుగా ఇంతటి ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించడం గర్వకారణం. ఈ విజయంతో తల్లిదండ్రులకు మాత్రమే కాకుండా, మామునూరు గ్రామానికి, వరంగల్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికే పేరు ప్రఖ్యాతలు తెచ్చారు' అని అభినందించారు. ఎమ్మెల్యే నాగరాజు గాలి రాహుల్‌కు స్వీట్ తినిపించి శాలువా కప్పి సత్కరించి, మరింత ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని ఆకాంక్షలు తెలిపారు. అలాగే ఉన్నత స్థాయికి చేరే విధంగా కష్టపడి కుమారుడిని చదివించిన తల్లిదండ్రులు ఇద్దరినీ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎంబిబిఎస్ సీటు సాధించిన అరుముల్లా గణేష్‌ను సత్కరించిన ఎమ్మెల్యే నాగరాజు**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఎనుమాముల గ్రామానికి చెందిన అరుముల్లా గణేష్ చిన్ననాటి నుంచే తల్లిదండ్రులను కోల్పోయి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుంటూ కష్టాలను తట్టుకుని ఎలాంటి శిక్షణ లేకుండానే ఎంబిబిఎస్ సీటు సాధించడం గర్వకారణమని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రశంసించారు. ఈ సందర్భంగా గణేష్ ఎమ్మెల్యే హన్మకొండ సుబేదారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా, ఎమ్మెల్యే నాగరాజు ఆయనను శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే వైద్య విద్యకు అవసరమైన పరికరాలను అందజేస్తూ ప్రస్తుతం భవిష్యత్తులో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా స్థానిక డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సౌరం చిన్నయ్య, కాంగ్రెస్ నాయకులు దామెర ఆనందం, సౌరం ప్రభాకర్, మాణిక్యం, అభికేషం, సౌరం అభిలాష్, దాసుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికలలో సిపిఐని ఆదరించండి



సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. శనివారం భీమదేవరపల్లి మండలం కొత్తపెల్లిలో మండల కార్యదర్శి ఆదరి రమేష్ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించే సిపిఐ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికలలో ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం, రైతాంగ సాయుధ పోరాటంలో సిపిఐ ముఖ్య పాత్ర పోషించిందన్నారు. భూ సంస్కరణలలో భూస్వాముల నుంచి సుమారు 10లక్షల ఎకరాలు స్వాధీనం చేసుకొని పేదలకు పంచిన పార్టీ సిపిఐ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ తరుపున స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులకు ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. స్నేహ పూర్వకంగా ఉన్న అధికార కాంగ్రెస్ పార్టీ సిపిఐ అభ్యర్థుల గెలుపుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంచాల రమాదేవి, కొంగల రాంచంద్రారెడ్డి, మండల కార్యదర్శి ఆదరి రమేష్, మార్పు కృష్ణారెడ్డి, తిరుపతి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## త్రివేణిలో చెస్ పోటీలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో అండర్ 15 ఉమ్మడి ఖమ్మంజిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. శనివారం ఖమ్మంజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 15 జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్ 15 బాలికల విభాగంలో ఖమ్మంకు చెందిన పి.రీతుశ్రీ, కల్లూరుకు చెందిన ఎన్. భావజ్ఞ, నేలకొండపల్లి గురుకుల పాఠశాలకు చెందిన జే. శ్రీకళ, ములకలపల్లి గురుకుల పాఠశాలకు చెందిన జి. హర్షిత ఎంపికయ్యారు. బాలుర విభాగంలో బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలకు చెందిన వి. అక్షాజ్, అనీష్ సూర్య, మోక్షిత్ అయుష్మాన్, సెడార్ వ్యాలీ పాఠశాలకు చెందిన కె. హరియత్ లు ఎంపికయ్యారు. పి. ఈశ్వర్, డి.హ్యూమన్, సిహెచ్ గౌతమ్‌కృష్ణ, ఎ. శ్రీరామ్, శివ నాగసాయి, కేతన్ తదతరులు ప్రత్యేక బహుమతులు సాధించారు.

## అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

**ప్రజాపక్షం/సుజాతనగర్:** అకాల వర్షం అన్నదాతలను నిండా ముంచింది. వరుసగా వర్షాలు రావడంతో పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది దసరా పండగ రోజున ప్రత్తి తీయడం మొదలు పెడతారు. వర్షాలు అధికంగా రావడంతో ప్రత్తి పూత పిందే కాయ కింద రాలుతుంది. లోతట్టు ప్రాంతాల పత్తి చేలలో చెట్లు మునిగి ఆకులు మొత్తం ఎర్ర భారీ పంట నష్టం జరుగుతుంది. ఈ ఏడాది సుజాతనగర్ మండలంలో అధికంగా ప్రతి పంటలు సాగు చేశారు. సింగభూపాలెం చెరువు నీటిని ఉపయోగించుకొని వరి మొక్కజొన్న కూరగాయలు మిర్చి పంటలను సాగు చేస్తున్నారు ఏడాది సుజాతనగర్ మండలంలో ప్రతి పంటలు 11,645 ఎకరాలలో, వరి 2935 ఎకరాలలో, మొక్కజొన్న 60 ఎకరాలలో, మిర్చి 25 ఎకరాలలో రైతులు పంటలు సాగు చేస్తున్నారని మండల వ్యవసాయ అధికారి జి నర్మద తెలిపారు. తడిసిన పత్తి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని మద్దతు ధరను తమకు అందించి కాపాడాలని రైతులు రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

## పార్టీ కార్యకర్తలకు అండగాఉంటా : సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/గుండాల :** సిపిఐ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుతానని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్‌పాష అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్య కర్తల సమావేశాని ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా గుండాల ఉమ్మడి మండలంగా ఉన్నప్పటినుండి సిపిఐ ప్రజల పక్షాన ఉందనిగిరిజనుల పోడుభూములకు పట్టాలు ఇప్పించడంలో ఎన లేని కృషి చేసిందన్నారు. భరత దేశంలోనే 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ నే అన్నారు. బరిలో ఉండే ప్రతి సిపిఐ అభ్యర్దిని గెలిపించాలని, ప్రతి కార్యకర్త ఎన్నికలకు సంసిద్ధం కావాలని అన్నారు. డిశంబర్ 26న ఖమ్మంలో పార్టీ శతజయంతి ఉత్సవాలకు జయప్రదం చేయాలని పి లుపునిచ్చారు. సిపిఐ పార్టీకి ఆరర్శితులై ముప్పై కుటుంబాల వారు పార్టీ లో చేరగా సాబీర్ పాష పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీ నాయకులు సరిరెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, ఉప్పుశెట్టి రాహు ల్, వాగబోయిన రమేష్, కొమరం హనుమంతు, శాహెద్,గడ్డం శ్రీను, సమీర్, బచ్చలి రామయ్య, రవి వర్మ, ప్రణయ్, వినయ్, ప్రనయ్, విక్రం, నరెందర్ పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ నుంచి అవార్డు స్వీకరించిన పల్లవి



**ప్రజాపక్షం/ఖమ్మరూరల్ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఆరెంపులగ్రామానికి చెందిన తాళ్లూరి పల్లవి అనే యువతి అవార్డు అందుకుంది. దీనిని ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌ల్‌లో శనివారం ప్రధానోత్సవం చేశారు. ఇది పిఎంసేతు పథకంలో ఏఐ (ఆర్టిఫిషల్‌ఇంటిలిజెన్స్) విభాగంలో అత్యుత్తమ నైపుణ్యం కనబరించినందుకు గాను లభించింది. ఈ సందర్భంగా యువతి తల్లిదండ్రులు తాళ్లూరి రవి, అజిత, గ్రామస్థులు, ఆనందం వ్యక్తం చేశారు.

## జిల్లాలో మళ్లీ కాంగ్రెస్ సత్తా చాటుదాం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా మళ్లీ సత్తా చాటుదామని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య అన్నారు. శనివారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో ప్రత్యేక సమావేశాన్నినిర్వహించారు. జిల్లాలో నేడు అశ్వారావుపేట, ఇల్లెందులలో సమావేశం ఉంటుందని, సోమవారం ఉదయం పినపాక నియోజకవర్గం, మధ్యాహ్నం భద్రాచలం నియోజకవర్గ కేంద్రంలో సమావేశాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ముందుగా మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్ రెడ్డి అకాల మరణంపై చింతిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మోతుకూరి ధర్మారావు, నాగ సీతారాములు, టీపీసీసీ సభ్యులు బాలశౌరి, ఏనుగుల అర్జునరావు, తోట దేవి ప్రసన్న, పసుపులేటి వీరబాబు, గడిపల్లి కవిత, కొత్వాల శ్రీనివాస్, కోనేరు చిన్న, యడవల్లి కృష్ణ, బిక్కసాని నాగేశ్వరరావు, జలీల్, మహ్మద్ ఖాన్ చీకటి కార్తీక్, రామ్ లక్ష్మ ణ్, సురేష్ నాయక్, గద్దల రమేష్, నూకల రంగారావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి నిమజ్జనోత్సవం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేవీ నవరాత్రులను పురస్కరించుకుని 11 రోజుల పాటు పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవం ఉత్సాహపూరిత వాతావరణంలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. శనివారం ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న ఘాట్ల వద్ద నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. విజయ దశమిని పురస్కరించుకుని దేవీ నవరాత్రుల సందర్బంగా ఖమ్మం నగరంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ రెండు వరకు నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నిమజ్జనోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా కోలాట, డప్పు నృత్యాలతో ఘాట్‌కు తరలించి నిమజ్జనం చేశారు. అమ్మవారి నిమజ్జనాన్ని తిలకించేందుకు కాల్వొడ్డు ప్రాంతానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. నిమజ్జనం సందర్బంగా ఖమ్మం కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కాల్వొడ్డు, ప్రకాష్ నగర్ ఘాట్ల వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భారీ క్రేన్లను ఏర్పాటు చేశారు. సిబ్బందిని, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. త్రాగునీటి సౌకర్యం కల్పించారు. ఘాట్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు.


# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు మహర్దశ

తెలంగాణలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రణాళిక

సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతాంగం సంక్షేమం కోసం రూ.లక్షన్నర కోట్లు ఖర్చు

పామాయిల్ రైతుల రాష్ట్ర స్థాయి సమ్మేళనంలో మంత్రి తుమ్మల





**ప్రజాపక్షం/దమ్మపేట:** ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మహర్దశ పట్టనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. దమ్మపేట మండలం లింగాలపల్లి లో ఆయిల్ పామ్ రైతుల రాష్ట్ర స్థాయి సమ్మేళనంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ పూజ్యులు ఎన్టీఆర్ చేతుల మీదుగా నాటిన పామాయిల్ మొక్కతో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ కు శ్రీకారం చుట్టామన్నారు. 31 జిల్లాల్లో ఆయిల్ ఫాపాత్వంలో ఉన్నా ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు కృషి చేశామన్నారు. అప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీ ఓ.ఈ.ఆర్ ఆధారంగానే పామాయిల్ గెలలు ధర నిర్ణయం జరుగుతుందని తెలిపారు. 15 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ ఉన్నచోట పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తామన్నారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీ అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణం జరిగిందని, త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్ పామ్ లో అంతర పంటల సాగుతో రైతులకు అదనపు లాభాలు ఉంటాయని కోకో జాజి వక్క అవకాడో అంతర పంటల సాగు కు అవకాశాలు ఉన్నాయని మంత్రి తుమ్మల పే ర్కొన్నారు. లక్షన్నర కోట్ల రూపాయలు విలువ చేసే వంట నూనెలు దిగుమతి చేసుకుంటున్నాం అన్నారు. పామాయిల్ రైతులకు కేంద్ర ప్రభు త్వం ద్వారా కార్బన్ క్రెడిట్ పథకంలో నిధులు అందే విధంగా డిమాండ్ చేస్తామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ కోసం అన్ని మండలాల్లో రైతు సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. పామాయిల్ గెలలు ధర టన్ను ఇరవై ఐదు వేలు మద్దతు ధర కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలనీ కోరారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతు సంక్షేమం కోసం లక్షన్నర కోట్లు ఖర్చు చేశామన్నారు. ఏడాదికి రెండు లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ టార్గెట్ గా ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్ ఫామ్ రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, ఎమ్మెల్యే లు కూనంనేని, జారే ఆది నారాయణ, ఆయిల్ ఫామ్ రైతు అసోసియేషన్ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధర లభించేలా చర్యలు

అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పత్తి, ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర లభించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై కపాస్ కిసాన్ యాప్ శనివారం సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో జిల్లాకు సంబంధించి 2.60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 40వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం మొత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం ఉందన్నారు. సన్న ధాన్యం కొనుగోలుతో పాటు మూడు నుంచి నాలుగు నెలల లోపు మిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు తూర్పారా పట్టిన తర్వాత నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. హార్వెస్టర్ల పనితీరు సరిగ్గా ఉండేలా ఏఈవోలు పర్యవేక్షించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం పరిధిలో అవసరమైన గన్ని సం చులు వారికి కేటాయించిన మిల్లుల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. పత్తి కొనుగోలు సులభతరం చేసే కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. మార్కెటింగ్ ప్రాం తీయ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర పడిపోతున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర చెల్లించి సిసిఐ ద్వారా కొనుగోలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. నాణ్యమైన పత్తి పంట (8శాతం తేమ) క్వింటాల్ రూ. 8110 మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. తేమ శాతం తగ్గుతూ ఉంటే మద్దతు ధర తగ్గుతుందని దీనిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పత్తి రైతులు మార్కెట్‌కు వచ్చి ఇబ్బందులు పడకుండా ఇంటి వద్ద నుంచి స్లాట్ బుక్ చేసుకునేవిధంగా కపాస్ కిసాన్ యాప్‌లో సౌకర్యం కల్పించామన్నారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలకు రైతులు టోల్ ఫ్రీ నెం. 18005995779, వాట్సాప్ సేవలకు 8897281111 నందు సంప్రదించాలని తెలిపారు. అనంతరం మండలాల వారీగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యల గురించి తెలుసుకుని వాటి పరిష్కారానికి అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డిఎం శ్రీలత, సంబంధిత అధికారులు, ఏడిఏలు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కండి

ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ప్ర భుత్వం అందజేసిన సంక్షే మ పథకాల గురించి ప్రజలకు తెలియజేసి రాబో యే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం రైతు రుణమాఫి మహిళలకు ఉ చిత బస్సు ఉచిత విద్యుత్ రైతులకు రైతుబంధు, వృద్ధులకు వికలాంగులకు పె న్షన్లు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. జెడ్పిటిసి, ఎంపిటిసి అభ్యర్థుల ఎంపికపై ముగ్గురు వ్యక్తుల పేర్లు పిసిసి కమిటీకి పంపించడం జరుగుతుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, శీలం వెంకటనర్సిరెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గర్భిణీల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఏజెన్సీ ఏడిఎం హెచ్‌ఓ డా.సైదులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివాసీ మారుమూల ప్రాంతాల్లో నివశించే గర్భిణీల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గర్భందాల్చిన ఐదు నెలల తర్వాత టిఫా స్కానింగ్ చేయించుకునేందుకు అవగాహన కల్పించాలని ఏజెన్సీ ఏడిఎం హెచ్‌ఓ డా. సైదులు అన్నారు. మోరంపల్లి బంజర్ పిహెచ్‌సీని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. పిహెచ్‌సికి వచ్చే రోగులు, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో ఏజెన్సీ ప్రాంతాల్లో అధికంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాలు ప్రభలే అవకాశం ఉందని, ఆయా పిహెచ్‌సిల సిబ్బంది విధులకు సక్రమంగా నిర్వహించాలన్నారు. పిహెచ్‌సిల పరిధిలో గర్భిణీల నమోదును పెంచాలని, ప్రసవం కోసం వచ్చే గర్భిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సాధారణ ప్రసవం జరిగేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని జ్వరాల వల్ల మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు పడాలన్నారు. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.లక్ష్మి సాహితి, పాయం శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతిబాయి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రక్తదానం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతిబాయి తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులోని రితన్య ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రితన్య వాలంటరీ బ్లడ్ సెంటర్‌ను డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతి బాయి ప్రారంభించారు. బ్లడ్ సెంటర్‌లో మిషనరీలు, ఇతర పరికరాలను పరిశీలించి నిర్వాహకులతో పలు అంశాలపై మాట్లాడారు.గతంలో ప్రమాదాల బారీనపడిన వారికి రక్తం అవసరమయ్యేదని ఇప్పుడు వారితో పాటు తలసేమియా చిన్నారులకు రక్తం నిరంతరం అందించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రక్తదాన ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. ఒక వ్యక్తి చేసిన రక్తదానంతో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. వలీవ్ క్రిప్టో సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ జి. బారవి, జి. సుజాత, ఐఎంఎ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రెహనాబేగం, డాక్టర్ కోటేశ్వరరావు, ప్రముఖ వైద్యులు గొంగూర వెంకటేశ్వరరావు లు పలు విభాగాలను ప్రారంభించారు.డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మి దీప, సంకల్ప సంస్థ సంయుక్త కార్యదర్శి కస్తూరి, ఉపాధ్యక్షురాలు పి. పావని, కోశాధికారి పి. రవిచందర్, పి. ఉదయ్ భాస్కర్, అనిత, గోవర్ధన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏది తేల్తలేదు.. ఎట్లయితదో





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏడాదిన్నర ఎదురు చూస్తే ఇప్పుడు ఎన్నికలు అన్నారు. కులపొల్లకు కేటాయింపులు పూర్తయ్యాయంటా. ఇంత జరిగాక ఎన్నికలు జరుగుతాయా అంటే ఇంకా డౌటేనట. ఏది తేల్తలేదు. అట్లని చెప్పి ఆగుతాయా అంటే అది లేదట. పోయిన సారి జరిగిన పొరపాట్లు యాది చేసుకుని మళ్లీ జరగకుండా సరి చేసుకుని గెలుద్దామంటే మధ్యలో కోర్టులొల్లి. కులపొల్లకి మొత్తంలో సగం దాటి ఇవ్వకూడదంట. ఈ విషయం గవర్నమెంట్ వాళ్లకు తెలియదా అంటే తెలుసంట. తెలిసి ఎట్లిచ్చారు అంటే దానికి ఓ యవ్వారం ఉందంట. ఇస్తానన్నాం ఇచ్చాము. ఐటనక సంగతి వాళ్లకు తెలియదంట. ఈ సంగతి ఇట్లుంటే మా ఊరి అయన్ని అసలు జరుగుతాయా అంటే కోర్టు యవ్వారం మీదనే ఆధారపడ్డదంట. ఇంకొక ఆయనేమో ఎన్నికలు ఉండవు. జరిగినా పదవుల్లో ఉండరు. అంత తుడిసి పెడతారట. ఈ మాటలు విన్నాక కాలు చేయి ఆడటం లేదు. ఉన్న నాలుగు డబ్బులు ఖర్చు పెట్టి గెలిస్తే డబ్బులు పోయి పదవి లేక ప్రాణమంతా ఆగమాగమైతదన్న భయం పట్టుకుంది. చివరకు బతుకంతా ఆగమైపోద్ది. ఏదో ఒక్క ఛాన్స్ దొరికింది సర్పంచో, ఎంపిటిసినో అయితే పోలా అనుకుంటే సవాలక్ష కొర్రీలు. ఇప్పటికే కులపొల్లను పొగేసి దావత్ చేసినా మళ్లీ ఏమంటారో. వాయిదాపడితే మళ్లీ ఏమడుగుతారో అదోక దిగులు. ఏడాది సంది డబ్బులు పొగేసినా ప్రాణం మీదకు వచ్చినా రూపాయి ఖర్చు చేయలే. మా పార్టీ ఆయన్ని ఏద్ది అసలు యవ్వారం అంటే మీ కులపొల్లకి ఇచ్చింది మళ్లీ మారొచ్చు అంటుండు. మూడురోజుల నుంచి అదో దిగులు. వచ్చిన అవకాశం మళ్లీ జారిపోద్దేమని భయం. బుర్రలో తుట్టెపురుగు తిరిగినట్లవుతుంది. ముందుకా వెనక్కా ఏది తేల్తలేదు. పదవి మా చెడ్డదిరా. రాక ముందే ఇట్లుంటే వస్తే ఎట్లుండదో. ఎన్ని కష్టాలు ఉన్నా పదవి పదవే కదా.

## ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుంది

ఎఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏజెన్సీ మారుమూల ప్రాంతాల ప్రజానికానికి పోలీస్‌శాఖ అనునిత్యం అందుబాటులో ఉంటుందని ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన చర్ల మం డలం పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు బట్టిగూడెం, బత్తినపల్లి, రామచంద్రాపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. సిఆర్‌పిఎఫ్ బెటాయిలిన్ కమాండెంట్ సెబాస్టియన్, చర్ల సిఐ రాజువర్మ, పోలీస్ సిబ్బందితో కలిసి వాగులు దాటుకుంటూ వెళ్లి ఆ గ్రామాల్లోని 120 కుటుంబాల వారికి నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పోలీస్‌శాఖ అనునిత్యం అందుబాటులో ఉంటుందని, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నిరశించే ఆదివాసీలకు విద్య,వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను కల్పించడమే లక్ష్యాంగ పనిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. డెంగీ, మలేరియా, టైఫాయిండ్ వంచి విష జ్వరాల భారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి నిరోదకులైన మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని కోరారు. ప్రత్యక్ష్యంగా, పరోక్షంగానైనా వారికి సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 'ఐ లవ్ మహ్మద్' ప్రచారం కేసులో

# నిందితుడి కల్యాణమంటపం కూల్చివేత

**బరేలీ:** ''ఐ లవ్ మహ్మద్'' ప్రచారానికి పిలుపు ఇచ్చిన ఇత్తెహద్–ఎ–మిల్లత్ మండలి ప్రధానాధిపతి, గురువు తౌజీర్ రజాఖాన్ అనుంగు సహచరుడి కల్యాణ మంటపాన్ని ఉత్తర ప్రదేశ్ బరేలీ పోలీసులు కూల్చివేశారు. 'ఐ లవ్ మహ్మద్' ప్రచారం సంబంధించి గతనెలాఖరున ఘర్షణలు జరిగాయి. ఈ కేసులో పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో రజాఖాన్ అనుచరుడు డాక్టర్ నఫీజ్ ఉన్నారు. ఆయనకు బరేలీలో ఒక కల్యాణ మంటపం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కల్యాణ మంటపాన్ని నిర్మించారనే వంకతో పోలీసులు శనివారం తెల్లారు జామునే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం నాటికి మూడు బుల్ డోజర్లు ఈ ప్రాంగణానికి చేరకుని కొన్ని భాగాలను కూల్చివేశాయి. బరేలీ డవలప్‌మెంట్ ఆథారిటీ (బిడిఎ) అధికారులు కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈ కల్యాణమంటపాన్ని కూల్చేశారు. దీని యజమాని నఫీజ్ కూడా ప్రస్తుతం జైలులో ఉన్నారు. దాదా పు మూడుగంటలపాటు ఈ కూల్చివేత చర్య కొనసాగింది. జిల్లా మెజిస్ట్రేట్ అవినాశ్ సింగ్, సిటీ పోలీస్ సూపరింటెండెంట్ మానుష్ పారిఖ్‌ల పర్యవేక్షణలో ఈ కల్యాణ మంటపాన్ని కూల్చివేసి ఈ ప్రాంగణానికి తాళం వేశారు. భారీసంఖ్యలో పోలీసులు కూల్చివేత సమయంలో ఈ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. కూల్చివేత సందర్భంగా ఈ ప్రాంతం మొత్తానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. బిడిఎ వైస్–ఛైర్మన్ మణికండన్ దీనిపై మాట్లాడుతూ, పట్టణ సంస్థ ఆమోదించిన ప్రణాళికకు విరుద్ధంగా ఈ కల్యాణ మంటపం నిర్మించారని చెప్పారు. న్యాయపరమైన నిబందనలకు అనుగుణంగా కూల్చివేత కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అదేవిధంగా సైలానీ ప్రాంతంలో 15 ఆక్రమిత దుకాణాలను కూడా పోలీసులు తొలగించారు.ఈ ఏడాది సెప్టెంబరు 26వ తేదీన శుక్రవారం ప్రార్థనల తర్వాత బరేలీలోని ఇస్లామియా గ్రౌండ్‌లో రజాఖాన్ ఇతరులు సమావేశమయ్యారు.అనుమతి నిరాకరించినప్పటికీ సమావేశం నిర్వహించారు. 'ఐ లవ్ మహ్మద్' పోస్టర్లు వేసిన వారిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడాన్ని వ్యతిరేకించారు. నిరసన ప్రదర్శనలు జరిపారు. పోలీసుల సమాచారం ప్రకారం సెక్షన్ 163ని ఉల్లంఘించి వివిధ ప్రాంతాలలో వారు రాళ్ళ దాడులు చేశారు. ఈ దాడుల్లో చాలామంది గాయపడ్డారు.

# ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలకు 8వరకు గడువు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (కెఎన్ఆర్ యూహెచ్ఎస్) అండర్ గ్రాడ్యుయేట్ ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలకు గాను ప్రభుత్వం దరఖాస్తు గడువును పొడిగించింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 8 వ తేదీ రాత్రి 11:30 గంటల వరకు పొడిగించినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటించారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను బిఎఎంఎస్, బిహెచ్ఎంఎస్, బియూఎంఎస్, బిఎన్ వైఎస్ కోర్సుల్లో రాష్ట్ర కోటా కింద, ప్రైవేట్ హోమియోపతి కళాశాలల్లోని బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ఆల్ ఇండియా కోటా కింద ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. యూనివర్సిటీ గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం చివరి తేదీ గత నెల 29 కాగా , తాజాగా ఈనెల 8వ తేదీ వరకు పొడిగించింది.
































































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com